శుక్రవారం
29-8-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 338
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ట్రంప్‌పై డెమొక్రాట్ల ఆగ్రహం

వాషింగ్టన్: ట్రంప్ సర్కారు తీరును విపక్ష డెమొక్రాట్‌లు తీవ్రంగా ఖండించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నెపంతో భారత్‌పై భారీ సుంకాలు విధించడాన్ని డెమొక్రాట్ విదేశీ వ్యవహారాల కమిటీ ఆక్షేపించింది. చైనాపై చర్యలు ఎందుకు తీసుకోరని అధ్యక్షుడిని నిలదీసింది. తాజా నిర్ణయం అమెరికన్లను బాధిస్తోందని తెలిపింది. భారత్-అమెరికా సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఎక్స్‌లో పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న ప్రతి దేశంపై ఆంక్షలు విధిస్తే సరే కానీ, ఒక్క భారత్‌పైనే సుంకాలు విధించడమేమిటని దుయ్యబట్టింది. ఇదే అంశమై న్యూయార్క్ టైమ్స్ కథనాన్నీ ప్రస్తావించింది.

భగవత్ యూటర్న్

న్యూఢిల్లీ: నాయకులు 75 ఏళ్లకు రిటైర్ అవ్వాలన్న వ్యాఖ్యలపై ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవన్ మాట మార్చేశారు. అలాంటి వ్యాఖ్యలు చేయలేదంటూ యూటర్న్ తీసుకున్నారు. 'నేను కానీ మరొకరు కానీ 75 ఏళ్లు వచ్చాక రిటైర్ అవుతారని ఎప్పుడూ అనలేదు. ఇది తప్పు' అని అన్నారు. ప్రధాని మోదీ సెప్టెంబరులో 75వ పడిలోకి అడుగుపెడతారు. ఈ నేపథ్యంలో భగవత్ గత ప్రకటన... ప్రస్తుత వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. బీజేపీ అధ్యక్షుడిగా గతంలో జేపీ నడ్డా ఎంపిక, కొత్త అధ్యక్షుడు ఎంపిక సహా అన్ని నిర్ణయాలు ఆర్‌ఎస్‌ఎస్ తీసుకుంటుందన్నది అవాస్తవమని భగవత్ అన్నారు.

20 కళాశాలలకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశరాజధాని ఢిల్లీలో వివిధ విద్యాసంస్థలకు వరుస బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. తాజాగా గురువారం దాదాపు 20 కళాశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ మెయిల్స్ ద్వారా ఈ బాంబు బెదిరింపులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. చాణక్యపురిలోగల జీసస్ అండ్ మేరీ కాలేజ్ సహా దాదాపు 20 కళాశాలలకు ఈ బెదిరింపులు వచ్చినట్లు చెప్పారు. బెదిరింపు మెయిల్స్‌తో అప్రమత్తమైన ఆయా కళాశాలల యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఢిల్లీ పోలీసులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన కళాశాలల వద్దకు చేరుకొని తనిఖీలు చేపట్టారు.

జర్నలిస్ట్ శర్మకు సుప్రీం ఉపశమనం

న్యూఢిల్లీ: జర్నలిస్ట్ అభిసర్ శర్మకు సుప్రీంకోర్టు ఉపశమనం కల్పించింది. అరెస్టు నుంచి నాలుగు వారాల మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలిచ్చింది. అసోం ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ చేసిన వీడియోపై ఎఫ్‌ఐఆర్‌ను సవాలు చేసేందుకు గువహతి హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. హైకోర్టుకు వెళ్లకుండా నేరుగా సుప్రీంకోర్టుకు ఆశ్రయించడాన్ని జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. ఎఫ్‌ఐఆర్‌పై సవాలు పిటిషన్‌ను స్వీకరించమని, హైకోర్టుకు వెళ్లాలని పేర్కొంది. ఇందుకోసం నాలుగు వారాల మధ్యంతర రక్షణ కల్పించింది.

ఇదీ లోకం!

యస్సార్..తెలుగు భాషా దినోత్సవం గ్రాండ్‌గా చేయమని ఇంగ్లీషులో జీవోలు ఇచ్చిపడేసా సార్!

జల ఖడ్గం

ఉత్తర తెలంగాణ అతలాకుతలం

- కుండపోత వర్షాలు ▸ అనేక గ్రామాలు నీటమునక
- సహాయం కోసం ఎదురుతెన్నులు
- నిండిన చెరువులు, కుంటలు ▸ తెగిన రోడ్లు, రైల్వే ట్రాకులు
- రవాణా వ్యవస్థకు తీవ్ర అంతరాయం
- స్తంభించిన జనజీవనం
- వర్షాలు, వరదలపై సీఎం సమీక్ష... ఏరియల్ సర్వే
- పదిమంది మృతి: డీజీపీ

విశాలాంధ్ర- హైదరాబాద్: బంగాళాఖాతంలో బలపడిన అల్పపీడన ప్రభావం యావత్తు తెలంగాణపై పడింది. గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తు న్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో వర్షాలు దంచికొడుతుండటంతో అనేక ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. కుండపోతగా కురిసిన వర్షానికి కామారెడ్డి, మెదక్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు అతలాకుతల మయ్యాయి. రికార్డు స్థాయి వర్షాలతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆకాశానికి చిల్లులు పడ్డాయా అన్నట్లుగా కురిసిన వానలతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోటెత్తిన వరద ప్రవాహానికి, అనేకచోట్ల చెరువులు, రోడ్లు తెగిపోయాయి. రహదారులు తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాలను వరద చుట్టుముట్టడంతో ఇళ్లు జలమయ్యాయి. బుధవారం ఒక్కరోజే కామారెడ్డి జిల్లాలోని రాజంపేటలో 44 సెంటి మీటర్ల వర్షం కురవగా గురువారం ఉదయం నాలుగు గంటల వ్యవధిలోనే రామారెడ్డి ప్రాంతంలో 17 సెంటి మీటర్ల వర్షం కురిసింది. రెండు రోజులుగా కుండపోతగా కురిస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్త మైంది. డోంగ్లి మండలంలోని సిర్పూర్, పెద్దటాక్లీ గ్రామాల్లోని ప్రజలు ఇళ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. పొరుగు గ్రామాల్లోని తమ బంధువుల ఇళ్లల్లో తలదాచుకుంటున్నారు. చిన్నారులు, వృద్ధులు మద్నూర్ మండలంలోని మిర్జాపూర్ (సలాబత్ పూర్) ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉంటున్నారు. పెద్ద టాక్లీలోని కొన్ని కుటుంబాలు డోంగ్లి మండల కేంద్రాల్లో తలదాచుకుంటు న్నారు. పిట్లం మండలం కుర్తి గ్రామం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది. నియోజక వర్గంలోని నిజాంసాగర్, కౌలాస్ నాలా జలాశయాల గేట్లు ఎత్తి నీటిని దిగువ మంజీరాలోకి విడుదల చేస్తున్నారు. దీంతో ముంపు గ్రామాల ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాల కారణంగా భిక్నూర్

- మిగతా 2 లో

నష్టం అంచనాలు సిద్ధం చేయండి
సీఎం రేవంత్ ఆదేశం

2లో

బీబీపేట-కామారెడ్డి మార్గంలో కొట్టుకుపోయిన వంతెన

కామారెడ్డి జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టించాయి. కుంభవృష్టి ధాటికి పలుచోట్ల జనజీవనం స్తంభించిపోయింది. చాలా ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమయ్యాయి. బీబీపేట నుంచి కామారెడ్డి వెళ్లే మార్గంలో వరద నీటి దాటికి వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు క్యాసంపల్లి శివారులో వరద తీవ్రతకు జాతీయ రహదారి బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో నిజామాబాద్ వైపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పోచారం జలాశయానికి భారీగా వరద పోటెత్తడంతో మెదక్, బోధన్ ప్రధాన రహదారిపై హై లెవల్ వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇరువైపులా వాహనాలు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరో మార్గం నుంచి వాహనాలు ప్రయాణించే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

క్రీడా ప్రపంచానికి
హైదరాబాద్ వేదిక కావాలి

- క్రీడా రంగం ప్రోత్సాహానికి 16 రెట్లు బడ్జెట్ పెంపుదల
- జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు
- స్పోర్ట్స్ హబ్ సమావేశంలో సీఎం రేవంత్
- క్రీడా పోటీలు, సబ్ కమిటీల ఏర్పాటుపై తీర్మానాలు

విశాలాంధ్ర - హైదరాబాద్: ఖేలో ఇండియా, కామన్వెల్త్, ఒలింపిక్స్ ... ఇలా ఏ పోటీలు నిర్వహించినా వాటిలో తమకు అవకాశం కల్పించాలని తెలంగాణ స్పోర్ట్స్ హబ్ తీర్మానం చేసింది. హైదరాబాద్‌లో గురువారం బోర్డు మొదటి సమావేశం జరిగింది. రాష్ట్రంలో స్టేడియాల నిర్వహణ, వసతులు మెరుగుపర్చడం, కోచ్‌లు, ట్రైనర్‌లకు శిక్షణ, క్రీడా పాలసీలో వివిధ అంశాలపై ప్రణాళిక రూపకల్పన, అమలుకు సబ్ కమిటీల ఏర్పాటుకు బోర్డు తీర్మానాలు చేసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడా విధానం, క్రీడల ప్రోత్సాహంపై ప్రతి ఒక్కరూ హైదరాబాద్ గురించి మాట్లాడుకోవాలనేదే తన లక్ష్యమన్నారు. క్రీడా ప్రపంచానికి హైదరాబాద్ వేదికగా మారాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఐటీ సంస్కృతి ఉందని... రాష్ట్రంలోని ప్రతి కుటుంబం తమ పిల్లలు ఐటీ రంగంలో ఉండాలని కోరుకుంటున్నారని... అలానే క్రీడా సంస్కృతి రావాలని తాను అభిలషిస్తున్నట్లు సీఎం తెలిపారు. క్రీడా రంగం ప్రోత్సాహానికి గతంతో పోలిస్తే... 16 రెట్లు బడ్జెట్ పెంచామని వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహాలు ఇవ్వడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని చెప్పారు. క్రీడా రంగం ప్రాధాన్యతను పెంచేందుకు యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద

- మిగతా 2 లో

విశ్వసనీయత కోల్పోవద్దు

- రాజ్యాంగబద్ధ నిష్పాక్షిక సంస్థగా పనిచేయాలి
- ఎన్నికల సంఘానికి సీపీఐ హితవు: సీఈసీతో భేటీ

న్యూఢిల్లీ: రాజ్యాంగబద్ధ కర్తవ్యానికి కట్టుబడి పనిచేయాలని, విశ్వసనీయతను కోల్పోవద్దని కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీఐ) సీపీఐ ప్రతినిధి బృందం సూచించింది. నిష్పాక్షిక సంస్థగా ఉండాలని కోరింది. ఎన్నికలు స్వేచ్ఛగా, పాదర్శకంగా జరిగేలా చూడాలని, పోరాడి సాధించుకున్న ఓటు హక్కుకు హాని కలగనివ్వొద్దని సూచించింది. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా హామీ ఉండటం ఎన్నికల సంఘం బాధ్యతని గుర్తుచేసింది. ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా సాగేందుకు, విశ్వసనీయత ఉండేందుకు సలహాలు, సూచనలు చేసింది. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నాయకత్వంలో జాతీయ కార్యదర్శులు పల్లబ్ సేన్ గుప్తా, రామకృష్ణ పాండా, డాక్టర్ బాలచంద్ర కాంగోతో కూడిన ప్రతినిధుల బృందం గురువారం న్యూఢిల్లీలోని నిర్వచన్ భవన్ (ఈసీ కార్యాలయం)లో సీఈసీ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్బీర్ సింగ్ సంధు, డాక్టర్ వివేక్ జోషితో భేటీ అయింది. బీహార్‌లో ఎస్ఐఆర్, ప్రవర్తనా నిబంధనావళి అమలు సహా అనేక అంశాలపై చర్చించింది. రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం జరుపుతున్న సంప్రదింపుల్లో భాగంగా సీపీఐ బృందం భేటీ అయింది. అనంతరం డి.రాజా విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు ఈ సమావేశానికి

- మిగతా 2 లో

బాధితులను ఆదుకోండి
కేటీఆర్ డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్: భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు డిమాండ్ చేశారు. ప్రాణ నష్టం జరిగితే రూ.25 లక్షలు, పంట నష్టం జరిగితే ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వడంతో పాటు ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. గురువారం ఆయన సిరిసిల్ల జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. మానేరుకు లక్ష క్యూసెక్కుల వరద వస్తుంటే ప్రజలను అప్రమత్తం చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వారి ప్రాణాలతో చెలగాటం ఆడిందని మండిపడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను తరలించాలన్న ఇంగిత జ్ఞానం ప్రభుత్వానికి లేకుండా పోయిందన్నారు. వరదలతో రాష్ట్రం అతలాకుతలమవుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూసీ సుందరీకరణ పై, ఒలింపిక్స్ ఎలా తేవాలన్న అంశాలపై అధికారులతో రివ్యూ సమావేశాలు నిర్వహించడం దారుణం అన్నారు. రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టు రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండగా... మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించడానికి సత్వరం హెలికాప్టర్లను పంపి వారి ప్రాణాలను కాపాడారని గుర్తుచేశారు. గతంలో ఖమ్మంలో వరదలు

- మిగతా 2 లో

ప్రజల్ని కాపాడే పనిలోనే ఉన్నాం
మంత్రి దామోదర్ రాజనర్సింహ

విశాలాంధ్ర బ్యూరో-మెదక్: భారీ వర్షాలు నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. గురువారం మెదక్ జిల్లా రామాయంపేటలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడారు... లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సహాయక చర్యలను చేపట్టాలని ఆదేశించారు. గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న అతి భారీ వర్షాల వల్ల రామాయంపేట జలదిగ్బంధంలో చిక్కుకుందన్నారు. 60 మందిని అధికార యంత్రాంగం కాపాడిందని, ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారన్నారు. వరదల్లో కొట్టుకుపోయిన ఒకరి

- మిగతా 2 లో

ప్రజావ్యతిరేక విధానాలపై
దశలవారీ ఉద్యమాలు

రేపు రవీంద్ర భారతిలో 'సురవరం' సంస్మరణ సభ

నియంత విధానాలు విడనాడాలని సజ్జనార్‌కు హితవు

- 'కాళేశ్వరం'తోనే రాష్ట్రం అప్పులమయం
- 'స్థానిక' ఎన్నికల్లో ఎక్కువ స్థానాల్లో పోటీ
- 11 నుంచి 17 వరకు సాయుధపోరాట వారోత్సవాలు
- డిసెంబరు 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభ
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడి

విశాలాంధ్ర- హైదరాబాద్: తెలంగాణ సమగ్రాభివృద్ధితో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో త్వరలోనే లక్షల మందితో తెలంగాణను దిగ్బంధం చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నరసింహా, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాలనర్సింహా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి కూనంనేని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్రంలో దశల వారీగా పెద్దఎత్తున ఉద్యమాలను చేపట్టనున్నట్లు ప్రకటించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ జాతీయ సమితి నిర్ణయాల మేరకు ఉద్యమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాల్సిన ప్రభుత్వం, ప్రైవేట్‌పరం చేసే కుట్రలో భాగంగానే

- మిగతా 2 లో

ఉక్రెయిన్‌పై 598 డ్రోన్లతో రష్యా దాడి

కీవ్: ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై రష్యా డ్రోన్లతో విరుచుకుపడింది. 598 డ్రోన్లు, 31 తేలికపాటి క్షిపణులతో దాడి చేసింది. ఈ మేరకు ఉక్రెయిన్ వైమానిక దళం వర్గాలు తెలిపాయి. 12 మంది చనిపోగా, 48 మందికి గాయాలైనట్లు వెల్లడించాయి. మృతుల్లో 2, 14, 17 ఏళ్ల పిల్లలు ఉన్నారు. ఇటీవల రష్యా చేపట్టిన అతిపెద్ద దాడి ఇదే. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు వర్గాలు తెలిపాయి. శాంతి చర్చలకు రాకుండా బాలిస్టిక్ క్షిపణులతో రష్యా దాడులు చేస్తుండటంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మండిపడ్డారు. శాంతిని కోరుకునే ప్రపంచ దేశాలు స్పందించాలని పిలుపునిచ్చారు. కీవ్ నగరంలోని దాదాపు 20 ప్రాంతాల్లో డ్రోన్ దాడులు జరిగాయి. సుమారు 100 భవనాలు దెబ్బతిన్నాయి. 563 డ్రోన్లు, 26 క్షిపణులను కూల్చినట్లు ఉక్రెయిన్ వైమానిక దళం ప్రకటించింది. రష్యాను ఆర్థికంగా దెబ్బతీసేలా అమెరికా కీలక నిర్ణయాలు తీసుకుంటుందని జెలెన్‌స్కీ భావిస్తున్నారు. 'యుద్ధాన్ని ముగించేందుకు ఇచ్చిన గడువులను రష్యా అతిక్రమించింది. శాంతి కుదిర్చే దౌత్య ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి' అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. ఇదిలావుంటే గురువారం రాత్రి ఉక్రెయిన్‌కు చెందిన 102 డ్రోన్లు కూల్చినట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. క్రాస్నోదార్ ప్రాంతంలోని అఫిప్‌స్కీ చమురుశుద్ధి కర్మాగారంపై డ్రోన్ దాడి కారణంగా మంటలు చెలరేగినట్లు స్థానిక అధికారులు తెలిపారు. సమర రీజియన్‌లోని మరో చమురు శుద్ధి కేంద్రంపైనా డ్రోన్ దాడి చేసినట్లు తెలుస్తోంది.

'కిల్ ట్రంప్... న్యూక్ ఇండియా'

- తుపాకులపై రాతలు: అమెరికా స్కూల్లో కాల్పులు
- ఇద్దరు పిల్లల మృతి: 17 మందికి గాయాలు

మిన్నియాపోలీస్: అమెరికాలోని మిన్నియాపోలీస్ స్కూల్‌లో కాల్పులు కలకలం రేపాయి. ఎనన్‌సియేషన్ క్యాథలిక్ స్కూల్లో ప్రార్థన వేళలో రాబిన్ వెస్ట్‌మ్యాన్(23) కాల్పులకు తెగపడ్డాడు. ఈ ఘటనలో ఇద్దరు పిల్లలు చనిపోయారు. 17 మందికి గాయాలయ్యాయి. ప్రార్థన సమయంలో కిటికీలో నుంచి మూడు తుపాకులతో కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయుధాలను చట్టబద్ధంగానే కొనుగోలు చేసినట్లు తెలిపారు. అతను నేరచరితుడు కాదన్నారు. కాల్పులకు కారణాలు తెలియలేదని చెప్పారు. అయితే అతని వద్ద తుపాకీలపై 'కిల్ డోనాల్డ్ ట్రంప్, న్యూక్ ఇండియా, బర్న్ ఇజ్రాయిల్' (డొనాల్డ్ ట్రంప్‌ను చంపాలి. భారత్‌పై అణుబాంబులు వేయాలి. ఇజ్రాయిల్‌ను తగలబెట్టాలి) అని రాసివుండటం చర్చకు దారితీసింది. అతని వద్ద ఓ రైఫిల్, ఓ షాట్‌గన్, ఓ పిస్తోల్ ఉన్నాయి. వాటితో పిల్లలపై కాల్పులు జరిపాడు. ఆపై స్కూల్ పార్కింగ్‌లో శవమై కనిపించాడు. అతను 2020లో తన పేరును వెస్ట్‌మ్యాన్‌గా మార్చుకున్నట్లు కోర్టు రికార్డుల ద్వారా తెలిసింది. రాబిన్ డబ్ల్యూ అనే యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్న అతను... పది నిమిషాల నిడివిగల వీడియోలో తన ఆయుధాలు ప్రదర్శించాడు. 'కిల్ డోనాల్డ్ ట్రంప్, కిల్ ట్రంప్ నౌ, ఇజ్రాయిల్ మస్ట్ ఫాల్, బర్న్ ఇజ్రాయిల్' అని ఆ తుపాకుల మ్యాగ్జిన్లపై ఉన్నది. 'వేర్ ఈజ్ యువర్ గాడ్, ఫర్ ద చిల్డ్రన్' (పిల్లల కోసం మీ దేవుడు ఎక్కడ) అని కూడా ఒకదానిపై రాశాడు. 20 నిమిషాల నిడివిగల మరొక వీడియోలో వేర్వేరు జర్నల్స్‌కు చెందిన సమాచారం ఉన్నది. సిరిల్లిక్ భాషలో అది రాసినట్లు గుర్తించారు. స్కూలు పిల్లలపై కాల్పుల ఘటనపై మిన్నసోటా మేయర్ టిమ్ వాల్జ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు.

నాలుగేళ్ల నివాసానికే అనుమతి

విదేశీ విద్యార్థులకు అమెరికా కొత్త ఆంక్షలు

వాషింగ్టన్: విదేశీ విద్యార్థులు తమ దేశంలో నాలుగేళ్లకు మించి ఉండకుండా వీసా నిబంధనల్లో అమెరికా మార్పులు చేయనుంది. ఎఫ్-1 వీసాలున్న అంతర్జాతీయ విద్యార్థులు, జే-1 వీసాలపై వచ్చిన ఎక్స్ఛేంజ్ విజిటర్లకు 'డ్యూరేషన్ ఆఫ్ స్టే' వెసులుబాటు ఉంది. అంటే.. వారు ఎప్పటివరకు కావాలంటే అప్పటి వరకు చదువుకోవచ్చు లేదా ఇంటర్న్ ప్రోగ్రామ్ చేయొచ్చు. ఎక్స్ఛేంజ్ విజిటర్స్, ప్రొఫెసర్లు, స్కాలర్లు, స్పెషలిస్ట్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌లు, ఫిజీషియన్లకు ఈ సదుపాయం ఇప్పటివరకు ఉంది. ఈ నిబంధనల్లో మార్పులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం సిద్ధమైంది. ఇకపై 'పరిమితకాల నివాస అనుమతి'తో కూడిన వీసాలను మంజూరు చేయాలని ప్రతిపాదించింది. అమెరికన్ల ప్రయోజనాలకు విఘాతం కలగరాదన్న ఉద్దేశంతో కొన్ని రకాల వీసాదారుల నివాస అనుమతులపై పరిమితి విధించబోతున్నట్లు హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం పేర్కొంది. ఈ మేరకు చేసిన ప్రతిపాదనలు... ఎఫ్, జే వీసా పొందిన విదేశీ విద్యార్థులు, ఎక్స్ఛేంజ్ విజిటర్లు అమెరికాలో చదువుకునేందుకు గరిష్ఠ కాల పరిమితి నాలుగేళ్లుగా నిర్ణయించారు. గ్రాడ్యుయేట్ స్థాయి ఎఫ్-1 విద్యార్థులు కోర్సు మధ్యలో ప్రోగ్రామ్‌లు మార్చుకుంటే ఆంక్షలు తప్పవు. ఎఫ్-1 విద్యార్థులు చదువు పూర్తి చేసుకున్న తర్వాత మరో వీసా కావాలంటే అందుకున్న గడువు 60 రోజుల నుంచి 30 రోజులకు కుదించారు. విదేశీ మీడియా సంస్థల ప్రతినిధులు తీసుకునే ఐ-వీసా దారులు 240 రోజుల వరకు అమెరికాలో ఉండొచ్చు. ఆ తర్వాత మరో 240 రోజుల వరకు తమ నివాస అనుమతిని పొడిగించుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. దేశ భద్రతా ప్రయోజనాల దృష్ట్యా చైనా మీడియా ప్రతినిధులు అదనపు ఆంక్షలు ఎదుర్కోవాల్సి ఉంటుంది.

విశ్వసనీయత కోల్పోవద్దు

(మొదటిపేజీ తరువాయి)

హాజరైనట్లు తెలిపారు. రాజ్యాంగబద్ధ సంస్థగా తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని, ప్రతి పౌరుని ఓటు హక్కుకు హామీ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలిపారు. బీహార్‌లో ఓటర్ల జాబితాలో పేర్లు తొలగించడం తదితర అంశాలను ఈసీకి వివరించామన్నారు. ఎస్ఐఆర్ వల్ల సమస్యలు రావడాన్ని సీఈసీ దృష్టికి తీసుకెళ్లినట్లు రాజా వెల్లడించారు. ఇదే ఓటర్ల జాబితా ఆధారంగా 2024 లోక్‌సభ ఎన్నికలు జరిగాయని గుర్తుచేసినట్లు చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నిబంధనావళి అమలు, అన్ని పార్టీలకు సమాన అవకాశాల కల్పన, స్వేచ్ఛగా-పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా జరిగేందుకు కొన్ని సూచనలు చేశామని, ఎన్నికల సంఘం కూడా తాము తీసుకున్న చర్యల గురించి వివరించిందని డి.రాజా వెల్లడించారు. ఓటరు జాబితాల్లో అవకతవకలు, సామూహికంగా ఓటర్ల పేర్లు తొలగించడం, ఓటు హక్కు హరించడం వంటివి ఎన్నికల విశ్వసనీయతకు విఘాతం కలిగిస్తున్నాయని, రాజ్యాంగంలోని అధికరణ 324కు కట్టుబడి విధులు నిర్వర్తించాలని ఈసీకి సూచించినట్లు డి.రాజా చెప్పారు. ప్రజాస్వామ్యంలో చట్టబద్ధత, విశ్వసనీయతను కలిగిన నిష్పాక్షిక సంస్థగా ఎన్నికల సంఘం ఉండాలని సూచించామన్నారు. ఎలాంటి అనుమానాలకు తావివ్వరాదని, సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని హితవు పలికినట్లు చెప్పారు. ప్రజాస్వామ్యం, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం అన్ని ప్రజాస్వామిక శక్తులతో కలిసి రాజీలేని పోరాటాలను సీపీఐ కొనసాగిస్తుందని డి.రాజా స్పష్టంచేశారు.

హైదరాబాద్ వేదిక కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎత్తున స్టేడియాలు, అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు లేవని, వాటిని సమగ్రంగా సద్వినియోగం చేసుకోవడంతో పాటు క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిపేందుకు బోర్డు తగిన కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కోరారు. బోర్డులో ప్రముఖ కార్పొరేట్లు, క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులకు చోటు కల్పించామని తెలిపారు. ఇండియా క్రికెట్ టీమ్ మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ మాట్లాడుతూ తొలుత క్రీడా సంస్కృతిని పెంపొందించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పాల్గొనేలా చూస్తే ఫలితాలు వాటంతటవే వస్తాయని అభిప్రాయపడ్డారు. హర్యానాలో కుస్తీతో పాటు ప్రతి క్రీడకు పల్లెల్లో చోటు ఉందని గుర్తు చేశారు. ప్రముఖ షూటర్ అభినవ్ బింద్రా మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు, వ్యాయామ సంచాలకుడు ఉండేలా చూడాలన్నారు. 'ధాని ఫౌండేషన్' అధినేత వీటా ధానీ మాట్లాడుతూ పాఠశాలల స్థాయిలోనే క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యాయామ అక్షరాస్యత పై అవగాహన పెంపొందించాల్సి ఉందన్నారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి క్రీడా పోటీలు దశలవారీగా ఉండాలని... అప్పుడే మెరుగైన క్రీడాకారుల ఎంపిక సాధ్యమవుతుందన్నారు. స్పోర్ట్స్ హబ్ కో ఛైర్‌పర్సన్ ఉపాసన కొణిదెల మాట్లాడుతూ ఫిజియోథెరపిస్టు కోర్సులను క్రీడా యూనివర్సిటీలో ప్రారంభించాలని కోరారు. స్పోర్ట్స్ సామగ్రిపై పన్నుల భారం భారీగా ఉందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. స్పోర్ట్స్ హబ్ ఛైర్మన్ డాక్టర్ సంజీవ్ గోయెంకా మాట్లాడుతూ ప్రపంచ ప్రముఖ కంపెనీల సీఈవోలు ఈ ప్రాంతం వారే అయినందున వారి సేవలను క్రీడాభివృద్ధికి వినియోగించుకోవాలన్నారు. విశ్వ సముద్ర ఫౌండేషన్ చింతా శశిధర్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారికి అవసరమైన సామగ్రిని పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచితే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. క్రీడా నిర్వాహకులు బియ్యాల పాపారావు మాట్లాడుతూ ఐఐటీ ప్రొఫెసర్లు మాదిరి స్పోర్ట్స్ యూనివర్సిటీలో కోచ్‌లు ఉండాలన్నారు. ఫుట్ బాల్ టీమ్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా మాట్లాడుతూ గ్రామ స్థాయిలో స్టేడియాలు, క్రీడా సామగ్రి అందుబాటులో ఉండే క్రీడాకారులు వెలుగులోకి వస్తారని తెలిపారు. ఇంగ్లాండ్‌లో ప్రతి ఆటకు లీగ్స్ ఉంటాయని... అలాగే మన దగ్గర ప్రతి ఆటకు లీగ్స్ ఉండాలన్నారు. ప్రముఖ క్రీడాకారుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ మనకు ఉన్న స్టేడియాలను మెరుగ్గా వినియోగించుకోవాలని, వాటి నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. సూచనలపై స్పందించిన ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఉన్న క్రీడా పోటీల విధానాన్ని మార్చుతూ గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహిస్తామన్నారు. విజేతలుగా నిలిచిన జట్ల మధ్య పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించి అంతిమంగా రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయి జట్లను ఎంపిక చేస్తామన్నారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో ఫిజియోథెరపీ, ఇతర క్రీడా సంబంధిత కోర్సులు ప్రవేశపెడతామని బోర్డు సభ్యులకు హామీ ఇచ్చారు. స్టేడియాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తగిన సంఖ్యలో కోచ్‌లు లేరని, ఉన్న కోచ్‌లకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు తగినట్లు శిక్షణ ఇప్పించాల్సి ఉందన్నారు. రాబోయే మూడేళ్లలో మనం సాధించాల్సిన లక్ష్యాలపై బోర్డు తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. క్రీడా వ్యవహారాల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ఎండీ సోని బాలదేవి పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోండి

(మొదటిపేజీ తరువాయి)

వచ్చినప్పుడు కూడా ముగ్గురు మంత్రులు ఆ జిల్లా నుంచి ఉండి కూడా అక్కడికి హెలికాప్టర్ పంపలేక పోవడంతో అక్కడ ప్రాణ నష్టం సంభవించిందని తెలిపారు. ఇప్పుడు నర్మాల లో కూడా నేవీ హెలికాప్టర్లు వచ్చి వరదలో చిక్కుకున్న ఐదుగురిని సురక్షితంగా కాపాడాయన్నారు.

నష్టం అంచనాలు సిద్ధం చేయండి

విశాలాంధ్ర బ్యూరో- మెదక్: భారీ వర్షాలతో జరిగిన నష్టంపై యుద్ధ ప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే స్పందించాలని మెదక్ జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఏరియల్ సర్వే అనంతరం మెదక్ పోలీస్ పరేడ్ గ్రౌండ్లో హెలిపాడ్‌కు చేరుకున్న సీఎం... జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, సహాయక చర్యలపై కలెక్టర్ రాహుల్ రాజ్, అధికారులతో సమీక్షించారు. వరదబాధిత ప్రాంతాలతో కూడిన ఫోటో ప్రదర్శన తిలకించారు. సీఎం మాట్లాడుతూ...ఇటువంటి విపత్తులు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఆస్తి, పంట నష్టం, ప్రాణ నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన అంచనాలు తయారుచేసి, నష్టపరిహారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చీఫ్ సెక్రటరీని ఆదేశించారు. మెదక్ జిల్లాలో భారీ వర్షాలకు వాగులు, చెరువులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విపత్తు నిర్వహణలో లో భాగంగా వరద నష్టాలను అంచనాలు వేస్తూ శాశ్వత ప్రాతిపదికన హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టాన్ని అంచనాకు సంబంధించి ఫోటోలు, వీడియో ఫుటేజీ ద్వారా జిల్లాలో నష్టం వివరాలను భద్రపరచాలని సూచించారు. వర్షపాతం నమోదు వివరాలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ ప్రజలకు వివిధ జాగ్రత్తలు తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో యూరియా కొరత విషయంలో నానో యూరియాపై రైతులకు అవగాహన పెంపొందించాలన్నారు. ఈ సమీక్షలో స్పెషల్ ఆఫీసర్ హరీష్, కలెక్టర్ రాహుల్ రాజ్, అడిషనల్ కలెక్టర్ నగేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజల్ని కాపాడే పనిలోనే ఉన్నాం

(మొదటిపేజీ తరువాయి)

మృతదేహం లభించిందని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం వర్షాలు, వరద పరిస్థితిపై పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రభుత్వం పూర్తి అప్రమత్తతో ఉందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ప్రజలను కాపాడే పనిలో నిమగ్నమై ఉన్నారన్నారు. వరద ప్రాంతాల్లో, లోతట్టు ప్రాంతాల్లో చేపట్టిన సహాయక చర్యలపై కలెక్టర్, ఎస్పీలతో మంత్రి ఫోన్లో సమీక్షించారు. గత 50 ఏళ్లలో ఇంతటి భారీ వర్షాలను చూడలేదని స్థానిక ప్రజలు మంత్రికి తెలిపారు. బీసీ కాలనీలో నీట మునిగిన ఇళ్లను, వరద ఉధృతిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుతో కలిసి పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారికి నిత్యవసర వస్తువులు, భోజనాలు, బట్టలు, బెడ్ షీట్లను అందజేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నిజాంపేట మల్క చెరువు, కోనాపుర్, నందిగామ రోడ్డులో దెబ్బ తిన్న బ్రిడ్జి, సాయి చెరువు అలుగు లను మంత్రి పరిశీలించారు.

పభుత్వం విఫలం: హరీశ్‌రావు

మెదక్: భారీ వర్షాలతో ప్రజలు అతలాకుతలం అవుతుంటే సీఎం రేవంత్ రెడ్డి స్పందించకపోవడం శోచనీయమని మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజమెత్తారు. మెదక్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలు పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదతో సగం తెలంగాణ ఆగమాగం అవుతుంటే రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్ లో కూర్చొని మూసీ సుందరీకరణ, స్పోర్ట్స్ పై రివ్యూ నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. హెలికాప్టర్లు సకాలంలో పంపి ఉంటే రాజ్ పేటలో ఇద్దరి ప్రాణాలు దక్కేవన్నారు. పెళ్లిళ్లకు హెలికాప్టర్లు వాడుతారు కానీ, ప్రజల ప్రాణాలు కాపాడడానికి హెలికాప్టర్లు వాడరా? అని ప్రశ్నించారు. ఇంత దారుణంగా పరిస్థితి ఉంటే, ప్రభుత్వం ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. ప్రతిపక్ష నాయకులు పట్టిలేపితే తప్ప ప్రభుత్వం మేల్కోలేదన్నారు. మూడు రోజులుగా ధూప్ సింగ్ తండా వాసులు నీటిలో ఉన్న పట్టించుకోవడం లేదన్నారు.

దశలవారీ ఉద్యమాలు

(మొదటిపేజీ తరువాయి)

వాటిని కావాలనే నిర్లక్ష్యం చేస్తున్నట్లు కనబడుతోందని కూనంనేని అనుమానం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించడంలేదని, సింగరేణిని ప్రైవేటీకరణ దిశగా చర్యలు చేపట్టడం ప్రభుత్వానికి తగదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవడంతో పాటు కార్మికుల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర విభజన చట్టం ప్రకారం బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాల్సి ఉండగా అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ ఫ్యాక్టరీని సాధించుకునేంత వరకు ఉద్యమం చేపడతామన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఓ నియంతలా వ్యవహరిస్తున్నారని కూనంనేని ఆగ్రహం వ్యక్తం చేశారు. సజ్జనార్ ... ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ కావచ్చు... కానీ అలాంటి భయానక వాతావరణాన్ని ఆర్టీసీలో సృష్టించి కార్మికులను భయాభ్రాంతులకు గురిచేయడమేమిటని ప్రశ్నించారు. ఇకనైనా కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని హితవు పలికారు. లేకపోతే పదవి నుంచి వెళ్లి పోయేంతవరకు ఉద్యమిస్తామని కూనంనేని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపేరుతో రాష్ట్రాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని, ఇతర ప్రాజెక్ట్‌లను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. తక్కువ వ్యయంతో పూర్తి కావాల్సినేక ప్రాజెక్టులను పట్టించుకోకుండా కాళేశ్వరం ప్రధాన అజెండాగా వేల కోట్ల అప్పులు తెచ్చి మట్టిలో పోశారన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు రాష్ట్ర , రైతాంగ సమస్యలపై పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. దశబ్దాల కాలంగా ప్రభుత్వ స్థలాల్లో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న లక్షలాది మంది నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పట్టాలను మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టాలు ఇవ్వడం ద్వారా ప్రభుత్వానికి పైసా ఖర్చు లేకపోగా, ముఖ్యమంత్రికి మంచి పేరు వస్తుందని, తక్షణమే నిర్ణయం తీసుకోవాలని కోరారు. అధికారులు పేదల గుడిసెలను నిర్దాక్షిణ్యంగా తొలిగించి నిరాశ్రయులను చేయడం సరికాదని, ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిస్టు దిగ్గజం, మాజీ ఎంపీ సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభ ఈనెల 30 రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు కూనంనేని తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ తదితర ప్రముఖులు హాజరు కానున్నట్లు వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాల్లో పోటీ చేయనున్నట్లు కూనంనేని స్పష్టం చేశారు. కలిసొచ్చిన చోట కాంగ్రెస్, సీపీఐ(ఎం)లతో పొత్తు కొనసాగుతుందని, సాధ్యం కాని చోట ఒంటరిగా బరిలోకి దిగుతామని చెప్పారు. సీపీఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను డిసెంబరు 26న ఖమ్మంలో ఘనంగా నిర్వహించనున్నట్లు కూనంనేని తెలిపారు. లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 26 దేశాల ప్రతినిధులతో పాటు సీపీఐ జాతీయ నాయకులు, దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి కమ్యూనిస్టు పార్టీ నేతలు హాజరు కానున్నారని వివరించారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను సెప్టెంబరు 11 నుంచి 17 వరకు సీపీఐ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణ సాయుధ పోరాటయోధుల త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఉద్యమాన్ని, వారి త్యాగాలను స్ఫురించే విధంగా సెప్టెంబరు 17కు నామకరణం చేసి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు మేడ్చల్ జిల్లా గాజుల రామారంలో జరిగిన సీపీఐ రాష్ట్ర నాల్గవ మహాసభలు ఘనంగా ముగిశాయని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా తనను, సహాయ కార్యదర్శులుగా తక్కెళ్లపల్లి, శ్రీనివాసరావు, ఇటి నరసింహాలను ఏకగ్రీవం ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. 31 మందితో కార్యవర్గం, 101 మందితో నూతన కౌన్సిల్, 9 మందితో కంట్రోల్ కమిషన్ ఎన్నికైందని వివరించారు. సెప్టెంబరు 21 నుంచి 25 వరకు జాతీయ మహాసభలు చండీగఢ్ లో జరుగుతాయని, ఈ మహాసభలకు రాష్ట్రం నుంచి 82 మంది ప్రాతినిధ్యం వహించనున్నరని వెల్లడించారు. తొలుత తీసుకున్న నిర్ణయాలు, తీర్మానాలు, భవిష్యత్ పోరాట కార్యాచరణను వివరించారు. మట్టి మనుషులను సాయుధులను చేసి సమరం నడిపిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని భావి తరాలకు అందించేందుకు హైదరాబాద్ లో 'స్మృతివనం' ఏర్పాటు చేయాలని చాడ వెంకట రెడ్డి డిమాండ్ చేశారు.

జల ఖడ్గం

(మొదటిపేజీ తరువాయి)

వద్ద ఎడ్లకట్ల వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద నీరు రహదారిపైకి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కామారెడ్డి నుంచి హైదరాబాద్‌కు వెళ్లే నాగపూర్ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే రహదారి వరద ప్రవాహం ధాటికి తెగిపోయింది. స్తంభంపల్లి వద్ద గంజి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ ప్రవాహంతో తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. దీంతో సుమారు 20 గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాగా జిల్లాలో వరదలో చిక్కుకున్న ఐదుగురిని ఆర్మీ సిబ్బంది రక్షించారు. గంభీరావుపేట మండలం నర్మాల వద్ద ఎగువ మానేరు ప్రాజెక్టుకు అవతలివైపు పశువులను మేపేందుకు బుధవారం ఐదుగురు వ్యక్తులు వెళ్లారు. ఒక్కసారిగా వరద రావడంతో వారంతా అక్కడే చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ తక్షణమే స్పందించారు. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మాట్లాడి రెండు హెలికాప్టర్లను తెప్పించారు. ఈక్రమంలో వరదలో చిక్కుకున్న వారిని గురువారం ఆర్మీ అధికారులు రెండు హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతానికి తరలించారు. కాగా, ఎగువ ప్రాంతాల నుండి భారీగా వరదనీరు ప్రాజెక్టులకు వచ్చి చేరడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వర్షాల కారణంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఉన్నతాధికారులు అందరూ కూడా ఎప్పటికప్పుడు కిందిస్థాయి అధికారులను అప్రమత్తం చేస్తూ పరిస్థితులను సమీక్షిస్తున్నారు. ఎక్కడా ప్రాణ నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవడంతో పాటు వరద కారణంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. కాగా 10 జిల్లాల్లో ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్ అలర్ట్) సంభవించే అవకాశమున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, కామారెడ్డి, కొమురంభీం, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి, వికారాబాద్ ఈ జాబితాలో ఉన్నాయి. కాగా, రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, వరదలు, ఉత్పన్నమైన పరిస్థితులు, సహాయక చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జూబ్లీహిల్స్ నివాసంలో సమీక్ష నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శీతక్క తెలంగాణ చీఫ్ సెక్రటరీతోపాటు, ఉన్నతాధికారులతో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. వరద ప్రభావిత జిల్లాల్లోని అధికారులను అప్రమత్తం చేయటంతో పాటు తక్షణం చేపట్టాల్సిన సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. స్థానికంగా ప్రజలను అప్రమత్తం చేయడమే కాకుండా సహాయక చర్యలను ముమ్మరం చేయాలని సీఎం చెప్పారు. అనంతరం వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఏరియల్ సర్వే నిర్వహించారు. ముంపు ప్రాంతాలను పరిశీలించేందుకు సీఎం రేవంత్ బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరి వెళ్లారు. సీఎం వెంట ఏరియల్ సర్వేకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కూడా ఉన్నారు. పెద్దపల్లి, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను సీఎం రేవంత్ పరిశీలించారు. ఏరియల్ సర్వే అనంతరం ఆయన ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి, వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ప్రాజెక్టుకు వస్తున్న వరద, ప్రస్తుతం ఉన్న నీటి నిలువ, దిగువకు వదులుతున్న వరద మొదలగు వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్వహణ పకడ్బందిగా ఉండాలని, వరద ముగిసే సమయానికి ప్రాజెక్టు నీటి నిల్వ పూర్తి స్థాయిలో ఉండేలా చర్యలు చేపట్టాలని సీఎం సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వరద పెరిగే నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. గోదావరి నీటిని తెలంగాణ రాష్ట్ర ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా జంక్షన్ లాగా ఎల్లంపల్లి ప్రాజెక్టును ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని సీఎం తెలిపారు.

విద్యా సంస్థలకు సెలవు, పరీక్షలు రద్దు

భారీ వర్షాల కారణంగా జేఎన్‌టీయూ పరిధిలో శుక్ర, శనివారాల్లో జరగాల్సిన అన్ని పరీక్షలు రద్దు చేశారు. పరీక్షలు ఎప్పుడు నిర్వహించేదీ తేదీని త్వరలో నిర్ణయిస్తామని ప్రకటించారు. వరద ముంచెత్తుతున్న కామారెడ్డిలో శుక్ర, శనివారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించగా... మెదక్ జిల్లాలో శుక్రవారం సెలవు ప్రకటించారు. ఇక హైదరాబాద్ లో భారీ వర్షాల నేపథ్యంలో స్థానిక పరిస్థితులును బట్టి స్కూళ్లు, కాలేజీలకు సెలవులపై నిర్ణయం తీసుకునే అధికారం ఆయా జిల్లా కలెక్టర్లకు ఇచ్చారు.

ప్రమాదకర స్థాయిలో జలాశయాలు....

తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న అతి భారీ వర్షాల వల్ల వివిధ ప్రాజెక్టులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి. కుండపోత వర్షాల వల్ల మిడ్ మానేరు రిజర్వాయర్ లోకి లక్ష క్యూసెక్కుల నీరు వస్తుందని తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు చెప్పారు. మిడ్ మానేరు జలాశయంలో 17 గేట్లు తెరిచి 45వేల క్యూసెక్కుల వరదనీటిని లోయర్ మానేరు జలాశయంలోకి విడుదల చేశారు. మరో 9,600 క్యూసెక్కుల నీటిని అన్నపూర్ణ రిజర్వాయరులోకి విడుదల చేశారు. నిజాంసాగర్, పోచారం ప్రాజెక్టులకు వరదనీరు భారీగా చేరింది. సింగూరు నది వరదనీరుతో నిండింది. అనేక చెరువులు నిండిపోయి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయి. బీబీపేటతోపాటు హైదరాబాద్ నగరానికి మంచినీరందిస్తున్న జంట జలాశయాలు వరదనీటితో నిండిపోయాయి. ఉస్మాన్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 1790 అడుగులు కాగా ప్రస్తుతం 1789 అడుగుల మేర నీరు చేరింది. దీంతో రెండు గేట్లు తెరచి 226 క్యూసెక్కుల వరదనీటిని మూసీనదిలోకి వదిలారు. హిమాయత్ సాగర్ రిజర్వాయరు పూర్తి స్థాయి నీటి మట్టం 1763 అడుగులు కాగా ప్రస్తు తం దీనిలోకి 1762.82 అడుగుల నీరు చేరింది. దీంతో ఒక గేటు తెరచి 339 క్యూసెక్కుల వరదనీటిని మూసీలోకి వదిలారు. మూసీ తీర ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వరదనీటితో కామారెడ్డిలోని పలు లోతట్టుప్రాంతాలు జలమయం అయ్యాయి. వరదనీటి ప్రవాహంతో 44 నంబరు జాతీయ రహదారిని మూసివేశారు. కామారెడ్డి జిల్లాల్లో కేవలం 14 గంటల్లో 499 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరదనీరు పెరగడంతో ప్రజలు తీవ్ర భయాందోళనలు చెందారు. గోస్కే రాజయ్య కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు సహాయం కోసం తమ పైకప్పులపైకి ఎక్కారు. నక్కవాగు వాగులో ఒక కుటుంబం కారు కొట్టుకుపోయింది. భిక్కనూర్-తల్మడ్ల, అకాన్‌పేట్-మెదక్ మధ్య రైలు పట్టాలు కొట్టుకుపోయాయి. దీంతో దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. మరికొన్ని రైళ్లను దారి మళ్లించింది. కమ్యూనికేషన్ లైన్లు దెబ్బతిన్నాయి. రాకపోకలు నిలిచిపోయి అనేక గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి.

భద్రాచలం వద్ద పెరుగుతున్న నీటిమట్టం

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. బుధవారం వరకు తగ్గుతూ వచ్చిన గోదావరి నీటిమట్టం గురువారం ఉదయం నుంచి వేగంగా పెరుగుతోంది. ఉదయం 10 గంటలకు గోదావరి నీటిమట్టం 37 అడుగులకు చేరింది. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటి వల్ల ఇంకా నీటిమట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. చర్ల మండలంలోని తాలిపేరు జలాశయంలోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది.

2 వేల మందిని రక్షించాం...

వరదల కారణంగా ఇప్పటి వరకు 10 మంది చనిపోయినట్టు సమాచారం ఉందని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై పూర్తి అప్రమత్తంగా ఉన్నట్టు చెప్పారు. ఇప్పటి వరకు వరదల్లో చిక్కుకున్న దాదాపు 2వేల మందిని రక్షించినట్టు తెలిపారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్, ఆర్మీ సాయంతో రెండు హెలికాప్టర్ల ద్వారా బాధితులను రక్షించినట్టు డీజీపీ వివరించారు. రెండు వేల మంది సిబ్బందితో ఎస్డీఆర్ఎఫ్ ఏర్పాటు చేసి సహాయక చర్యలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు వరద ప్రభావిత ప్రాంతాల్లో కలిసి పనిచేస్తున్నాయన్నారు. ఒకవైపు గణేశ్ ఉత్సవాలు ఉన్నప్పటికీ.. వరదలపై పోలీసు శాఖ పోరాటం చేస్తోందని తెలిపారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం తరలించేందుకు డీజీపీ కార్యాలయంలో కూడా అత్యవసర బృందాలను సిద్ధంగా ఉంచామన్నారు. రాజధాని హైదరాబాద్‌లో భారీ వర్షాలు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

భారీ వర్షాలకు గనుల్లో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

పొంగుతున్న వాగులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : ఖమ్మం జిల్లాలో, కుండ పోతగా వర్షాలు కురవ డంతో జిల్లాలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. సత్తుపల్లి రామకృష్ణా పురం వద్ద ఉన్న సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లో బొగ్గుఉత్పత్తి నిలిచి పోయింది. ప్రధానంగా పత్తి, పెసర మొక్కజొన్న పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. జిల్లావ్యాప్తంగా రెండున్నర లక్షల ఎకరాలకు పైగా పత్తి పంట వేశారు. అల్పపీడనం ప్రభావంతో మంగళవారం సాయంత్రం నుండి కురిసిన భారీ వర్షాలకు అనేక ప్రాంతాల్లో ప్రతి పంట నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే మున్నేరుతో సహా వైరా నది, సత్తుపల్లి సమీపంలోని తమ్మిలేరు, కట్టలేరు బోనకల్లు నుండి ఖమ్మం మధ్యనున్న దాదాపు మూడు వాగులు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుండడం తో బోనకల్లు ఖమ్మం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ వాగులను ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించగా, తీగల బంజర వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు. జిల్లా సగటున 25.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా ఖమ్మం నగరంతో సహా అనేక గ్రామాల్లో పాలకు ప్రాంతాల ప్రజలు వర్షపు నీటితో ఇబ్బందులు పడ్డారు. సత్తుపల్లి సమీపంలోని కృష్ణపురం జివిఆర్ ఓపెన్ కాస్ట్ గనిలో 50వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు మూల స్తంభాలు

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల కీలకపాత్ర పోషిస్తారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. విద్యార్థులు దారి తప్పకుండా క్రమశిక్షణతో చదువుకునేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యయులదే అని అన్నారు. గురువారం సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఈఓలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ప్రతి పాఠశాలలో అత్యవసర సందర్భాలలో తప్పించి సోమ, మంగళవారాలు ఉపాధ్యాయులు తప్పనిసరిగా నూరు శాతం హాజరు కావాలని, తక్కిన రోజుల్లో టీచర్ల హాజరు శాతం పెంచాలని, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ 1 నుండి ప్రతి రోజు 9,10 తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని, అదేవిధంగా 6,7,8 తరగతుల విద్యార్థులకు "ప్రగతి గ్రూప్స్" పేరిట అదనపు తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో, ప్రతి విద్యార్థి నెలలో పది రోజులు తెలుగు చదవాలని (పఠనోత్సవం), చివరి పది రోజులు బేసిక్ మాథ్స్ చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశిస్తూ వీటిలో ప్రతిభ చూపెట్టిన విద్యార్థులను బహుమతులు ఇచ్చి ప్రోత్సాహించేందుకు ప్రతి కాంప్లెక్స్ హెడ్ మాస్టారుకి 3000 రూపాయలు కలెక్టర్ మంజూరు చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, కోఆర్డినేటర్లు జనార్దన్,శ్రావణ్ కుమార్, రాంబాబు, పూలమ్మ, ఎంఈవోలు, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, అధికారులు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

విశాలాంధ్ర - కోదాడ : సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ పనిముట్లను కోదాడ మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పాలెం రజని ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 25-26 సంవత్సరానికి గాను రైతులకు వ్యవసాయ పనిముట్లను 40 నుంచి 50శాతం సబ్సిడీపై అందిస్తుందన్నారు. చేతితో లేదా బ్యాటరీతో మందు కొట్టే పంపులు 182, పవర్ /త్రైవాన్ స్ప్రేయర్లు 27, రోటోవేటర్లు 8, సీడ్ ఫర్టిలైజర్ డ్రిల్ 2, పవర్ విడర్ 1, బ్రష్ కట్టర్ 2, పవర్ టిల్లర్ 2, మొక్కజొన్న పొట్టు తీసే యంత్రం 1, గడ్డి కట్టే యంత్రం 02, ట్రాక్టర్‌తో దున్నే పనిముట్లు 12, పొలం గట్టు చెక్కే యంత్రాలు 2 కావలసిన రైతులు సెప్టెంబర్ 5 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారం, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్‌కు సంబంధించిన పనిముట్లు అయితే ట్రాక్టర్ ఆర్‌సి జిరాక్స్, మండల కమిటీ తీర్మానంతో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారికి ఇవ్వాలన్నారు.

నేరేడుచర్లలో యూరియా కొరత లేదు

విశాలాంధ్ర - నేరేడుచర్ల : జిల్లాలో యూరియా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి స్పష్టం చేశారు. నేరేడుచర్ల సహకార సంఘంలో గురువారం ఆయన నిర్వహించిన తనిఖీ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లాకు 31 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందిందని, అందులో 29 వేల మెట్రిక్ టన్నులు ఆగస్టు వరకు రైతులు వాడుకున్నారని తెలిపారు. సెప్టెంబర్ నెలలో జిల్లాకు 16 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుం దని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకు ని కేంద్రానికి మరో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల ని కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశామని అన్నారు. అదేవిధంగా రైతులు నానో యూరియాను వినియోగించుకోవాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్ర మంలో మండల వ్యవసాయ అధికారి జావేద్, ఎఈఓ స్నేహ, సహకార సంఘం సి.ఈ.ఓతో పాటు పలువురు వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు ఎటువంటి ఆందోళన చెంద వద్దని, అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడిన కలెక్టర్, అత్యవసరమైతే తప్ప ఎవరూ ఇళ్ల నుండి బయటకు రాకూడదని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివసిస్తున్న వారు, లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని గుర్తించి పునరావాస కేంద్రాలకు తరలించామని తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబరు 9100577132ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ప్రాజెక్టులు, చెరువులు పూర్తిస్థాయిలో నిండి పోవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయని, ప్రజలు లోతట్టు పరిసరాలకు వెళ్లరాదని, మత్స్య కారులు, పశు కాపరులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని తెలిపారు. రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న ప్రాంతాల్లో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. లక్ష్మణచందా మండలంలోని మునిపల్లి గ్రామంలో వాగు అవతలి వైపు చిక్కుకుపోయిన శంకర్ అనే పశువుల కాపరిని ఎన్డీఆర్ఎఫ్ బృందాల సహకారంతో సురక్షితంగా రక్షించగలిగామని కలెక్టర్ వివరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపడుతున్నారని కలెక్టర్ భరోసా ఇచ్చారు. విలేకరుల సమావేశంలో డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలి : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : వర్షాలు, వరదల వల్ల మెదక్ జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. గురువారం మెదక్ పట్టణం, హవేలి ఘనపూర్ మండలంలో పర్యటించారు. ప్రజలతో కలిసి మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లాలో వరద పరిస్థితిపై కలెక్టరేట్లో అధికారులతో మంత్రి సమీక్షించారు. శాఖల వారీగా జరిగిన నష్టంపై వివరాలు అడిగి తెలుసు కున్నారు. నీట మునిగిన కాలనీలు, పురాతన ఇళ్ల విషయంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు, తక్షణ మరమ్మతులకు ప్రభుత్వం నుంచి ముఖ్యమంత్రి రూ. కోటి మంజూరు చేశారని, వరద నష్టం ఎక్కువగా ఉన్నందున అదనపు సాయం మంజూరుకు కృషి చేస్తానన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించాలని ఆదేశించారు. రోడ్లు తెగిన చోట, వరద ఉధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్లు తెగిన ప్రాంతాల్లో అధికారులు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించాలని సూచించారు. మెదక్ - అక్కన్నపేట మధ్య రెండు చోట్ల తెగిన రైల్వే వంతెన పునరుద్దరించేలా చూడాలన్నారు. నదులు, కాల్వలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని, ఎవరూ అటువైపునకు వెళ్లవద్దని, చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యే అవకాశం ఉందని, ఈ విషయమై ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని సూచించారు. పాత భవనాలు, ముంపు ప్రాంతాల్లో ప్రజలు ఉండవద్దన్నారు. వెంట ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, స్పెషల్ ఆఫీసర్ డా.హరీశ్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, అడిషనల్ కలెక్టర్ నగేష్ ఉన్నారు. హవేలి ఘనపూర్ మండలం రాజ్ పేట్ బ్రిడ్జ్ వద్ద రెండు వైపులా రోడ్డు తెగిపోయింది. విషయం తెలుసుకుని మంత్రి పరిశీలనకు వెళ్లారు. బూర్గుపల్లి వద్ద చెరువు అలుగు పారడంతో రోడ్డు తెగిపోయి అటు వైపు వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. అయిన మంత్రి రిస్క్ చేసి అవతలి గట్టుకు చేరి స్థానిక నాయకులు ఏర్పాటు చేసిన వాహనంలో ఎమ్మెల్యే రోహిత్‌ను వెంట పెట్టుకుని వెళ్లారు. బ్రిడ్జ్ వద్ద పరిశీలించిన అనంతరం జల దిగ్బంధంలో ఉన్న దూప్‌సింగ్ తండాను సమీపంలో బ్రిడ్జ్ వరకు వెళ్లారు. పరిస్థితి పరిశీలించారు. అంతకు ముందు హవెలి ఘనపూర్ మండలం నాగపూర్ గేట్ వద్ద కొత్తగా వేసిన జాతీయ రహదారి కొట్టుకుపోగా మంత్రి వివేక్ పరిశీలించారు. అక్కడి నుండి బ్యాతోల్, తిమ్మాయిపల్లి వద్ద తెగిపోయిన బ్రిడ్జిలను సందర్శించారు. ఎమ్మెల్యే రోహిత్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ శ్రీనివాస్ రావు, అదనపు కలెక్టర్ నగేష్, తహసీల్దార్ సింధు రేణుకా, చంద్రపాల్, మధుసూదన్ రావు, పర్శగౌడ్ తదితరులున్నారు.

సబ్ సెంటర్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : హెల్త్ సబ్ సెంటర్ల పరిధిలో షెడ్యూలు ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించి జిల్లా కలెక్టర్ అద్వైత కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లాలోని బయ్యారం మండలం లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, లేబర్ రూమ్, వార్డులు, మందుల స్టోర్ గది, ఈడిడి, ఐపి, ఓపీ, సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రిజిస్టర్లను, పరిసరాలను పరిశీలించి,బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని (8) హెల్త్ సబ్ సెంటర్లలో పరిధిలో షెడ్యూలు ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహిం చాలని, సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని తెలిపారు. అనఅనంతరం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) ను సందర్శించి, విద్యార్థులకు అందిస్తున్న విద్యా బోధనలు స్వయంగా పరిశీలించి వారిని అడిగి తెలుసుకు న్నారు. ఉపాధ్యాయులు నూతన పరిజ్ఞానం వినియోగించాలని, విద్యార్థుల మానసిక, ఆరోగ్య, విద్య, అంశాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు నిర్వహించాలని, తరగతి గదులు, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, పరిసరాలను సానిటేషన్ చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బయ్యారం - నామాలపాడు రహదారి మధ్యలో ఉన్న లోలెవల్ కాజువే (బ్రిడ్జి)ని సందర్శించి వర్షాలు కురుస్తున్న సందర్భంలో తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయ్, స్థానిక తహసిల్దార్ నాగరాజు, ఎంపీడీవో, సంబంధిత అధికారులు ఉన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు పోరాడుదాం

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్/ తొర్రూర్: బషీర్‌బాగ్ విద్యుత పోరాట అమర వీరుల ఆశయ సాధన కోసం పోరాటాలు కొనసాగిస్తామని సిపిఐ, సీపీఎం కార్యదర్శులు బందు మహేందర్, ఎండి యాకూబ్‌లు అన్నారు. గురువారం తొర్రూరు మండలం కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బషీర్బాగ్ విద్యుత్ పోరాటం జరిగి 25 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంలో అమరులైన వీర విప్లవయోధులను స్మరిస్తూ వారికి ఘనమైన నివాళి అర్పిస్తున్నాము. వారి త్యాగాల వల్లే విద్యుత్ సంస్కరణల వ్యతిరేక పోరాటం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిందని తెలిపారు. 2000 సం.లో కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీలను తగ్గించాలని, ప్రజా వ్యతిరేక సంస్కరణలను రద్దు చేయాలని అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా చలో హైదరాబాద్ కార్యక్రమంలో లక్షలాదిగా తరలివచ్చిన కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను చూసి ఉద్యమాన్ని అణిచివేయాలనే కుట్రలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో బషీర్బాగ్లో జరిపిన పోలీస్ కాల్పుల్లో వేల మందికి లాఠి దెబ్బలు, వందల మందికి తూటాలు దిగి, బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డిలు అమరులయ్యారని అన్నారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, సిపిఎం మండల నాయకులు వెంకట్ రెడ్డి, సిపిఎం పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీనివాస్, సిపిఐ పట్టణ కార్యదర్శి ముద్దరబోయిన వెంకన్న, పసుల యాకయ్య, సంపత్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

విశాలాంధ్ర - వనపర్తి : విద్యుత్ పోరాటంలో హైదరాబాద్ బషీర్బాగ్లో కాల్పుల్లో మరణించిన అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ ప్రవేగీకరణ వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ నేతలు పిలుపునిచ్చారు. వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేశ్, కార్యవర్గ సభ్యులు కళావతమ్మ శ్రీరామ్ గోపాలకృష్ణ మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో సీఎం చంద్రబాబువిద్యుత్ చార్జీల పెంపు, ప్రైవేటీకరణకు నిర్ణయించారన్నారు. దానికి వ్యతిరేకంగా వామపక్షాలు ఆరు నెలలపాటు వివిధ రూపాల్లో పోరాట కార్యక్రమాలను చేపట్టాయన్నారు. ఆగస్టు 28, 2000 సంవత్సరంలో ప్రభుత్వ తీర్పు నిరసనగా అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చి హైదరాబాద్ చేరుకున్నాయన్నారు. ప్రదర్శన బషీర్బాకు చేరుకోగానే పోలీసులు జలపి రంగులు, రాళ్ల తుపాకుల కాల్పులతో దాడి చేశారన్నారు. విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి, రామకృష్ణ కాల్పుల్లో చనిపోగా ముఖ్యమైన నాయకులు వందలాదిమంది గాయపడ్డారన్నారు. కేంద్రం విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించేందుకు వేగంగా అడుగులు వేస్తుందన్నారు. నిలువరించేందుకు నాటి పోరాట యోధుల స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు. ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరామ్, సిపిఐ పట్టణ సహకార దర్శి గోపాలకృష్ణ, భవనిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కుర్మయ్య, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ అధ్యక్షులు జయమ్మ, కో కన్వీనర్ శిరీష, లక్ష్మీనారాయణ, రమణ, జ్యోతి పాల్గొన్నారు.

పాము కాటుతో చిన్నారి మృతి

విశాలాంధ్ర - సత్తుపల్లి : కింద నేలపై పడుకున్న తల్లి కూతుర్లను పాము కాటు వేసింది. ఈ సంఘటనలో ఐదేళ్ల చిన్నారి మౌనిక మృతి చెందగా, ఆమె తల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ సంఘటన సత్తుపల్లి మండలం పాకల గూడెం గ్రామంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో జరిగినట్లు చిన్నారి తండ్రి గోపి తెలిపాడు. ఈ సంఘటనతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కన్న బిడ్డ కళ్ళముందే పాముకాటుతో మృతి వాత పడగా, కట్టుకున్న భార్య ఆసుపత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడు తుండడంతో గోపి తల్లడిల్లిపోతున్నాడు. చికిత్స పొందుతున్న ఆ తల్లి సైతం బిడ్డ మృతి చెందిన సంగతి తెలుసుకొని అల్లాడిపోతోంది.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : జాతీయ కుటుంబ ప్రయో జన పథకం కింద లబ్ధిదారులకు త్వరితగతిన మేలు చేకూరేలా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె శాలిగౌరారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసిల్దారు జమీరుద్దీన్ నుండి దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసు కున్నారు. మండలంలో ఏప్రిల్ 1, 2017 నుండి ఇప్పటివరకు 176 మరణాలు సంభవించగా, వాటిలో 73 మంది జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తు చేసుకున్నారని, వీటిలో 23 దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించినట్టు కలెక్టర్ కు అధికారులు వివరించారు. దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి, శనివారంలోగా అన్ని వివరాలను ఆర్డీవో ద్వారా ఆన్లైన్‌లో పంపించాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తరువాత కలెక్టర్ శాలిగౌరారం నుండి ఉట్కూరు రహదారిలో లెవెల్ కాజ్ వేపై ప్రవహిస్తున్న నీటిని పరిశీలించారు. ఉట్కూరు- బండమీదిగూడెం రహదారి వద్ద రోడ్డుపై నీరు ప్రవహిస్తున్న స్థితిని గమనించి తక్షణ చర్యలు తీసుకోవాలని, నివేదిక సమర్పించాలని తహసిల్దారు, ఎంపీడీవోలకు ఆదేశాలు ఇచ్చారు.

వర్షాలు తగ్గే వరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి : కలెక్టర్

విశాలాంధ్ర- ములుగు జిల్లా బ్యూరో : జిల్లాలో భారీ వర్షాలు, వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా వర్షాలు, వరదలు తగ్గేవరకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, లోతట్టు గ్రామప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అన్నారు. గురువారం గోవిందరావు పేట మండలం ప్రాజెక్టు నగర్ గ్రామంను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సందర్శించారు. అనంతరం ఎస్.ఎస్. తాడ్వాయి మండలం జాతీయ రహదారి 163 జలగలంచ వద్ద వరద ప్రవాహాన్ని, మొండియాల తోగు వద్ద రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహానికి దెబ్బతిన్న జాతీయ రహదారి 163 ని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లాలో గోదావరినది వరదతో అదేవిధంగా జంపన్నవాగు వరద ప్రవాహంతో పరిసర ప్రాంతాలకు సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని, వాగులు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జాతీయ రహదారుల ఇంజనీరింగ్ విభాగం డిఈ కుమారస్వామి, తహసిల్దార్ సృజన కుమార్, సురేష్ బాబు, ఎంపి డి ఓ మమత, సుమనవాణి, ఎంపి ఓ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పందులను నగరానికి దూరంగా తరలించాలి

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: ప్రజారోగ్యం దృష్ట్యా పందుల నగరానికి దూరంగా తరలించాలని పెంపకందారులను అదనపు కలెక్టర్, రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ కోరారు. పందుల పెంపకందారులతో గురువారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రకాల అంటువ్యాధుల వ్యాప్తికి పందులు కారణమవుతున్నందున జనావాసాల మధ్య వాటి పెంపకం చేపట్టరాదని అన్నారు. నగరంలో పందుల పెంపకం వదిలేస్తే జీవనభృతికి ఇబ్బందికి కలగకుండా కుటుంబంలో ఒకరికి ఏదేని ఒక రంగంలో శిక్షణ ఇచ్చి నైపుణ్యం పెంపొందించి ఉపాధి కల్పించే ప్రయత్నం చేస్తామన్నారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి.రామన్, పశు సంవర్ధక శాఖ రామగుండం అసిస్టెంట్ డైరెక్టర్ బి.శ్రీదేవి, సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్, నాగ భూషణం, ప్రజారోగ్య విభాగం సీనియర్ అసిస్టెంట్ పాల్, పందుల పెంపకందారుల సంఘం ప్రతినిధులు నరేష్, సమ్మయ్య పాల్గొన్నారు.

ఆదాయం, ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్

విశాలాంధ్ర - బూర్గంపాడు : జిల్లాలో ప్రజలకు అదనపు ఆదాయంతోపాటు ఉపాధి అవకాశాలు పెంచేలా మోడల్ డెమో ఫామ్‌ను రూపొందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం బూర్గం పహాడ్ మండలం మొరంపల్లి బంజర గ్రామపంచాయతీ పరిధిలోని కెనాల్ పక్కన ఉన్న నీటిపారుదల శాఖ భూమిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మోడల్ డెమో ఫామ్ స్థలాన్ని పరిశీలించారు. ఈ ఫామ్ అభివృద్ధిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కూరగాయల సాగు, మట్టితో ఇటుకల తయారీ యూనిట్, వెదురు, వక్కాయ కంచె, క్వాయిల్‌యూనిట్ షెడ్, సోలార్ డ్రైవర్ ఏర్పాటు చేయడంతో పాటు మునగ చెట్లు పెంచే విధంగా ప్రణాళికలు చేపట్టాలని సూచించారు. దీని ద్వారా రైతులకు మాత్రమే కాకుండా మహిళలకు కూడా ఉపాధి అవకాశాలు వుంటాయన్నారు. సరికొత్త వ్యవసాయ పద్ధతులు పరిచయం కావడం ద్వారా అదనపు ఆదాయ వనరులు వస్తాయన్నారు. తాసిల్దార్ బివిఎస్ ప్రసాద్, ఆర్ఐ నరసింహారావు, ఎస్సార్ఎల్పి ఏఈ సందీప్, ఎంపీఓ బాలయ్య, ఏపీఓ విజయలక్ష్మి, ఏపీఎం హేమంతిని, సెక్రెటరీ భవాని, అగ్రికల్చర్ ఆఫీసర్ నాగార్జున పాల్గొన్నారు.

గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : ఎగువన ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భద్రాచలం వద్ద క్రమేపీ గోదావరి నీటి ప్రవాహం పెరుగుతున్నట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు. ఇదే పద్యంలో పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ పోలీస్ అధికారులతో పాటు ప్రజలకు ఎస్పి పలు సూచనలు చేశారు. వరద చేరి అత్యవసరమైతే వెంటనే 100 కు ఫోన్ చేయ్యాలని కోరారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో ప్రకటించినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని ప్రజలకు సూచించారు. ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాలలో వున్న వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని తెలిపారు. సరదా కని చెరువులు, వాగులు వద్దకు వీడియోల కోసం, సెల్ఫీల కోసం వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దన్నారు. ప్రయాణాలు చేసేటప్పుడు బ్రిడ్జిలు, చప్టాలపై నుంచి వరద పారేటప్పుడు వాహనాలతో దాటే ప్రయత్నం చేయొద్దన్నారు.

రైతులకు సరిపడా ఎరువులు అందించాలి

విశాలాంధ్ర - చర్ల: చర్ల మండలంలో వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, ఆకు కూరగాయల వంటి పంటలు సాగుచేసుకుంటున్న రైతులకు ఎరువులు సకాలంలో సరిపడా సరఫరా చేయకపోవడం వల్ల నష్టాపోయే పరుస్థితి ఏర్పాండిందని రాష్ట్ర రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంద్రు వామనరావు అన్నారు. వివిధ డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని గురువారం చర్ల మండల తాసిల్దార్ శ్రీనివాస్‌కి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పులు చేసి సాగు ప్రారంభించిన రైతులకు ఎరువులు అందించకపోవడంతో దిగుబడి సన్నగిల్లే అవకాశం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి సరిపడా 10 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం 5.32 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుందన్నారు. బిజెపి పాలనలో లేని రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వం కావాలనే అనైతిక రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతంగానికి సరిపడా ఎరువులు అందించాలని డిమాండ్ చేసారు. జిల్లా కార్యవర్గ సభ్యులు అడ్డగర్ల తాతాజీ మాట్లాడుతూ పైరవీలు, దళారి వ్యవస్థలను అదుపుచేసి ప్రతి రైతుకు ఎరువుల అందించాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్రవ్యా ప్తంగా మండల తాసిల్దార్ కార్యాలయ వద్ద వినతి పత్రాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి నూప పోతయ్య, సహాయ కార్యదర్శులు కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, కోడి రెక్కల రాజారావు, నరసింహారావు, మహేష్, రమణ, రామారావు, సత్యనారాయణ, వీరబాబు, నాగేశ్వరావు, తేజ, వెంకటేశ్వరరావు, బాబురావు, గోపాలకృష్ణ, వసంత్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలు ఐక్యమత్యానికి వేదికగా నిలవాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మన భారతీయ పండుగలు, ఉత్సవాలు జాతి ప్రజల మధ్య ఐక్యమత్యానికి, సోదరబాబాన్ని పెంపొందించేందుకు వేదికలు కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ ఎకె. సాబీర్ పాషా ఆకాంక్షించారు. పట్టణంలోని 30వ వార్డు, మధురబస్తీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ గురువారం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత ఆయనకు ఆత్మీయంగా స్వాగతం పలికి శాలువా కప్పి పూలదండలు వేసి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన మాట్లాడారు. భారత సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమన్నారు. కులమతాలకతీతంగా అన్ని పండుగలు కలిసిమెలిసి నిర్వహించుకోవడం మన ప్రాంతంలోనే అధికంగా జరుగుతాయాన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ గణేష్ ఉత్సవ కమిటీలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించడమేకాకుండా పేదలకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టడం, అందరిని ఏకతాటిపైకి తీసుకురావడం అభినందనీయమన్నారు. సీపీఐ నాయకులు కందుల భాస్కర్, మాజీ కౌన్సిలర్ నేరెళ్ళ సమైఖ్య, పిడుగు శ్రీనివాస్, పీక కృష్ణ, మంచినీళ్ల విజయ్, సుధాకర్, కుమార్ పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - అశ్వరావుపేట : భారీ వర్షాల నేపథ్యంలో అశ్వారావుపేట నియోజక వర్గ వ్యాప్తంగా చెరువులు వాగులు వర్రెలు పొంగిపొర్లుతున్నాయని ఎమ్మెల్యే జారె ఆదినారా యణ అన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అందు బాటులో ఉండి అప్రమత్తం చెయ్యాలని ఆయన ఆదేశించారు. గురువారం మండల కేంద్రం దమ్మపేట, అంకంపాలెం, పట్వారిగూడెం, నెమలిపేట, ఆసన్న గూడెం గ్రామాలలో విస్తృతంగా పర్యటించారు. గత మూడు రోజులుగా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాల వల్ల వాగులు, కాలువలు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గ్రామాల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ తాగునీటి సరఫరాలో అంతరాయం రాకుండా చూడాలని సంబంధిత అధికారుల ను ఆదేశించారు. నియోజకవర్గ ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో సమీపంలోని అధికారులను లేదా ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

రైతాంగాన్ని ఇబ్బంది పెట్టటమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

విశాలాంధ్ర-కొత్తగూడెం: తెలంగాణ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తూ రైతాంగం పట్ల కుట్ర పన్నుతుందని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ఆరోపించారు. తెలంగాణకు అందించాల్సిన ఎరువులను తొక్కిపట్టి ఇక్కడి ప్రభుత్వాన్ని రైతాంగాన్ని ఇబ్బందులు పెట్టటమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా మారిందన్నారు. గురువారం పాల్వంచలో రైతు సంఘం అధ్వర్యంలో ప్రదర్శన, ధర్నా నిర్వహించి తహసిల్దార్‌కు వినతిపత్రం అందించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులకు సరిపడా యూరియాను తక్షణమే అందించాలని విశ్వనాథం డిమాండ్ చేశారు. రైతులు స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ నుండి పట్టణంలో భారీ ప్రదర్శన నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసారు. తహసిల్దార్ దారా ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలు సాగు చేస్తున్న క్రమంలో సరిపడా యూరియా అందించడంలో కేంద్ర ప్రభుత్వం కావాలనే దగా చేస్తుందన్నారు. రాజకీయ లబ్ది కోసం కేంద్ర ప్రభుత్వం తమ అనుకూల రాష్ట్రాలకు సరిపడా యూరియాను సరఫరా చేసిందన్నారు. కొంతమంది అధిక రేట్లకు యూరియాను అమ్ముతూ రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. నాయకులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, గుండాల నాగరాజు, నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, ఎస్. శ్రీనివాసరావు, వైయస్ గిరి, డి చెన్నయ్య, వెంకన్న, ఎన్.నాగేశ్వర రావు, అప్పారావు, రంజిత్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, మోహన్, శీను, అమృతరావు, కృష్ణ, సురేష్, ఎడవల్లి కృష్ణ, కరీం, లక్ష్మీ, పద్మ, రమ్య పాల్గొన్నారు.

సంపాదకీయం

మళ్లీ కొలీజియంపై రగడ

సుప్రీంకోర్టు కొలీజియంపై రగడ మళ్లీ మొదలైంది. కొలీజియం సభ్యురాలైన న్యాయమూర్తి బి.వి.నాగరత్న అసమ్మతి తెలియజేసినప్పటికీ బొంబాయి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అర్ధె, పట్నా హైకోర్టు న్యాయమూర్తి విపుల్ మనుభాయ్ పంచోలిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని కొలీజియం చేసిన సిఫార్సును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించేసింది. న్యాయమూర్తిగా పంచోలీ నియమాకానికి సుప్రీంకోర్టులో ఏకైక మహిళా న్యాయమూర్తి నాగరత్న అభ్యంతరం తెలియజేశారు. పంచోలి కన్నా సీనియర్లను కాదని ఆయనను నియమించడాన్ని నాగరత్న వ్యతిరేకించారు. ఇది సీనియార్టీ సూత్రాన్ని ఉల్లంఘించడమేనని ఆమె తన అసమ్మతి పత్రంలో తెలియజేశారు. ఈ అసమ్మతిని కొలీజియంలోని ఇతర సభ్యులూ పరిగణనలోకి తీసుకోలేదు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆమె అసమ్మతిని పట్టించుకోకుండా కొలీజియం సిఫార్సులను ఆమోదించేసింది. న్యాయమూర్తి నాగరత్న 2027లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కావాల్సి ఉంది. ఇతర న్యాయమూర్తుల సీనియారిటీని లెక్క చేయకుండా న్యాయమూర్తి పంచోలీని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించడం వల్ల అత్యున్నత న్యాయస్థానం మీద గౌరవం తగ్గుతుందని నాగరత్న హెచ్చరించారు. న్యాయమూర్తి పంచోలీ ముందు గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉండేవారు. ఆయనను పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బదిలీ చేయడాన్ని కూడా నాగరత్న అభ్యంతర పెట్టారు. గుజరాత్ హైకోర్టు నుంచి ఆయనను పట్నా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ చేయడమే అసంగతమని ఆమె అన్నారు. అత్యున్నత స్థాయిలో చర్చించిన తరవాతే ఈ తప్పుడు నిర్ణయం తీసుకున్నారని ఆమె అన్నారు. ఇప్పటికే గుజరాత్‌కు చెందిన జేబీ పార్డీవాలా, ఎన్‌వీ అంజరియా గుజరాత్‌కు చెందిన వారు. అయినా న్యాయమూర్తి పంచోలీని నియమించడంవల్ల గుజరాత్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్టు అవుతుందని, మిగతా కొన్ని రాష్ట్రాలకు తగిన ప్రాతినిధ్యం లేకుండా పోతుందన్నది న్యాయమూర్తి నాగరత్న వాదన. సీనియారిటీ జాబితాలో పంచోలీ 57వ స్థానంలో ఉన్నారు. ఆయనకన్నా ప్రతిభావంతులు, సీనియర్లు ఉండగా ఆయననే ఎందుకు నియమించాలి అన్నది ఆమె ప్రధానమైన అభ్యంతరం. ఇతర న్యాయమూర్తుల సీనియారిటీని పరిగణించక పోవడంవల్ల న్యాయమూర్తి పంచోలి 2031 అక్టోబర్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయిపోతారు. ఆయన 2033 మే దాకా ప్రధాన న్యాయమూర్తిగా ఉంటారు. పంచోలీ నియామకం న్యాయవ్యవస్థ ప్రయోజనాలను పరిరక్షించదన్నది నాగరత్న అభిప్రాయం.

సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు ఆధారంగా బొంబాయి హైకోర్టులో 14 మందిని అదనపు న్యాయమూర్తులుగా నియమించారు. కొత్తగా నియమితులైన న్యాయమూర్తులు సందేశ్ దాదాసాహెబ్ పాటిల్, శ్రీరాం వినాయక్ షిర్సత్ మొన్నటి దాకా సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, జాతీయ దర్యాప్తు సంస్థ న్యాయవాదులుగా ఉండేవారు. అంటే కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాసే వారిని సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమించారని అర్థం అవుతూనే ఉంది. మరో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన అశీశ్ సహదేవ్ చవాన్ మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేశారు. ఆయన కూడా ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టరేట్ కేసుల్లో వాదించేవారు. మరో న్యాయమూర్తిగా నియమితులైన ఫర్హాన్ పర్వేజ్ దుబాష్ అత్యంత శక్తిమంతమైన బొంబాయి హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యదర్శిగా ఉన్నారు. కొత్తగా ఎంపికైన న్యాయమూర్తుల్లో రాజ్ దామోదర్ వకోడే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌కి దగ్గరి బంధువు. ఆయన పేరును ఖారారు చేస్తున్నప్పుడు గవాయ్ కొలీజియం సమావేశం నుంచి తప్పుకున్నారు. ఇది ప్రధాన న్యాయమూర్తి గవాయ్ నిజాయితీకి నిదర్శనం కావొచ్చు. అయినా రాజ్‌దామోదర్ వకోడే నియామకం ఖరారై పోయింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సన్నిహితులైన వారు గవాయ్‌తో తమకున్న సంబంధాన్ని తెలియజేశారు. కొత్త న్యాయమూర్తుల నియామకానికి కొలీజియం గత 19వ తేదీన తన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకంలో బంధుత్వాలు, ఆశ్రిత పక్షపాతం కీలక పాత్ర పోషిస్తున్నాయన్న ఆరోపణ ఎప్పటి నుంచో ఉంది. ఇందిరా గాంధీ హయాంలో న్యాయమూర్తులని ప్రభుత్వానికి అనుకూలురను నియమిస్తున్నారన్న ఆరోపణలు తీవ్రమైన తరవాత క్రమంగా కొలీజియం ఏర్పాటైంది. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తులను కొలీజియం సిఫార్సుల మేరకే నియమిస్తున్నారు. అయితే న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకోవడం ఏమిటన్న విమర్శలు ఎదురవుతూనే ఉన్నాయి. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత న్యాయమూర్తుల నియామకం కోసం జాతీయ జ్యుడీషియల్ అకాడమీని ఏర్పాటు చేశారు. కానీ సుప్రీంకోర్టు ఈ చట్టం చెల్లదని కొట్టేసింది. అయినా వివాదాలు మాత్రం ఆగలేదు. అస్తమానం ఇందిరా గాంధీని విమర్శించే మోదీ ప్రభుత్వం కూడా ఆమె పద్ధతిలోనే న్యాయమూర్తుల నియామకంలో తమ పెత్తనం కొనసాగించడానికి ప్రయత్నిస్తూనే ఉంది. ఇది తరచుగా న్యాయవ్యవస్థకు, కార్యనిర్వాహక వర్గానికి (ప్రభుత్వానికి) మధ్య ఘర్షణకు తావిస్తోంది. ప్రభుత్వం తమకు అనువైన న్యాయమూర్తులను నియమించుకోవడం కన్నా కొలీజియం వ్యవస్థ మెరుగైందే అయినప్పటికీ దాని సిఫార్సుల మీద కూడా అనేక విమర్శలు ఉన్నాయి. అయినా మెరుగైన నియామక పద్ధతి కనిపెట్టే దాకా కొలీజియం వ్యవస్థ కొనసాగడమే మంచిదన్న అభిప్రాయం చాలా మందిలో ఉంది. న్యాయమూర్తుల నియామకంలో రాజకీయ జోక్యం నివారించడానికి కొలీజియం వ్యవస్థ ఉపకరిస్తోంది. కానీ ఆ వ్యవస్థ సైతం బంధు ప్రీతికి, ఆశ్రిత పక్షపాతానికి అతీతం కాదన్న విమర్శలను తోసిపుచ్చలేకపోతోంది. కొలీజియం వ్యవస్థ లేకముందు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించి న్యాయమూర్తులను నియమించే వారు. రాష్ట్రపతి నియమించడం అంటే అనివార్యంగా ప్రభుత్వ సలహా పాటించడమే. 1981 నాటి మొదటి జడ్జెస్ కేసులో రాష్ట్రపతి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించడం అంటే సమ్మతి పొందడం కాదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అంటే ప్రధాన న్యాయమూర్తి సలహా పాటించనక్కర్లేదన్న మాట. ఆ తరవాత 1993లో రెండవ జడ్జెస్ కేసులో సంప్రదించడం అంటే సమ్మతించడం అన్న అర్థం చెప్పారు. అంటే ప్రధాన న్యాయమూర్తి సలహా పాటించి తీరవలసిందే. అయితే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇతర సీనియర్ జడ్జీలను సంప్రదించి సలహా ఇవ్వాలన్న మాట. దాన్నే కొలీజియం అన్నారు. 1998 నాటి మూడవ జడ్జీల కేసులో కొలీజియం నిర్ణయం ఎలా జరగాలో చెప్పినా ఆ సంప్రదింపును కచ్చితంగా పాటించాలో లేదో తేల్చలేదు. 2015నాటి నాల్గవ జడ్జెస్ కేసులో న్యాయమూర్తుల నియామకంలో న్యాయవ్యవస్థ అభిప్రాయానికే ప్రాధాన్యత అన్నది రాజ్యాంగ మౌలిక సూత్రాల్లో భాగం అని చెప్పారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ న్యాయమూర్తుల నియామక కమిటీల్లో రాజకీయ నాయకుల అభిప్రాయానికి కూడా సమానమైన పాత్ర ఉంటుంది కనక దాన్ని సుప్రీంకోర్టు చెల్లదని ప్రకటించింది. 1981, 1993, 1998లో వరసగా మూడు జడ్జెస్ కేసుల తీర్పుల ఆధారంగా ప్రస్తుతం అమలులో ఉన్న కొలీజియం వ్యవస్థ అస్తిత్వంలోకి వచ్చింది.

ఆహారం- ఆనందం

ప్రతి మనిషికి ఆహారం, ఆనందం రెండూ ముఖ్యమే. కాని అవి ఈనాడు సగటు మనిషికి లభ్యం కావడం లేదు. తలసరి ఆదాయం, ఆనందం నేడు పెరగాలి. ఒక శాతం మంది ఆదాయం పెరుగుతోంది. జనాభాలో ఒక శాతంగా ఉన్న కేపిటలిస్టుల ఆదాయం మాత్రం గుర్రపు స్వారీలా పెరుగుతోంది తప్ప సగటు మనిషి ఆదాయం మాత్రం పెరగటం లేదు. ప్రజలందరి సొమ్ము వందల వేల ఎకరాలు పరిశ్రమల పేరుతో పెట్టుబడిదారులకు ప్రభుత్వం దోచిపెడుతోంది. అయినా ప్రజలు నోరు మూసుకుని మౌనంగా ఉంటున్నారు. దేశంలో ముఖ్యమంత్రులతో పాటు రాజకీయ నాయకుల ఆస్తులు పెరుగుతున్నాయి గాని వారి పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు గాని సమాజానికి తిండి పెట్టే రైతుల ఆదాయం మాత్రం పెరగటం లేదు. రోజువారి మనం కొనే ప్రతి వస్తువు ధర పెరుగుతోంది గాని నగటు మనిషి ఆదాయం పెరగటం లేదు. ఈ అన్యాయాన్ని ఒక్క కమ్యూనిస్టులు తప్ప ఎవరూ ప్రశ్నించటం లేదు. ప్రజలతో కల్సి పోరాటం చేయడంలేదు. ఇక మన గతి ఇంతేనని నోరు మూసుకుని సరిపెట్టుకోవలసిందేనా! అన్యాయాన్ని ఎదిరించి పోరాటం



చేయలేమా! అధికారంలో ఉన్నవారు గాని ప్రతిపక్ష పార్టీగాని అధిక ధరలపైన పోరాటం ఎందుకు చేయరో అర్థం కాదు.

అది సరే. ఒక సంగతి మర్చిపోతున్నాం. డబ్బుంటే చాలను కుంటున్నాం. ధరలు తగ్గి మనం కొనుగోలు చేసినంత మాత్రాన మనసుకు ఆనందం కలగదు. కానీ ఏనాడో మార్క్స్ చెప్పినట్లు తలసరి ఆదాయం పెరగవలసిందే. కాని తలసరి ఆనందం కలగదు. ప్రస్తుతం కావలసినంత డబ్బు ఉన్నవారు కూడా ఆదమరచి నిద్ర పోవడం లేదు. లేనివాడికొక సమస్య, ఉన్నవాడికొక సమస్య. ఆ సమస్యలు వేధిస్తూ ఉంటే మనసుకు ఆనందం ఎక్కడ నుంచి వస్తుంది. సమస్యలు లేకుండా ప్రతి మనిషి తన పక్కనున్న మనిషిని తనలాగే ప్రేమిస్తే సమస్యలుండవు. కాని మనిషే పక్క మనిషిని దోపిడీ చేస్తుంటే సహకారం మృగ్యమై బతుకు సమస్యల వలయంలో చిక్కుకుంటోంది. అందుకే ప్రతి మనిషి ఆదాయం ఉన్నా ఆనందించలేడు. సంపదతో పాటు సాంఘిక భద్రత అవసరం. సమాన సంపదతో పాటు సాంఘిక సమానత్వం ఉన్నప్పుడు మాత్రమే తలసరి ఆదాయంతో పాటు తలసరి ఆనందం ఉంటుంది. మార్క్స్ మహాశయు దన్నట్లు తలసరి ఆదాయం పెరగడంతో పాటు బుద్ధుడన్నట్లు తలసరి ఆనందం కూడా ముఖ్యం. సంపదతో పాటు సమస్యలు లేని సమాజం ఏర్పడినప్పుడే తలసరి ఆనందం దక్కుతుంది కాని ముందు పొట్ట నిండితేనే ఏదైనా చేయగలం. అందుకే ఆర్థిక సమానత్వం కోసం ముఖ్యంగా కమ్యూ నిస్టులు పోరాటం చేస్తున్నారు. వందల ఏళ్లనాడు మార్క్స్ సూచించిన పెట్టుబడిదారీ వ్యవస్థ వైపే ప్రభుత్వాలు పని చేస్తున్నాయి. సగటు మనిషి ఆదాయం కంటే రాజకీయ నాయకుల ఆదాయం గుర్రపు పరుగు పెడుతోంది. మన దేశంలోని ముఖ్యమంత్రుల ఆదాయం వివరాలు పేపర్లో చదివితే అర్థం అవుతోంది. నాయకులు తమ వ్యాపారాల తర్వాతే సగటు మనిషి గురించి ఆలోచిస్తున్నారని మనకు అర్థం అవుతోంది. సంవత్సరాలు గడుస్తున్న కొద్ది ఆ వ్యత్యాసం పెరుగుతూనే ఉంది. ఈ విషయం కమ్యూనిస్టులకు తప్ప ఎవరికి పట్టడం లేదు. మిగతా ప్రధాన పార్టీలు ఒకరి తర్వాత ఒకరు అధికారంలో ఉండి సంపాదించుకుంటూనే ఉన్నారు. ఆ అధికారం అడ్డం పెట్టుకుని అసాంఘిక చర్యలకు శాసన సభ్యులు పాల్పడుతుంటే వారిపై క్రమశిక్షణ చర్యలకు ఒక కమిటీ వేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోంది. అయినా లెక్క చేయని స్థితిలో ముఖ్యమంత్రి మరిమరి హెచ్చరికలు చేయవలసి వస్తోంది. యధారాజా తథాప్రజా అన్నట్లు ముఖ్యమంత్రులు, మంత్రులు, శాసన సభ్యులు అందరూ సంపాదన కోసం అవినీతిపరులుగా మారి క్రిమినల్ కేసులలో ఇరుక్కున్నట్లు పత్రికలలో చదివిన తరువాత కూడా వారి అనుచరగణం సంపాదన వైపే అడుగులు వేస్తున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రస్తుత సమాజాన్ని మార్చగల శక్తి యువతకే ఉంది. యువతే ఆ బాధ్యత తీసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో యువతతో పాటు ఆ బాధ్యత కమ్యూనిస్టులే తీసుకోవాలి.

అందుకే ఈ సమాజాన్ని మార్చగల శక్తి కమ్యూనిస్టులకే ఉందని తల నెరసిన ప్రతి వ్యక్తి నమ్మి ప్రజల కోసం కమ్యూనిస్టు పార్టీలన్నీ కలవాలని మనసార కోరుకుంటున్నారు. ప్రజల కోసం ప్రజల్లో పుట్టి ప్రజా సమస్యల కోసం జైలుకెళ్లి ప్రాణాలర్పించిన కమ్యూనిస్టులు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల కోసం ఎందుకు కలవరని సామాన్య ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత కొంతకాలంగా ఈ ప్రశ్న ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఇప్పటికైనా అన్ని కమ్యూనిస్టు పార్టీల నాయకులు వారి పోరాటం ప్రజల కోసమే కనుక చిన్నచిన్న అవగాహన లోపాలుంటే వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం కల్సి ఒకే పార్టీగా రూపొందితే ప్రజలు వెనుక నడవడానికి సిద్ధంగా ఉన్నారు. 1940, 1950 నాటి తీపి గుర్తులు వయసు పైబడిన వారు నెమరు వేసుకుంటున్న సంగతి నాయకులు గుర్తించాలి.

సెల్: 9885569394

సురవరం స్ఫూర్తితో...!

ఏబీ కూన

ఎర్ర కణికలు ఎగిసిపడినట్లు... విప్లవజ్వాలలు రగిలినట్లు... భూమ్యాకాశాలు ఏకమై ఎర్రపొద్దు పొడిచినట్లు... ఒంగోలు నగరం అరుణార్ణవమయింది. ఈ అభివర్ణన నిజంగానే ఓ ప్రత్యేకం. కమ్యూనిస్టు పార్టీకి కొత్తకళ వచ్చినట్లు సామాన్య కార్యకర్త సైతం ఉత్సాహవంతుడై ఉరికురికి ముమ్ముందుకు కదిలిన వైనం కళ్లకు సాక్షాత్కరించింది. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి 28వ మహాసభలు ప్రకాశం జిల్లా కేంద్రమైన ఒంగోలులో 2025 ఆగస్టు 23, 24, 25 తేదీల్లో మూడు రోజులపాటు విజయవంతంగా జరిగాయి. భారీ ప్రదర్శనలు, బహిరంగసభలు, ఎన్నో తీర్మానాలు, ఇంకెన్నో చర్చోపచర్చలు... సీపీఐ మహాసభలకు సర్వసాధారణమే అయినప్పటికీ, ఈసారి మాత్రం కాస్త భిన్నంగా, కేడర్‌లో ఇంకాస్త స్ఫూర్తిని ఇనుమడింపజేసేలా సాగిన మహాసభలు వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ చరిత్రలో నిలిచిపోదగ్గవే.

కమ్యూనిస్టు ఉద్దండుడు, సీపీఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి గారు మహాసభల ముందురోజునే కన్నుమూశారు. ఈ పరిస్థితుల్లో మహాసభలు వాయిదా వేయవచ్చన్న అభిప్రాయం తలెత్తింది. కానీ, మహాసభలను అద్భుతంగా నిర్వహించి, ప్రజలకు మంచి సందేశం ఇవ్వడమే సురవరానికి ఇచ్చే నిజమైన నివాళి అవుతుందని పార్టీ ఏపీ రాష్ట్ర శాఖ తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. అనుకున్నట్టుగానే, తొలిరోజు నిర్వహించిన భారీ ప్రదర్శన అనూహ్యమైన రీతిలో సాగింది. మహోద్యమనేత సురవరం ఇచ్చిన స్ఫూర్తి...సీపీఐ కేడర్‌ను ఈ దిశగా నడిపించింది. ఒంగోలులోని నెల్లూరు బస్టాండ్ వద్ద ప్రారంభమైన ర్యాలీ అద్దంకి బస్టాండ్ సమీపంలోని మున్సిపల్ గ్రౌండ్ బహిరంగసభా వేదిక వరకూ సాగింది. ర్యాలీ ఎంత అద్భుతంగా జరిగిందంటే, ప్రదర్శనలో ఎర్రజెండా పట్టుకున్న తొలి వాలంటీరు బహిరంగసభా వేదిక వద్దకు చేరుకున్న సమయానికి, ప్రదర్శనలోని ఆఖరి రెడ్‌షర్ట్ వాలంటీరు ర్యాలీ ప్రారంభ స్థలి అయిన నెల్లూరు బస్టాండ్ వద్ద ఉన్నాడు. అంటే ఈ ప్రదర్శన దాదాపు మూడు కిలోమీటర్లు పొడవునా సాగింది. ప్రదర్శన పూర్తి వీడియోను తీయాలని అంబేద్కర్ విగ్రహం వద్ద నిల్చుంటే, ర్యాలీ పూర్తయ్యే సమయానికి సరిగ్గా అరగంట సమయం పూర్తయింది. 30 నిమిషాలపాటు ట్రాఫిక్ ఆగిపోవడంతో దాన్ని సరిచేయడానికి ఒంగోలు పోలీసుల తలప్రాణం తోకకొచ్చింది. అప్పటికీ మధ్యలోకి దూరిపోయి వచ్చే వాహనాలు ఇబ్బంది కలిగించినప్పటికీ, ర్యాలీకి విరామాన్ని మాత్రం ఇవ్వలేకపోయాయి. కదం తొక్కుతూ..పదం పాడుతూ సాగిన ర్యాలీ కారణంగా ఒంగోలు పురవీధులు ఎర్రసంద్రాన్ని తలపించాయి. ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు తరలివచ్చిన కమ్యూనిస్టు కార్యకర్తలు ఎరుపు వస్త్రాలు ధరించి నగరాన్ని ఎరుపెక్కించారు. సీపీఐ రాష్ట్ర మహాసభలు జరగడం ఒంగోలులో ఇదే మొదటిసారి అయినా, ఈ స్థాయిలో ర్యాలీ జరగడం కూడా ఇదే ప్రథమం కావడం విశేషం. అత్యధిక సంఖ్యలో మహిళలు ఎరుపు చీరలు ధరించి, విప్లవ నినాదాలను ఎలుగెత్తిచాటారు. కొందరు మహిళలు ఒక చేత్తో చంటిపిల్లలను ఎత్తుకొని, మరోచేత్తో ఎర్రజెండా చేబూని ఎర్రజెండా వర్ధిల్లాలి అంటూ గళం విప్పించారు. నగరంలో ఎటు చూసినా అరుణ పతాకాలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు, బ్యానర్లు మరింత ఆకర్షణీయంగా మారాయి. సీపీఐ వందేళ్ల పండుగను పురస్కరించుకొని వంద డప్పులు, వంద పాటలు, వంద గొంతుకల పేరుతో 1000 మంది ప్రజా నాట్యమండలి కళాకారులు చేపట్టిన కళాజాత ఈ ప్రదర్శనలో హైలైట్‌గా నిలిచింది. అగ్రభాగాన సాగిన రెడ్‌షర్టు వాలంటీర్ల కవాతులో భాగంగా పార్టీ రాష్ట్ర 28వ మహాసభల సంఖ్యను సూచిస్తూ 28 పతాకాలతో సాగిన రెడ్‌ఫ్లాగ్ మార్చ్ ప్రజలను ఉత్తేజితులను చేసింది. కంకికొడవలి గుర్తుతో మహిళలు ధరించిన ఎర్రెర్రని గొడుగులు, యంగ్ కమ్యూనిస్ట్ మార్చ్ పేరుతో కుర్రాలు అత్యంత క్రమశిక్షణతో రెండు లైన్లతో నిర్వహించిన ప్రదర్శన చూపరులను విశేషంగా ఆకట్టుకున్నది. ఇక ఆంధ్రప్రదేశ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా కొందరు ప్రదర్శకులు ప్రత్యేక వేషధారణతో అలరించారు. ముఖ్యంగా డప్పుల దరువులు, కనకతప్పెట్ల మోతలు, కోలాటాలు, కొమ్ముల నృత్యాలు, థింసా నృత్యరీతులు, జానపద-గురవయ్య బృందాలు ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణను మరింత ఇనుమడింపజేశాయి. భారతీయ లౌకిక వ్యవస్థ, మతసామరస్యతను చాటిచెపుతూ హిందూ, క్రైస్తవ, ముస్లిమ్‌ల వేషధారణ, మరోపక్క ప్రప్రథమ సోషలిస్టు రాజ్య నిర్మాత వీఐ లెనిన్ వేషధారణ, ఇంకోవైపు కమ్యూనిజం వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి, మార్క్సిజం-లెనినిజం అజరామరం అంటూ దిక్కులు పిక్కటిల్లేలా చేసిన నినాదాలు స్థానికులను ఆలోచింపజేశాయి. ప్రదర్శన అనంతరం, కిక్కిరిసిన జనంతో నిండిన బహిరంగసభ సురవరం సుధాకరరెడ్డికి నివాళి అర్పించడంతో ప్రారంభమైంది. అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలను వివరిస్తూ, భారత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి కమ్యూనిస్టు శ్రేణుల కర్తవ్యాలను గుర్తుచేస్తూ సీపీఐ నేతలు దిశానిర్దేశం చేయడం, ప్రజలు వారి ప్రసంగాలను ఆసక్తిగా వినడం సభను విజయపథాన నడిపించింది.

రెండో రోజు 24వ తేదీ ఆదివారంనాడు అమరవీరుల స్థూపావిష్కరణతో ప్రతినిధుల సభ ఆరంభమైంది. సుధాకరరెడ్డి అస్తమయం కారణంగా పతాకావిష్కరణ లేకుండా, మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు పీజే చంద్రశేఖర్‌రావుతో అమరవీరుల స్థూపావిష్కరణ సాగించారు. ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. నల్లూరి అంజయ్య, పూల సుబ్బయ్య సభా ప్రాంగణంలో సీపీఐ జాతీయ నాయకులు వహీదా నిజామ్ పర్వీన్ ప్రతినిధుల సభను లాంఛనంగా ప్రారంభించారు. కేంద్రంలోని మోదీ సర్కారు ఆర్‌ఎస్‌ఎస్ జపం, కార్పొరేట్లకు ఊడిగం చేయడం, మత సామరస్యతను దెబ్బతీయడం తప్ప వేరే పనిచేయడం లేదంటూ ఆమె ఉత్తేజపూరితమైన ప్రసంగం చేశారు. బీజేపీని గద్దె దింకపోతే, దేశం సర్వనాశనమవుతుందని, కమ్యూనిస్టులు అప్రమత్తమై, ఐక్య పోరాటాలకు సమాయత్తం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆహ్వానసంఘం అధ్యక్షోపన్యాసంలో నల్లూరి వెంకటేశ్వర్లు కమ్యూనిస్టుల ఖిల్లా ఒంగోలు పోరాట చరిత్రను, కళా, సాంస్కృతిక నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. సౌహార్ద సందేశాలిచ్చిన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టగా, ఏఐకేఎస్ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు, మహాన్యూస్ ఎండీ మారెళ్ల వంశీకృష్ణ మంచి సందేశాలిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. బలవంతపు భూసేకరణను సాగనీయబోమని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహోద్యమం నిర్మిస్తామని, తన విధానాలే చంద్రబాబుకు శాపంగా మారుతాయని, కిందిస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యమని తన నివేదికలో పేర్కొన్నారు. రాజకీయ, నిర్మాణ నివేదికలపై సుదీర్ఘ చర్చ జరిగింది. చాలామంది ప్రతినిధులు ఈ చర్చలో పాల్గొన్నారు. మూడోరోజూ (ప్రతినిధుల సభ రెండో రోజు) ఈ చర్చ కొనసాగింది. నిజానికి రాష్ట్రంలో జిల్లాల సంఖ్య, పాలక ప్రభుత్వాల దుష్పరిపాలన పుణ్యమా అని దేశంలో, రాష్ట్రంలో సమస్యల సంఖ్య, చేయాల్సిన తీర్మానాల సంఖ్య పెరగడం వల్ల రెండు రోజుల ప్రతినిధుల సభా సమయం చర్చకు సరిపోలేదు. ప్రతినిధుల సభను మూడు రోజులకు పెంచాల్సిన ఆవశ్యకత ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది.

ఆఖరి రోజు ప్రతినిధుల సభలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కార్యదర్శి కె.నారాయణ పాల్గొని సందేశాలిచ్చారు. ప్రధాన సమస్యలపై మహాసభలు తీర్మానాలు చేసి తమ వైఖరిని స్పష్టం చేశాయి. 40కిపైగా తీర్మానాలను సభలో ప్రవేశపెట్టి, చర్చించి, ఆమోదించారు. ప్రధానంగా, విశాఖ ఉక్కును పరిరక్షించాలి, డాక్టర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సును అమలు చేసి, వాటికి చట్టబద్ధత కల్పించాలని, వినియోగించని భూములను స్వాధీనం చేసుకోవాలని, ఉపాధి హామీ చట్టాన్ని కాపాడాలని, ప్రాజెక్టుల నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని, చేతివృత్తిదారుల సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ఉద్యానవన పంటలకు సమగ్ర విధానాన్ని అమలు చేయాలని, కడప ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని, పులివెందుల మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని, పట్టణ ప్రాంతాల్లో ప్రతియేటా పన్నులు పెంచే జీవోను రద్దు చేయాలని, కడప-బెంగళూరు రైల్వేలైనును పాత అలైన్‌మెంట్ ప్రకారమే పూర్తి చేయాలని, గుంతకల్లు స్పిన్నింగ్ మిల్లును పునరుద్ధరించాలని, అనకాపల్లి-విశాక జిల్లాల్లో ఏర్పాటు చేసిన రసాయనిక పరిశ్రమల నుండి ప్రజల ప్రాణాలను కాపాడాలని, కరేడు భూముల సమస్యను పరిష్కరించాలని, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమలు చేయాలని, విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వ ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, పోలవరం ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలని, దళితులపై దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని... తదితర తీర్మానాలను మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే, పోరాటమే శరణ్యమని సభ పిలుపునిచ్చింది. కార్యదర్శి నివేదికలపై చర్చకు సమాధానమిచ్చిన కె.రామకృష్ణ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వెనక్కి తగ్గేదిలేదని స్పష్టం చేశారు. అనంతరం 102 మంది సభ్యులతో కూడిన కొత్త కౌన్సిల్‌ను, 33మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కొత్త కార్యదర్శిని, కార్యదర్శివర్గాన్ని సీపీఐ జాతీయ మహాసభల అనంతరం ఎన్నుకుంటామని ప్రకటించారు. 702 మంది ప్రతినిధులు ఈ మహాసభకు హాజరుకాగా, అందులో నాల్గవవంతు మహిళా ప్రతినిధులు ఉండటం కమ్యూనిస్టు విప్లవ స్ఫూర్తిని ముందుకు నడిపించడానికి సరికొత్త సంకేతంగా భావించవచ్చు. ప్రతినిధుల్లో చదువు లేనివారు కేవలం 10 మంది మాత్రమే. మిగిలిన వారంతా విద్యాసంపన్నులు కావడం గమనార్హం. ఇందులో 60 మంది లాయర్లు కూడా ఉన్నారు. అత్యంత చిన్న వయస్సు గల ప్రతినిధిగా బాల నవ్యశ్రీ (23 సంవత్సరాలు), పెద్ద వయస్సుగల ప్రతినిధులుగా పముజుల దశరథరామయ్య, నల్లూరి వెంకటేశ్వర్లు (92), అత్యధిక మహాసభలకు హాజరైన వ్యక్తిగా సూర్యనారాయణరెడ్డి (18) రికార్డు సృష్టించారు. ప్రతినిధుల్లో 330 మంది హోల్‌టైమర్లు ఉండటం విశేషం. ఏదేమైనప్పటికీ, ఒంగోలు మహాసభలు పార్టీ శ్రేణులకు స్ఫూర్తిదాయకమైన దిశానిర్దేశాన్ని ఇచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు.

వ్యావహారిక భాషోద్యమ దీప్తి - గిడుగు

శబ్దం, అర్థం, అవిభాజ్యం. అలానే గిడుగు రామమూర్తి పంతులును, వ్యావహారిక భాషోద్యమాన్ని విడదీసి చూడలం. అది అర్ధనారీశ్వర తుల్యం. అద్వైత సమానం. ఆ కలయిక అజేయం, అమేయం, అపురూపం. ఈనాడు మనం ఏం మాట్లాడుతున్నామో అదే రాస్తున్నామంటే, అది ఆ మహామనీషి జీవితకాల పోరాట ఫలితం. ఒకప్పుడు గ్రాంథిక భాష వేరు, వ్యావహారిక భాష వేరుగా ఉండేవి. ఆ వైవిధ్యరేఖను తుడిపేసిన గిడుగు రామ్మూర్తి పంతులు అనటం అతిశయోక్తి కాదు. గిడుగు రామ్మూర్తి కుటుంబీకులది తూర్పుగోదావరి జిల్లా అమలాపురానికి మైలుదూరంలోనున్న ఇందుపల్లి గ్రామం. 1860లో కోనసీమలో వచ్చిన అనావృష్టి కారణంగా రామ్మూర్తి పంతులు తల్లిదండ్రులైన గిడుగు వీర్రాజు, వెంకాయమ్మ విజయనగరం వలస వెళ్లారు. అక్కడే విజయనగరం సంస్థానంలో 'సముద్దార్'గా ఉద్యోగం సంపాదించారు వీర్రాజు.

శ్రీకాకుళం జిల్లాలో సుప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం. తత్సమీపంలోని పర్వతాలపేటలో 1863 ఆగస్టు 29న రామ్మూర్తి పంతులు జన్మించారు. స్వగ్రామమైన పర్వతాల పేటలోనే అక్షరాభ్యాసం, పాఠశాల విద్య కొనసాగింది. కీ.శే. వారణాసి గున్నయ్య శాస్త్రి గిడుగు వారికి చదవడం, రాయడం నేర్పించారు. ఎనిమిదవ ఏటనే సంస్కృత శబ్దమంజరి నేర్చుకున్నారు. తీరికవేళల్లో తండ్రి వీర్రాజే భారత, భాగవత, రామాయణాది కావ్యాలలోని శ్లోకాలను వల్లె వేయించారు. గిడుగు రామ్మూర్తికి 12వ ఏటనే పితృవియోగం కల్గింది. కాళ్లకూరి విశ్వనాథం రామ్మూర్తికి ఆంగ్లం నేర్పించారు. తండ్రి మరణానంతరం గిడుగు రామ్మూర్తి తన తల్లిని, ఇద్దరు చెల్లెళ్లను వెంటబెట్టుకుని విజయనగరం చేరారు. అక్కడే మహారాజావారి కళాశాలలో మెట్రిక్ చదివారు. గురజాడ, గిడుగు సహాధ్యాయి. తర్వాత ఇద్దరూ ప్రాణమిత్రు లయ్యారు. నాటి మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర శాస్త్రి. మెట్రిక్ అనంతరం విశాఖజిల్లా కలెక్టరు కార్యాలయంలో ఆరునెలలపాటు గిడుగు రామ్మూర్తి గుమస్తాగా పనిచేశారు. అనంతరం 1879లో పర్లాకిమిడి రాజావారి పాఠశాలలో రూ.30 జీతానికి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. అదే సంవత్సరం భీముని పట్టణానికి చెందిన కందికొండ రామదాసు కుమార్తె అన్నపూర్ణతో వివాహం జరిగింది. 1896-1911 మధ్యకాలంలో చరిత్ర అధ్యాపకులుగా పనిచేశారు. గిడుగు బీఏ చదివే రోజుల్లోనే సవరభాష పట్ల ఆసక్తిని పెంచుకు న్నారు. 'తౌడు' అనే సవరభాష తెలిసిన ఒక కుర్రవాని ద్వారా ఆ భాషను నేర్చుకున్నారు. ఈ దశలో కొండకోనల్లో తిరగడం, మలేరియా జ్వరానికి గురికావడం, క్వినైన్ అనే మందు వాడడం, చెవుడు రావడం జరిగింది. ఇవేవి గిడుగు వారి దృఢ సంకల్పం ముందు నిలువలేకపోయాయి. సవర భాషలో తెలుగు-సవర నిఘంటువును రాశారు. సవర పాటలు, కథలు ఆ భాషలోనే రాశారు. అటు ప్రభుత్వం నుంచి కాని, ఇటు పర్లాకిమిడి రాజావారి చేయూతగాని దొరకనందున తనలాంటి ఔత్సాహికుల ఆర్థిక సాయంతో 1905-06 మధ్యకాలంలో సవరలకు బడులు పెట్టారు గిడుగు రామ్మూర్తి. 1908లో "వెల్షమన్ దొరకు' సవరభాషను నేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. దొర, గిడుగు వారినే తన గురువుగా ఎంచుకున్నారు. సవర భాషా గ్రంథావళి ముద్రణలో వెల్షమన్ దొర, మెక్ మైఖేల్ దొరల సహకారం ఎంతో ఉంది. సవర-ఇంగ్లీషు, ఇంగ్లీషు-సవర నిఘంటువుల కూర్పులో కొడుకు సీతాపతి సహకారం, సవర భాషా వ్యాకరణం రచనలో మామిడన్నం కుమార స్వామి గారి సహాయ సహకారాలు తీసుకున్నారు.

వెల్ష్‌మన్ దొర మరణానంతరం సవర దేశంలో పనిచేయడానికి వచ్చిన మిస్ మన్రో అనే మిషనరీ కూడా గిడుగు వద్దనే సవరభాషను నేర్చుకుంది. 1910లో సవర మాటలు, 1913 లో సవర పాటలు, 1914లో సవర రీడర్, సవర తెలుగు నిఘంటువును గిడుగు రామ్మూర్తి రచించారు.

వ్యావహారిక భాషోద్యమము :కావ్య భాష వాక్య నిర్మాణానికి సరిపడదని, అది పంటికింద రాయిలా ఉంటుందని, విద్యార్థి భావవ్యక్తీకరణకు, భాషా బోధనకు, సులభ గ్రాహ్యానికి వ్యావహారిక భాషే శరణ్యమని గిడుగు రామ్మూర్తి నాటి గ్రాంథిక వాదులైన జయంతి రామయ్య పంతులు, కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి, వావిలకొలను సుబ్బారావు ఇత్యాదులతో పోరాడారు. పూర్వకాలంలో కావ్యాలలో తప్ప, ఆ కావ్యాలకు వ్యాఖ్యానాలు, టీకా టిప్పణీలు రాసేటప్పుడు నాటి కవులు వాడుక భాషనే ఆశ్రయించారని సహేతుకంగా సాక్ష్యాధారాలతో, బాలకవి శరణ్యం, గద్యచింతామణి మొదలైన గ్రంథాలలో ప్రచురించారు.

చిన్నయసూరి అనుంగు శిష్యులమని, వారి వ్యాకరణ ప్రయోగాలు ఉపయోగించుటలో వారసులమని ప్రగల్భాలు పలికే పండిత శ్రేష్ఠుల రచనల్లోని విరుద్ధ ప్రయోగాలను, వైరి సమాసాలను జల్లెడపట్టి చూపించారు. దీనిలో తిరుపతి వేంకటకవులు, వేదం వేంకటరాయశాస్త్రి మినహాయింపేమీ కాదు. 'ఎ మెమోరాండమ్ ఆఫ్ మోడరన్ తెలుగు' అనే పత్రాన్ని రామ్మూర్తి పంతులు 1912లో బ్రిటీషు ప్రభుత్వానికి అందజేశారు. దీనిని 1913లో పుస్తకరూపంగా ప్రచురించి పండితులకు పంచారు. తనకు గ్రాంథిక భాషలో రాయడం రాదన్న వారికి చెళ్లుమనిపించేలా జవాబుగా "ప్రాఁదెనుఁగమ్మ" అనే రచనను ప్రాచీన భాషా శైలిలో రచించారు. ఇది 1914లో ముద్రితమైంది. 1916లో కొవ్వూరులో జరిగిన సభలో కందుకూరి గిడుగు రామ్మూర్తి వాదనలో నిజం లేకపోలేదంటూ అంగీకరించారు. ఇక గురజాడ సరేసరి !

గిడుగు వ్యావహారిక భాషోద్యమానికి ప్రభావితులైన పీటీ అయ్యంగార్ "బీజ గణితాన్ని", వేదం వేంకటాచలయ్య "విధి లేక వైద్యుడు" అనే రచననూ, పీటీ శ్రీనివాసయ్యంగారు 'లైఫ్ ఆర్ డెత్ ఎ ఫ్లీ ఫర్ వెమాసులార్స్' అనే ఆంగ్లవ్యాసాన్ని, వఝల చిన సీతారామ శాస్త్రి "ఆంధ్ర భాష" అనే వ్యాసాన్ని, బుర్రా శేషగిరిరావు "విమర్శాదర్శం" అనే వ్యావహారికి రచననూ చేశారు.

A road to success is always under construction అన్నట్లు, 1911లో ప్రారంభమైన వ్యావహారిక భాషోద్యమం సత్ఫలితాలు చూడడానికి 62 ఏళ్లు పట్టింది. 1969లో స్థాపించిన తెలుగు అకాడమి ఇంటర్మీడియెట్, డిగ్రీ తరగతులకు చెందిన, వివిధ సాంకేతిక విద్యలకు చెందిన పుస్తకాలను వ్యావహారిక భాషలో ప్రచురించింది. పీహెచ్‌డీకి సంబంధించిన తమ పరిశోధనా వ్యాసాలను వ్యావహారిక భాషలో రాయడానికి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం 1973లో అంగీకరించింది. దీనిని సమర్థిస్తూ ఆంధ్ర విశ్వకళా పరిషత్తు ఆమోదించింది. ఆనాటి ప్రముఖ కవులు, నాటక కర్తలు, పాత్రికేయులు తమ రచనల్లో, పత్రికల్లో వ్యావహారిక భాషకు పట్టం గట్టారు. గిడుగు శిష్యులైన చిలుకూరి నారాయణరావు, తాపి ధర్మారావు కాగడా పత్రికలో వ్యావహారిక భాషను ప్రోత్సహించారు. "ముఖ లింగక్షేత్ర చారిత్రక రచన" గిడుగు పరిశోధనకు, చారిత్రక జిజ్ఞాసకు మరో పార్శ్వం. జేఏ ఏట్స్ దొరతో కలిసి ప్రారంభించిన 'ది టీచర్' వ్యావహారిక భాషోద్యమంలో భాగంగా స్థాపించిన "తెలుగు" పత్రికలు ఆయన బహుముఖీన ప్రజ్ఞకు నిదర్శనాలు. భారతి పత్రికలో ముద్రితమైన "ఎనక జన్మలోన యెవరమోనంటూ" అనే ఎంకిపాటను చదివి ఆ గేయం మార్జిన్లో 'ఎ జెమ్' అని రాసి నండూరి సుబ్బారావుకి అభినందనలు తెల్పడం ఆయన నిర్మలత్వానికి నిదర్శనం. 'కథలు గాథలు'లో చెళ్లపిళ్ల వేంకట శాస్త్రిగారు 'గిడుగా పిడుగా' - అనే శీర్షికతో వ్యాసం రాసినా "భాషాశాసన చణుడైన పరగినట్టి గిడుగు

తెలుగువారి తెలివెన్నెల మడుగు" అని శ్రీశ్రీ ప్రాసక్రీడలో ప్రశంసించినా అది గిడుగు వారి అకుంఠిత దీక్షకు, అసమాన ప్రతిభకు, భాషాధిషణకు చేసిన అర్చనలే. 1940లో చెన్నాపట్నంలో ప్రజామిత్ర పత్రిక కార్యాలయంలో జనవరి 15న చెప్పిన ప్రసంగమే గిడుగు చివరి ప్రసంగం. 1940 జనవరి 22న ఆంధ్రుల హృదయంలో చెరగని ముద్రను వేసి, శాశ్వత నిద్రకు చేరారు గిడుగు రామ్మూర్తి పంతులు. వారి జన్మదినాన్ని తెలుగు భాషా దినోత్సవంగా కొనియాడటం మనం వారికిచ్చే నివాళి.

పట్టె జనభాషకు గొడుగు
చేసె గ్రాంథికమ్మును బడుగు ఘనుడు రామ్మూర్తి గిడుగు

కె జోసఫ్ సెల్: 79954 95154

బీహార్ మంత్రి పరుగులు

పట్నా: ఎన్డీయే పాలిత బీహార్‌లో మంత్రి తీరుపై జనం ఆగ్రహించారు. గ్రామ సందర్శనకు వచ్చిన ఆయనపై దాడికి ప్రయత్నించారు. తప్పించుకుని పారిపోయిన మంత్రిని కిలోమీటరు దూరం వరకు వెంబడించి తరిమారు. గతవారం రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది వ్యక్తులు మరణించారు. ఈ నేపథ్యంలో గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రావణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి జోగిపూర్ మలవాన్ గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి సంతాపం తెలిపేందుకు వారి ఇళ్ల వద్దకు వెళ్లారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకుని మంత్రి శ్రావణ్ కుమార్, స్థానిక ఎమ్మెల్యేను చుట్టుముట్టారు. గ్రామాన్ని ఆలస్యంగా సందర్శించడం, బాధిత కుటుంబాలకు ఎలాంటి పరిహారం ఇవ్వకపోవడంపై జనం ఆగ్రహించారు. అధికార జేడీయూ నేతలపై దాడికి ప్రయత్నించారు. గ్రామస్తుల దాడి నుంచి మంత్రి తప్పించుకోగా ఆయన బాడిగార్డు గాయపడ్డాడు. మంత్రి శ్రావణ్ కుమార్ తన కాన్వాయ్ వరకు పరుగెత్తారు. వాహనాల్లో పారిపోతున్న మంత్రి, ఎమ్మెల్యేను కిలోమీటరు దూరం వరకు గ్రామస్తులు వెంబడించారు. అప్రమత్తమైన పోలీసులు ప్రజలను చెదరగొట్టి భద్రతను కట్టుదిట్టం చేశారు.

బీహార్‌లోకి జైషే ఉగ్రవాదులు?

పట్నా: మరికొన్ని నెలల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో ఆ రాష్ట్రంలో ఉగ్ర కలకలం రేగింది. జైషే మహ్మద్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు రాష్ట్రంలోకి చొరబడినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో రాష్ట్ర పోలీసులు ఉద్యుక్తులయ్యారు. నిఘా వర్గాల హెచ్చరికలతో బీహార్ పోలీస్ ప్రధాన కార్యాలయం రాష్ట్ర వ్యాప్తంగా హెచ్చరికలు ప్రకటించింది. ఉగ్రవాదుల ఫొటోలు, వివరాలను కూడా ప్రజల కోసం విడుదల చేసింది. అనుమానాస్పదంగా ఎవరైనా కన్పిస్తే తక్షణమే సమాచారం ఇవ్వాలని సూచించింది. ఉగ్రవాదులను రావల్పిండికి చెందిన హస్నైన్ అలీ, ఉమర్‌కోట్‌కు చెందిన అదిల్ హుస్సేన్, బహావల్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఉస్మాన్‌గా గుర్తించారు. వీరు పాక్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలు సాగిస్తున్న జైషే మహ్మద్ ముఠాకు చెందినవారిగా పోలీసులు వెల్లడించారు. వీరు గత వారం నేపాల్ మీదుగా బీహార్‌లోకి చొరబడ్డట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం అందినట్లు తెలిపారు. మరోవైపు నేపాల్ సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. మరికొన్ని నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఉగ్రవాదుల చొరబాటు తీవ్ర కలకలం రేపుతోంది.

ఆయుధంగా వాణిజ్యం

సుంకాలపై రఘురాం రాజన్

న్యూఢిల్లీ: భారత్‌పై అమెరికా విధించిన అదనపు టారిఫ్‌లు కేవలం ట్రేడ్ టూల్ మాత్రమే కాదని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. రాజకీయ, ఆర్థిక శక్తిగా ఎదిగేందుకే ట్రంప్ ఈ సుంకాల భారం మోపుతున్నారని అభిప్రాయపడ్డారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన టారిఫ్‌ల అంశంపై స్పందించారు. 'టారిఫ్‌ల భారం భారత్‌కు ఓ మేలుకొలుపు లాంటిది. ఏ దేశంపైనా విస్తృతంగా ఆధారపడకూడదు. అమెరికాతో వాణిజ్యం కొనసాగిస్తూనే ఐరోపా, ఆఫ్రికా వంటి దేశాలపైనా దృష్టి సారించాలి. ఈ రోజుల్లో వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక అవసరాలు యుద్ధానికి ఆయుధాలుగా మారుతున్నాయి. వీటిపట్ల న్యూఢిల్లీ జాగ్రత్తగా వ్యవహరించాలి. వృద్ధికి ఊతమిచ్చే, యువతకు ఉపాధి కల్పించే సంస్కరణలు తీసుకురావాలి' అని సూచించారు. ట్రంప్ టారిఫ్‌లు విధించేందుకు అనేక కారణాలు ఉన్నాయని రాజన్ అన్నారు. 'కరెంటు ఖాతా లోటు, ద్రవ్య లోటు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అమెరికాను ఇతర దేశాలు వాడుకుంటున్నాయని ట్రంప్ భావిస్తున్నారు. కానీ, చౌక ధరకు వస్తువులను దిగుమతి చేసుకుంటున్నందుకు అమెరికా వినియోగదారులే ప్రయోజనం పొందుతున్నారన్న విషయాన్ని మర్చిపోయారు. ఈ సుంకాలను ట్రంప్ ఇతర దేశాలపై పన్నులుగా పరిగణిస్తున్నారు. తద్వారా అమెరికాకు ఆదాయం సమకూరుతుందని ఆలోచిస్తున్నారు. అయితే, దీనివల్ల సొంత ప్రజలకే నష్టం జరుగుతుందన్న విషయాన్ని గుర్తించట్లేదు. సైనిక శక్తిని ఉపయోగించలేని సందర్భాల్లో టారిఫ్‌లను తమ బలప్రయోగం కోసం ట్రంప్ వినియోగించుకుంటున్నారు' అని రాజన్ చెప్పారు.

జపాన్, చైనాకు మోదీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ జపాన్, చైనా పర్యటన కోసం బయలుదేరి వెళ్లారు. 29, 30 తేదీల్లో జపాన్‌లోనూ, 31, సెప్టెంబరు 1 తేదీల్లో ఆయన చైనాలో పర్యటిస్తారు. రెండు దేశాల అధినేతలతో మోదీ సమావేశమవుతారు. భారత సంతతి ప్రజలతో ముచ్చటిస్తారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ద్వైపాక్షిక సమావేశాలు జరపనున్నారు. అంతేకాకుండా సెప్టెంబర్ 1వ తేదీన రష్యా అధ్యక్షుడు వ్లాదమిర్ పుతిన్‌తోనూ ఆయన భేటీ కానున్నారు. షాంగై కోఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్‌సీఓ) సదస్సుకు ఆయన హాజరవుతారు. రష్యాతో చమురు వ్యాపారాల కారణంగా అమెరికా భారీగా టారిఫ్‌లు విధించింది. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతయ్యే వస్తువులపై ఏకంగా 50 శాతం టారిఫ్‌లు విధించింది. దీంతో భారత్ వ్యాపారం మెల్ల మెల్లగా దెబ్బతింటూ వస్తోంది. మరోవైపు చైనాపైనా అమెరికా భారీ స్థాయిలో టారిఫ్‌లు విధించింది. అమెరికా కారణంగా భారీఎత్తున వ్యాపారాలు నష్టపోయిన భారత్, చైనా ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది. దానికి తోడు దాదాపు ఏడేళ్ల తర్వాత ప్రధాని చైనా వెళుతున్నారు. చైనా అధ్యక్షుడిని కలవబోతున్నారు.

ఆగని వర్షాలు...వరదలు

- ఉత్తరాదిని ముంచెత్తుతున్న కుంభవృష్టి
- జాతీయ రహదారులపై స్తంభించిన ట్రాఫిక్
- రోడ్లపైనే వాహనాలు... నిలిచిన సరుకు రవాణా
- కశ్మీర్‌లో 39కి చేరిన మృతులు

న్యూఢిల్లీ/శ్రీనగర్/సిమ్లా: ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షం బీభత్సం కొనసాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీ సహా జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాల్లో కుంభవృష్టి కురుస్తోంది. భారీ వర్షాలకు వరదలు పోటెత్తుతుండటం, కొండ చరియలు విరిగిపడుతుండటంతో జాతీయ రహదారులపై కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. వందలాది సరుకు రవాణా చేసే ట్రక్కులు రోడ్లపై నిలిచిన పరిస్థితి నెలకొంది. మరోపక్క ఎడతెరిపి లేని వర్షాలకు ఎక్కడికక్కడ వరదలు సంభవిస్తున్నాయి. అనేక చోట్ల భారీగా కొండచరియలు విరిగిపడి రోడ్లన్నీ బ్లాక్ అవుతున్నాయి. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వల్ల చండీగఢ్-కులు జాతీయ రహదారి పై సుమారు50 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ఢిల్లీ-ఎన్సీఆర్‌కు పండ్లు, కూరగాయలు తీసుకెళ్లే వందలాది ట్రక్కులు సహా వేలాది వాహనాలు ఆ మార్గంలో నిలిచిపోయాయి. చండీగఢ్-మనాలీ జాతీయ రహదారిపై సైతం చాలా చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. వాహనాలను అధికారులు ఎక్కడికక్కడ నిలిపివేశారు. దీంతో పలు వాహనాలు రోడ్లపై కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ట్రక్కు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయల విలువైన సరుకు కుళ్లిపోతోందని వాపోయారు. ప్రతి ట్రక్కు విలువ దాదాపు రూ.4 నుంచి రూ.5 లక్షల వరకూ ఉంటుందని పేర్కొన్నారు. ఇక దాదాపు రూ.50 కోట్ల విలువైన ఆపిల్ సరకు ఇక్కడ నిలిచిపోయిందని తెలిపారు. ఓ ట్రక్కు డ్రైవర్ మాట్లాడుతూ.. సాహిబాబాద్ పండ్ల మార్కెట్‌కు ఆపిల్ లోడ్‌తో వెళ్తున్నానని... అయితే, భారీ వర్షం, వరదల కారణంగా ఐదు రోజులుగా కులులో చిక్కుకుపోయినట్లు చెప్పారు. సాహిబాబాద్, ఆజాద్‌పూర్ మండీలకు వెళ్లే వేలాది ట్రక్కులు ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయినట్లు పేర్కొన్నారు.

జమ్మూ కశ్మీర్‌ను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. క్లౌడ్ బరస్ట్‌లు, ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో అనేక మార్గాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే కీలక మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కాత్రాలోని అర్ధకుమారి సమీపంలో మాతా వైష్ణో దేవి యాత్ర మార్గంలో మంగళవారం కొండచరియలు విరిగిపడటం, ఆకస్మాత్తుగా చోటుచేసుకున్న వరదలతో మృతి చెందిన వారి సంఖ్య 35 కు చేరింది. ఈ మేరకు గురువారం ఉదయం వరకు సహాయ బృందాలు శిథిలాల నుంచి మృత దేహాలను వెలికితీశాయి. మరో 23 మంది గాయపడ్డారు. ప్రస్తుతం అక్కడ ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఆర్మీ, ఇతర సహాయ బృందాలు సహాయక చర్యలు కొనసాగిస్తున్నాయి. వీటిలో 22 మృతదేహాలను గుర్తించారు. వీరిలో ఎక్కువ మంది ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ మరియు మధ్యప్రదేశ్‌కు చెందినవారు. వారిలో చాలా మంది కుటుంబ సభ్యులు కాత్రాకు చేరుకున్నారు. చట్టపరమైన లాంఛనాలు పూర్తయిన తర్వాత మృతదేహాలను వారి బంధువులకు అప్పగిస్తున్నట్లు మాతా వైష్ణో దేవి పుణ్యక్షేత్ర బోర్డు అధికారులు తెలిపారు. ఈ విషాదం తర్వాత మాతా వైష్ణో దేవి యాత్రను నిలిపివేశారు. కానీ బుధవారం సాయంత్రం పాత మార్గం ద్వారా పునరుద్ధరించారు. "సైన్యం, పోలీసులు మరియు ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఇప్పటికీ సహాయక చర్యలో నిమగ్నమై ఉన్నారు. అక్కడ జేసీబీలను ఉపయోగించడం సాధ్యం కానందున మొత్తం పని సహాయ బృందాలే నిర్వహిస్తున్నారు" అని అధికారులు తెలిపారు.

కాగా రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో వరదలు, భారీ వర్షాలకు మరో నాలుగురు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. దీంతో మొత్తం మృతుల సంఖ్య 39కి చేరింది. భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. ప్రజలు అసవరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించింది. వివిధ జిల్లాలకు అలర్టులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నెంబర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పూంఛ్, రాజౌరి జిల్లాలు మినహా మొత్తం జమ్మూ డివిజన్‌లో ఇంకా వర్షాలు కురుస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ మేరకు తావి నది స్థాయి తగ్గింది, కానీ చీనాబ్ నది ప్రమాద స్థాయికి దగ్గరగా ప్రవహిస్తోందని పేర్కొన్నారు. విద్యుత్, నీటి సరఫరా, మొబైల్ సేవలను పునరుద్ధరించడం తక్షణ ప్రాధాన్యతగా తీసుకున్న అధికారులు దీని కోసం నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు మూసి వేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

హిమాచల్‌లో జల ప్రళయం

రెండు నెలల్లో 300 దాటిన మృతుల సంఖ్య

హిమాచల్ ప్రదేశ్‌లో రుతుపవనాలు విలయం సృష్టిస్తున్నాయి. కుంభవృష్టి, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రం అతలాకుతలమవుతోంది. ఈ ఏడాది జూన్ 20న వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు వివిధ ప్రమాదాల్లో 300 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా వేల కోట్ల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఆగస్టు 27 నాటికి మృతుల సంఖ్య 310కి చేరింది. వీరిలో 158 మంది నేరుగా వర్ష సంబంధిత ప్రమాదాలైన కొండచరియలు విరిగిపడటం, ఇళ్లు కూలిపోవడం, వరదల్లో కొట్టుకుపోవడం, విద్యుత్ షాక్ వంటి కారణాలతో మరణించారు. మరో 152 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. ఈ ప్రకృతి విపత్తులో సుమారు 369 మంది గాయపడగా, మరో 38 మంది ఆచూకీ గల్లంతైంది. ఈ వర్షాల కారణంగా మండి జిల్లా అత్యంత తీవ్రంగా నష్టపోయింది. ఒక్క మండి జిల్లాలోనే 51 మరణాలు సంభవించగా, కాంగ్రాలో 49, చంబాలో 36, సిమ్లాలో 28 మంది మరణించినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టం కూడా భారీ స్థాయిలోనే ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల నష్టం విలువ మొత్తం రూ.2,62,336.38 లక్షలు దాటినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు.

మహారాష్ట్రలో కుప్పకూలిన భవనం

17 మంది దుర్మరణం

ముంబై: మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వాసాయి విరార్‌లో నాలుగు అంతస్తుల నివాస భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో 17 మంది మృతి చెందారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకుని ఉంటారని భావిస్తున్న అధికారులు.. సహాయక చర్యలు కొనసాగిస్తున్నారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థ కథనం ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి 12.05 గంటల సమయంలో విజయ్ నగర్‌లోని రమాబాయి అపార్ట్‌మెంట్‌లో వెనక భాగం కూలిపోయింది. దానిలో కొంత భాగం పక్కనే ఉన్న ఖాళీ భవనంపై పడింది. ఈ ప్రమాదంపై సమాచారం అందిన వెంటనే పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అంతా గాఢనిద్రలో ఉండగా ప్రమాదం జరగడంతో మృతుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రమాదం జరిగిన ప్రాంతంలో మొత్తం 50 ఫ్లాట్లు ఉన్నాయి. వాటిలో కూలిపోయిన భాగంలో 12 అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. అయితే కూలిన భవనం అక్రమ కట్టడమని విచారణలో తేలింది. దీంతో.. వాసాయి విరార్ మున్సిపల్ కార్పొరేషన్ (వీవీఎంసీ) ఫిర్యాదు చేసిన తర్వాత పోలీసులు భవన నిర్మాణదారుడు నిటల్ గోపినాథ్‌ను అరెస్టు చేశారు. ల్యాండ్ ఓనర్ మీద కూడా కేసు నమోదైనట్లు సమాచారం. ఘటనలో ఆరోహి జోయెల్(24), ఆమె ఏడాది చిన్నారి కన్నుమూశారు. భర్త ఓంకార్ జోయల్ జాడ ఇంకా తెలియరాలేదు. చిన్నారి మొదటి ఏడాది పుట్టినరోజు కేక్ కటింగ్ వేడుక జరిపిన కొన్నిగంటలకే... అదీ సోషల్ మీడియాలో ఫొటోలు పోస్ట్ చేసిన ఐదు నిమిషాలకే ఈ ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శిథిలాల కింద ఆ తల్లీకూతుళ్లు విగతజీవులయ్యారు.

నేనున్నంత వరకు ఓటు హక్కు పోనివ్వను: మమత

కోల్‌కతా: తాను ప్రాణాలతో ఉన్నంత వరకు ప్రజల ఓటు హక్కును ఎవరూ హరించలేరని బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ఉద్ఘాటించారు. బెంగాలీలపై 'భాష' ఉన్మాదాన్ని బీజేపీ సృష్టిస్తోందన్నారు. టీఎంసీ విద్యార్థి సంఘం అధ్వర్యంలో కోల్‌కతాలో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి మమత ప్రసంగించారు. ఓటర్ల జాబితాల్లో నుంచి ఓటర్ల పేర్లను తొలగించడమే లక్ష్యంగా సర్వేలు నిర్వహించడం కోసం దేశ నలుమూలల నుంచి 500కుపైగా బృందాలను కేంద్ర ప్రభుత్వం బెంగాల్‌లో మోహరించిందని మండిపడ్డారు. 'మీ పేర్లు ఓటర్ల జాబితాల్లో ఉన్నాయో లేదో ఎప్పటికప్పుడు చూసుకోండి. అందరూ ఆధార్ కార్డులను కలిగి వుండాలి' అంటూ సీఎం పిలుపునిచ్చారు. 'నేను ప్రాణాలతో ఉన్నంత వరకు ప్రజల ఓటును హరించనివ్వను. మన అధికారులను ఎన్నికల సంఘం బెదిరిస్తోంది. ఎన్నికలకు ముందు మూడు నెలల వరకే ఈసీకి అధికారం ఉంటుంది...ఏడాది మొత్తం కాదు. స్వాతంత్ర్య సమరంలో బెంగాలీలు పోషించిన పాత్రను ప్రజలు మరిచిపోవాలని బీజేపీ యత్నిస్తోంది. బెంగాలీ భాషే లేకపోతే జాతీయ గీతాలు రాసిన భాష ఏది? బెంగాలీల చారిత్రక పాత్రను తుడిచిపెట్టాలని, భాష నెపంతో ఉన్మాదాన్ని సృష్టించడానికి చేసే ప్రయత్నాలను ఉపేక్షించేది లేదు. వారి (బీజేపీ) పూర్వీకులు బ్రిటిష్‌వాళ్లకు ఏజెంట్లు... జైళ్ల నుంచి బయటకు రావడం కోసం విన్నపాలు చేసుకున్నారు' అని మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తంచేశారు. మా ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను చేపడితే, కేంద్రప్రభుత్వం దేశాభివృద్ధి నెపంతో అవినీతిలో కూరుకుపోతోందని టీఎంసీ అధినేత్రి వ్యాఖ్యానించారు. మేము మహిళలను సాధికారులుగా చేస్తుంటే, దేశాన్ని లూటీ చేయడంలో కేంద్రం నిమగ్నమైందని దుయ్యబట్టారు. తనకు వ్యతిరేకంగా బీజేపీతో సీపీఎం కుమ్మక్కైందని విమర్శించారు. బ్రిటిష్‌వాళ్ల భయంతో నేతాజీ చంద్రబోస్ దేశాన్ని వీడారన్న ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మమత వెల్లడించారు.

తక్షణమే ఎన్నికల అధికారుల నియామకం

పశ్చిమ బెంగాల్‌లో పెండింగ్ ఉన్న ఎన్నికల అధికారుల కీలక పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. న్యాయపరమైన అడ్డంకుల కారణంగా అనేక నెలలుగా ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టేందుకుగాను డిస్ట్రిక్ మెజిస్ట్రేట్ (డీఎం)లకు శుక్రవారం వరకు గడువు ఇస్తూ సీఎస్ మనోజ్ పంత్ ఆదేశాలిచ్చారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అఫీసర్స్ (ఈఆర్ఓ), అసిస్టెంట్ ఈఆర్ఓ పోస్టుల భర్తీ గడువులోగా పూర్తి కావాలన్నారు. సబ్ డివిజనల్ అధికారుల (ఎస్‌డీఓ)ను మాత్రమే ఈఆర్ఓలుగా నియమించాలని, ఎస్‌డీఓలు లేని పక్షంలో ఆ బాధ్యతలను సీనియర్ డబ్ల్యూబీసీఎస్‌లకు అప్పగించాలని సూచించినట్లు ఒక అధికారి వెల్లడించారు. అలాగే 610 అసిస్టెంట్ ఈఆర్ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని సెక్రటేరియల్ వర్గాలు తెలిపాయి. మండలాలు, వివిధ శాఖల్లోని మండల స్థాయి అధికారుల నుంచి అసిస్టెంట్ ఈఆర్ఓలను ఎంపిక చేస్తారు. ఈసీ అనుమతితో ఇతర విభాగాలల్లోని సమాన స్థాయి అధికారులను ఈ బాధ్యతల్లో నియమించాలని నిర్ణయించారు. పోలింగ్ కేంద్రాలు 95వేల వరకు ఉండటంతో, బూత్ స్థాయి అధికారుల సంఖ్యను పెంచాల్సిన దృష్ట్యా చర్యలు చేపట్టారు. ఈసీఓ కార్యాలయం (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీస్) ఆమోదంతో ఈ ప్రక్రియను మొదలు పెట్టినట్లు సంబంధిత అధికారి తెలిపారు.

భారత్‌కు మోదీ వెన్నుపోటు

అదానీని కోసమే అమెరికాకు దాసోహం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: పారిశ్రామికవేత్త గౌతం అదానీని అరెస్టు నుంచి కాపాడటం కోసం దేశాన్ని, రైతుల ప్రయోజనాలను ప్రధాని నరేంద్ర మోదీ తాకట్టు పెట్టేశారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రస్థాయిలో విమర్శించారు. దేశాన్ని మోదీ మోసం చేశారని ఆరోపించారు. 265 మిలియన్ డాలర్లు లంచం తీసుకున్న వ్యవహారంలో అదానీని అరెస్టు చేయకుండా రక్షణ కల్పించడం కోసం భారత్‌ను వెన్నుపోటు పొడిచారని, అమెరికా ఎదుట లొంగిపోయారని దుయ్యబట్టారు. కేజ్రీవాల్ గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోదీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'మోదీ ఎందుకు అమెరికాకు తలొగ్గుతున్నారని యావత్ భారత్ ప్రశ్నిస్తోంది. అదానీ కోసం అమెరికా ఎదుట మోకరిల్లారని, దేశ ప్రయోజనాలను పణంగా పెట్టేశారని ఆరోపిస్తోంది. ఇది నిజమైతే ఆయన భారత్‌ను వెన్నుపోటు పొడిచినట్లే!' అని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. భారత్... అమెరికా దిగుమతులపై అధిక సుంకాలు విధించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిర్ణయానికి దేశ ప్రజల మద్దతు ఉంటుందన్నారు. అమెరికా నుంచి పత్తి దిగుమతులపై విధించే 11 శాతం సుంకాన్ని రద్దు చేయడం వల్ల మన సాగుదారులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. 'అమెరికాకు ఏ దేశం లొంగిపోలేదు. అధికంగా సుంకాలు విధించాయి. మనం కూడా అదే చేయాలి. అమెరికా 50 శాతం విధిస్తే మనం 100 శాతం సుంకం విధించాలి. ఈ నిర్ణయానికి ప్రజలు మద్దతిస్తారు. భారత్‌ను ఏ దేశం అవమానించడానికి వీల్లేదు. మనది 140 కోట్ల జనాభా ఉన్న దేశం' అని కేజ్రీవాల్ వక్కాణించారు. అమెరికా పత్తిపై భారత్ విధించే 11 శాతం సుంకం ఈనెల 19 నుంచి సెప్టెంబరు 30 వరకు రద్దు అయింది. దీంతో టెక్స్‌టైల్ పరిశ్రమలకు చౌక ధరలకు పత్తి లభిస్తుంది. మన రైతులు సాగుచేసే పత్తి అక్టోబరు నెలలో మార్కెట్‌కు వచ్చేసరికి కొనేవాళ్లే ఉండరు. ఫలితంగా తెలంగాణ, పంజాబ్, విదర్భ, గుజరాత్ రైతులు నష్టపోతారు. అమెరికా 50 శాతం సుంకం విధిస్తే... మనం కూడా సుంకాన్ని 50 శాతానికి పెంచాలే తప్ప ఉన్న 11 శాతాన్ని రద్దు చేయడం సరికాదు' అని కేజ్రీవాల్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఘటించాలని రాజకీయ పార్టీలు, రైతు సంఘాలకు పిలుపునిచ్చారు. ఈ నిర్ణయం గుజరాత్, సురేంద్రనగర్, చోటిలా రైతులకు ఎక్కువగా నష్టం కలిగిస్తుందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ సెప్టెంబరు 7న చోటిలాలో సమావేశాన్ని ఏర్పాటు చేయబోతోందని కేజ్రీవాల్ ప్రకటించారు.

9 హైకోర్టులు... 14 మంది జడ్జీల బదిలీ



న్యూఢిల్లీ: తొమ్మిది రాష్ట్ర హైకోర్టుల జడ్జిల స్థానాల్లో మార్పులు చేపట్టాలని సుప్రీంకోర్టు కొలీజియం గురువారం సిఫారసు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా జస్టిస్ బీఆర్ గవాయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత హైకోర్టు జడ్జీల గణనీయమైన బదిలీలు, సొంత రాష్ట్రాలకు పంపాలని కొలీజియం సిఫారసు చేయడం నాలుగు నెలల్లో ఇది రెండవసారి. కోల్‌కతా, గుజరాత్, అలహాబాద్, రాజస్థాన్, మద్రాస్, కేరళ, ఢిల్లీ, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ వంటి తొమ్మిది హైకోర్టుల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న 14 మంది జడ్జిల జ్యుడీషియల్ బదిలీలను కొలిజీయం ప్రభుత్వానికి సిఫారసు చేసింది. 14 మంది జడ్జీల్లో ఒకరిని కర్నాటక హైకోర్టు జడ్జీగా బదిలీ చేస్తారని, ఇద్దరు జడ్జిలను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు తిరిగి పంపాలని ప్రతిపాదించింది. కొలీజియం సిఫారసును కేంద్రం ఆమోదిస్తే ఆంధ్రప్రదేశ్‌కు మరో జడ్జి బదిలీపై రానున్నారు. హైకోర్టు జడ్జీల స్థానాల్లో మార్పులు, సొంత రాష్ట్రాలకు పంపాలనే నిర్ణయాలను ఆగస్టు 25, 26 తేదీల్లో జరిగిన కొలీజియం సమావేశాల్లో తీసుకున్నారు. జస్టిస్ అతుల్ శ్రీధరన్‌ను మధ్యప్రదేశ్ నుండి చత్తీస్‌గఢ్‌కి, జస్టిస్ సంజయ్ అగర్వాల్‌ను చత్తీస్‌గఢ్ నుండి అలహాబాద్‌కు, జస్టిస్ నిషా బానును మద్రాస్ నుండి కేరళకు, జస్టిస్ దినేష్ మెహతా, జస్టిస్ అవనీష్ జింగన్‌ను రాజస్థాన్ నుండి ఢిల్లీకి, జస్టిస్ అరుణ్ మోంగాను ఢిల్లీ నుండి రాజస్థాన్‌కు, జస్టిస్ సంజయ్ కుమార్ సింగ్‌ను అలహాబాద్ నుండి పట్నాకు, జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్‌ను అలహాబాద్ నుండి కోల్‌కతాకు, జస్టిస్ సందీప్ నట్వర్‌లాల్ భట్‌ను గుజరాత్ నుండి మధ్యప్రదేశ్‌కు, జస్టిస్ చంద్రశేఖరన్ సుధాను కేరళ నుండి ఢిల్లీకి, జస్టిస్ తారా వితస్తా గంజును ఢిల్లీ నుండి కర్నాటకకు, జస్టిస్ శుభేందు సమంతను కోల్‌కతా నుండి ఏపీకి బదిలీలను కొలీజియం సిఫారసు చేసింది. ఈ బదిలీలు ఆగస్టు 27న ప్రచురితమయ్యాయి. ప్రస్తుతం గుజరాత్, అలహాబాద్‌లలో విధులు నిర్వహిస్తున్న జడ్జీలు జస్టిస్ మానవేంద్రనాథ్, జస్టిస్ దొనాడి రమేష్‌ను ఏపీ హైకోర్టుకు తిరిగి పంపాలని సిఫారసు చేసింది. పట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విపుల్ మనుభాయ్ పంచోలిని సుప్రీంకోర్టుకు నియమించాలన్న ప్రతిపాదనను జస్టిస్ బీవీ నాగరత్న విభేదించడంతో ఆ నిర్ణయం వివాదాస్పదమైంది.

సుంకం లేని పత్తి దిగుమతుల గడువు పొడిగింపు

న్యూఢిల్లీ: పత్తిపై సుంకం లేని దిగుమతులను మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. దేశంలోని టెక్స్‌టైల్స్ పరిశ్రమలు ఈ ఏడాది డిసెంబరు చివరి వరకు సుంకం లేకుండా పత్తిని దిగుమతి చేసుకోవచ్చని ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ప్రకటించింది. ముడిపత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని నిలిపివేస్తున్నట్లు కేంద్రం ఈ నెల 18న ప్రకటించింది. ఎగుమతిదారులకు మద్దతు ఇచ్చే చర్యగా, సుంకం లేని దిగుమతిని ఈ ఏడాది డిసెంబరు 31 వరకు పొడిగించాలని నిర్ణయించినట్లు ఆ ప్రకటనలో పేర్కొంది. భారతదేశ ప్రస్తుత పత్తి సీజన్ (2024, అక్టోబరు ఒకటి నుంచి 2025, సెప్టెంబరు 30 వరకు) సుమారు 40లక్షల బేళ్ల దిగుమతులను ప్రభుత్వం అంచనా వేసింది. తదుపరి సీజన్ (2025 అక్టోబరు ఒకటి నుంచి 2026, సెప్టెంబరు 30 వరకు) కోసం కొత్త పంటరాక దీపావళి తర్వాత పెరిగే అవకాశం ఉందని తెలిపింది. అయితే ముడిపత్తిపై 11శాతం దిగుమతి సుంకాన్ని రద్దు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) డిమాండ్ చేస్తోంది. పత్తికి ఎంఎస్‌పి సి2ప్లస్ 50 శాతంతో క్వింటాకు రూ.10,075 చొప్పున ప్రకటించాలని, ఆత్మహత్య చేసుకున్న బాధిత రైతు కుటుంబానికి రూ.25 లక్షలు పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేసింది.

విశాలాంధ్ర హైదరాబాద్

ధ్యాన్‌చంద్ హాకీ లెజెండ్ జయంతిని పురస్కరించుకుని క్రీడా పోటీలు

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : తెలంగాణ ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకునే మేజర్ ధ్యాన్ చంద్ హాకీ లెజెండ్ జయంతిని పురస్కరించుకుని గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సముదాయం (ఐడిఓసి) లోని ఉద్యోగులకు వాలీబాల్, రన్నింగ్, చెస్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్, మ్యూజికల్ చైర్, క్యారం బోర్డు మొదలగు క్రీడా పోటీలు జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా ఆధ్వర్యంలో జిల్లా యూత్ అడ్వాన్స్మెంట్ స్పోర్ట్స్ వారు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా మాట్లాడుతూ ఉద్యోగులకు క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని, క్రీడా స్ఫూర్తిని ఉద్యోగంలో కూడా పాటిస్తే మెరుగైన సేవలు అందించగలరని తెలిపారు. అనంతరం, గెలుపొందిన వారికి జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, స్పోర్ట్స్ అధికారి జి.వి. గోపాల్‌రావు, ఏ.ఓ ఎల్ రామ్మోహన్‌రావు, కలెక్టరేట్ ప్రాంగణంలోని ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని బండచెరువులో వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను గురువారం కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ చెరువు వద్ద విగ్రహాలు నిమజ్జనం కోసం పరిసరాలను శుభ్రం చేయించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం చేపట్టిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. శానిటేషన్, భక్తులకు అవసరమైన నీటి వసతి, బారికేడింగ్ పాయింట్లు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ నవీన్ కుమార్, సూపర్ వైజర్ వెంకటేష్, బీజేపీ నాయకులు ఓం ప్రకాష్, నరేష్, భాస్కర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ సాధనకు పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిహెచ్ఎంఈయు యూనియన్ సీపీఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాల్సిందిగా కోరుతూ పాత పెన్షన్ సాదనకై సి పిఎస్ ఉద్యోగుల ఆత్మ గౌరవ సభ వాల్ పోస్టర్‌ని జిహెచ్ఎంఈయు అధ్యక్షులు ఉదరి గోపాల్ యూనియన్ ఆఫీస్‌లో ఆవిష్కరించారు. ఈ సభ సెప్టెంబర్ 1న మధ్యాహ్నం 2 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ ఉద్యోగుల ఆత్మ గౌరవ సభకు జిహెచ్ఎంసి సి.పి.ఎస్. ఉద్యోగులు అందరు తప్పక హాజరు కావాలని కోరారు. ఈ సభ ద్వారా నిరసనను తెలిపి పాత పెన్షన్ స్కీంను సాదించుకుందామని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ డి. నర్సింగ్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.కన్నా, ఉపాధ్యక్షులు జి.నర్సింగ్‌రావు, ఎం.కృష్ణ, కె.శేఖర్, సురేష్, శ్రీనివస్ పాల్గొన్నారు.

చనిపోయిన వారి స్థానంలో

కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయ్స్ యూనియన్ అధ్యక్షులు కొమ్ము గళ్ళ బాలకృష్ణ ఆధ్వర్యంలో అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్‌ని కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. గత రెండున్నర సంవత్సరాలుగా ఎంటమాలజీ, ట్రాన్స్ పోర్టు, వెటర్నరీ విభాగంలో పని చేస్తున్న కార్మికులు చనిపోతే వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఇవ్వాల్సిన ఉద్యోగం విషయంలో నిర్లక్ష్యం జరుగుతుందని, శానిటేషన్ విభాగంలో ఎలాగైతే సర్క్యులర్ జారీ చేశారో అదే విధంగా ఎంటమాలజీ, ట్రాన్స్ పోర్టు, వెటర్నరీ విభాగంలో కూడా ఇవ్వాలని కమిషనర్‌కి కోరారు. గతంలో కూడా ఈ విషయం మీద అనేక మార్లు వినతిపత్రాలు అందజేయడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా సర్క్యులర్ జారి చేసి అందరికీ ఉద్యోగాలు వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని అడిషనల్ కమిషనర్ చెప్పినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

పర్యాటక-అతిథ్య రంగంలో కొత్త ధోరణులపై దృష్టి పెట్టాలి

నిథమ్‌లో జాతీయ క్రీడా వారోత్సవాల్లో మంత్రి జూపల్లి కృష్ణారావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : పర్యాటక-అతిథ్య రంగంలో కొత్త ధోరణులపై దృష్టి పెట్టాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నిథమ్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్)లో జాతీయ క్రీడా వారోత్సవాలను మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. ఆగస్టు 28 నుండి 31 వరకు జరిగే ఈ వారోత్సవాల్లో ఆరోగ్యం, శ్రేయస్సు, సంస్థాభివృద్ధి అంశాలపై వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని సమూహ యోగాసనాలు, ధ్యానం చేశారు. ఈ శిబిరాన్ని నిథమ్ యోగా శిక్షకురాలు స్మృతి పాండే నిర్వహించారు. అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు నిథమ్ విద్యార్థులు, అధ్యాపకులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. నిథమ్‌ను అగ్రగామి సంస్థగా నిలిపేందుకు విద్యార్థులు, అధ్యాపకులు కృషి చేయాలన్నారు. అంతర్జాతీయ విద్యార్థులు, పర్యాటకులను ఆకర్షించేలా నిథమ్ ను తీర్చిదిద్దాలని చెప్పారు. కొత్త విద్యా కార్యక్రమాలు, స్వల్పకాలిక, నైపుణ్యాభివృద్ధి కోర్సులను ప్రవేశపెట్టాలని, విద్యా-శిక్షణా పరిధిని విస్తరించాలని, ఉద్యోగ, పారిశ్రామికావకాశాలను విస్తరించాలని దిశానిర్దేశం చేశారు. క్యాంపస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వాతావరణాన్ని మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వం తరపున నిథమ్‌కు సంపూర్ణ సహకారం అందిస్తామని, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్పెషల్ సీఎస్‌తో చర్చించి నిథమ్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు సమగ్ర కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని డైరెక్టర్‌కు సూచించారు. నిథమ్ ను జాతీయ స్థాయి ప్రీమియర్ ట్రైనింగ్, రీసెర్చ్, కన్సల్టెన్సీ సంస్థగా తీర్చిదిద్దడంలో డైరెక్టర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు చేస్తున్న కృషిని మంత్రి ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత పర్యాటక, ఆతిథ్య రంగాలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రముఖ పర్యాటక కేంద్రాలలో మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్ణయించిందన్నారు. అలాగే, రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక ప్రాముఖ్యం కలిగిన పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి, వాటికి ప్రపంచ స్థాయిలో బ్రాండింగ్, ప్రచారం కల్పించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. పర్యాటక కేంద్రాలకు కనెక్టివిటీ పెంచి, పర్యాటక వసతి, సౌకర్యాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పర్యాటక, ఆతిథ్య రంగంలో పెట్టుబడులకు అపార అవకాశాలు ఉన్నాయని, ప్రైవేట్ సంస్థలు పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకటరమణ, శ్రీకారా హాస్పిటల్స్ సీనియర్ డాక్టరు.పి.ఎల్.ఎస్. పటేల్, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : మంగళవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో పలు ప్రాంతాల్లో చెరువులు, కుంటలు, నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద కారణంగా పలు సబ్ స్టేషన్లలో నీరు చేరడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం వలన పలు గ్రామాల్లో విద్యుత్ పంపిణి వ్యవస్థ స్తంభించింది. తమ సిబ్బంది జోరు వాన, భారీ వరదను సైతం లెక్కజేయకుండా, నదులు ఈదుకుంటూ విద్యుత్ స్తంభాలు ఎక్కి మరీ యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు గావిస్తున్నారని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్ తెలిపారు. ఈ సందర్భముగా సంస్థ చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండింగ్ ఇంజినీర్లతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో సరఫరా పరిస్థితిని సమీక్షించారు. వర్షం ప్రభావంతో మెదక్ జిల్లాలో విద్యుత్ శాఖకు భారీ స్థాయిలో నష్టం జరిగిందని అధికారులు తెలియజేసారు. మెదక్ జిల్లాలో వరద ప్రభావానికి కొన్ని చోట్ల సబ్ స్టేషన్లలో నీళ్లు చేరాయన్నారు. 33 కేవి ఫీడెర్స్ - 11, 11 కేవీ ఫీడర్స్ - 175, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్సఫార్మర్లు 262, విద్యుత్ స్తంభాలు 971 దెబ్బతిన్నాయని, కొన్ని వందల కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్ చెడిపోయిందని అధికారులు తెలిపారు. మెదక్ జిల్లాతో పాటు, నల్గొండ, గద్వాల్, యాదాద్రి, సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల పరిధిలో కూడా నష్టం జరిగిందన్నారు. మొత్తం మీద సంస్థ పరిధిలో వరద ప్రభావానికి 33 కేవి ఫీడెర్స్ - 39, 11 కేవీ ఫీడర్స్ - 296, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు - 280, విద్యుత్ స్తంభాలు 1357 దెబ్బతిన్నాయని, వరద ఇంకా కొనసాగుతుండటం వలన నష్టాలు మరింతగా పెరిగే అవకాశం వున్నదని చీఫ్ ఇంజినీర్, రూరల్ జోన్ బాల స్వామి సీఎండీ కి తెలియజేసారు. భారీ వర్షాల వేళ, పండుగ పర్వదినాన కూడా మొత్తం విద్యుత్ అధికారులు సిబ్బంది పని చేసారని, భారీ వరద ప్రభావంతో మెదక్ జిల్లాల్లో 15 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోగా, సిబ్బంది అహర్నిశలు కృషి చేసి నిన్న రాత్రి వరకు 10 గ్రామాల్లో సరఫరా పునరుద్ధరించారు. భారీ వర్షానికి తోడు, రహదారులు కూడా పూర్తిగా దెబ్బతినడంతో మిగిలిన గ్రామాల్లో రాత్రికి సరఫరా పునరుద్ధరించలేకపోయామని, ఈ రోజు తమ సిబ్బంది రాజి పెట్ గ్రామంలో వున్న నదిలోకి దిగి ఫీడెర్ మరమ్మతు చేసి సరఫరా పునరుద్దరణ గావించారన్నారు. యావత్ విద్యుత్ సిబ్బంది అధికారులు అప్రమత్తంగా ఉండి, యుద్ధప్రాతిపదికన పునరుద్దరణ పనులు గావించడం వలెనే అతి తక్కువ సమయంలో విద్యుత్ సరఫరా అందించగలిగామని, సిబ్బంది పునరుద్దణ పనులు గావించేటప్పుడు భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించేలా చూడాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు.

టాటా సోల్‌ఫుల్ రాగి బైట్స్ నో మైదా చాకో విడుదల

విశాలాంధ్ర - హైదరాబాద్ : టాటా కన్స్యూమర్ ప్రోడక్ట్స్ వారి బ్రాండ్ అయిన టాటా సోల్‌ఫుల్, 'బెటర్-ఫర్ యూ' ప్యాకేజ్డ్ ఫుడ్స్ రంగంలో ముందడుగు వేసిన ప్రస్థానంలో, పిల్లల స్నాకింగ్ విభాగంలో తన తాజా ఆవిష్కరణ అయిన సరికొత్త ఇంకా మెరుగైన రాగి బైట్స్ నో మైదా చాకోను పరిచయం చేసింది. ఇప్పుడిది మరింత చాక్లెట్ కలిగి, క్రంచీగా, పామాయిల్ వాడకుండా తయారు చేయబడిన ఈ మిల్లెట్లతో కూడిన పుష్టికరమైన స్నాక్ చక్కని రుచిని ఇంకా పోషకాలు అందించే పరిపూర్ణ మేళవింపులా ఉంటుంది, ఇవన్నీ మైదా జంక్ లేని బ్రాండ్ హామీతో అందుబాటులోకి వచ్చాయి. ఇది రుచికి ప్రాధాన్యత ఇచ్చి, పోషకాహారానికి ప్రాధాన్యత ఇవ్వాలి అనే బ్రాండ్ సంకల్పాన్ని మరింత బలపరుస్తుంది. పిల్లల కోసం శుభ్రంగా, రుచికరంగా, ఆసక్తికరంగా ఉండే స్నాక్స్‌ను తీసుకురావడంలో టాటా సోల్‌ఫుల్ పయనంలో ఇదొక పెద్ద ముందడుగు. 25శాతం క్రంచీ మిల్లెట్లతో, గిల్ట్-ఫ్రీ ఆరోగ్యకరమైన చిరుతిండిని పిల్లలందరూ ఇష్టపడేలా ఇంకా తల్లిదండ్రులు విశ్వసించేలా, అల్పాహారం చిరుతిండి మధ్య తేడాను సరదా సరదాగా చెరిపేస్తోంది. స్నాక్ సమయాన్ని సరదాగా ఉండే సాహసయాత్రగా మార్చడానికి, ప్రతి ప్యాక్ ఇప్పుడు క్యూఅర్ కోడ్‌తో వస్తుంది, ఇది టాటా సోల్‌ఫుల్ ప్రతినిధి అయిన క్రంచా మంచాతో రూపొందించిన "రాగి ర్యాలీ" అనే థ్రిల్లింగ్ కలిగించే సరికొత్త డిజిటల్ గేమ్‌ను తెస్తోంది.

హైదరాబాద్ పరిధిలో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గణేష్ ప్రతిమల నిమజ్జన కార్యక్రమం సాఫీగా, వేగంగా జరిగేలా చూసేందుకు జీహెచ్ఎంసీ గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రతి నిమజ్జన పాండ్ వద్ద ఒక ఇంచార్జీ అధికారి సర్కిక్ కు నోడల్ అధికారి తో పాటు ఓవరాల్ ఇంచార్జీ గా సంబంధిత డిప్యూటీ కమీషనర్, శానిటేషన్ సిబ్బంది సరిపోను క్రేన్లు, కంట్రోల్ రూమ్, మెడికల్ క్యాంపు, ఎప్పటి కప్పుడు వ్యర్థాలను తొలగించేందుకు శానిటేషన్ సిబ్బంది తో పాటుగా వాహనాలను ఏర్పాటు చేసి సాఫీగా నిమజ్జనం జరిగేలా సిబ్బంది మూడు షిఫ్ట్ లలో పని చేస్తారు నిరంతర విద్యుత్ సరఫరా త్రాగునీటి వసతి ఏర్పాటు చేయనున్నారు. హుస్సేన్ సాగర్, సరూర్ నగర్ చెరువు, ఐడిఎల్ చెరువు, సఫిల్‌గూడ చెరువు, సున్నం చెరువు సహా 20 ప్రధాన చెరువులతో పాటు ఈ 74 కృత్రిమ కుంటలలో నిమజ్జనం జరుగనుంది. తద్వారా ప్రధాన చెరువుల పై ఒత్తిడి తగ్గించడమే కాకుండా సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా సమీపంలో గణేష్ విగ్రహాల నిమజ్జనం కు ప్రజల సౌకర్యం కోసం విస్తృతంగా కృత్రిమ నిమజ్జన పాండ్ లను జిహెచ్ఎంసి ఏర్పాటు చేసింది.

జీహెచ్ఎంసీ పరిధిలోని ఏర్పాటు చేసిన 74 కృత్రిమ నిమజ్జన కేంద్రాలు...

తాత్కాలిక పోర్టబుల్ వాటర్ ట్యాంకులు - 24, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, ఏ.ఎస్.రావు నగర్, సచివాలయ నగర్, ఆఫీసర్స్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ గ్రౌండ్స్, ఎం.ఆర్.ఓ.ఆఫీస్, హయత్‌నగర్, క్రికెట్ గ్రౌండ్, స్విమ్మింగ్ పూల్ పక్కన, సుష్మా థియేటర్, వనస్థలిపురం, గవర్నమెంట్ కాలేజ్ గ్రౌండ్, మున్సిపల్ ఆఫీస్ వెనుక, శివాలయం గ్రౌండ్, రియాసత్నగర్ -. లక్ష్మణేశ్వర ప్లేగ్రౌండ్, జంగం మెట్ - రామ్ లీలా గ్రౌండ్, చింతల్ బస్తీ - ఎస్‌బీపీ గార్డెన్ ఎదురుగా, 100 అడుగుల రోడ్డు - నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ - 2- అమీర్‌పేట్ ప్లేగ్రౌండ్

తాత్కాలిక ఎక్స్కవేషన్ పాండ్లు - 23

దేవేందర్ నగర్ రోడ్, హుడా భారతి నగర్ పార్క్, జెడ్.పి.రోడ్, హస్తినాపురం, ఎన్.టి.ఆర్.నగర్ వెజిటబుల్ మార్కెట్, ఫ్రెండ్స్ కాలనీ షటిల్ కోర్ట్, ఎస్‌బిహెచ్ కాలనీ, సైదాబాద్, బతుకమ్మ బావి, కందికల్ గేట్, గౌలిపురా, వైశాలి నగర్, ఇస్సాదాన్, సర్సాబైకుంట, మైలార్దేవ్‌పల్లి, సంజీవిని హిల్స్, మూసీ నది పక్కన, ఉప్పర్ పల్లి

బేబీ పాండ్లు (శాశ్వతమైనవి) - 27

ఎల్.బి.నగర్ జోన్‌లో చర్లపల్లి చెరువు, కాప్రా చెరువు, నల్ల చెరువు, నాగోల్ చెరువు, మన్సూరాబాద్ పెద్ద చెరువు, చార్మినార్ జోన్‌లో, పాలి కుంట, రాజన్న బావి, ఖైరతాబాద్ జోన్‌లో, నెక్నాంపూర్, నెక్లెస్ రోడ్, దుర్గం చెరువు, మల్కం చెరువు, నల్లగండ్ల చెరువు, గోపి చెరువు, శేరిలింగంపల్లి జోన్‌లో, గంగారం చెరువు, ఖైదమ్మ కుంట, గురునాథం చెరువు, రాయ సముద్రం, కూకట్ పల్లి జోన్‌లో, ముల్కత్వ చెరువు, ఐడీఎల్ బేబీ పాండ్, బాలాజీ నగర్, మూసాపేట్, బోయిన్ చెరువు బేబీ పాండ్, ప్రగతి నగర్ బేబీ పాండ్, ఆల్విన్ కాలనీ, హైదర్నగర్, వెన్నెల గడ చెరువు, లింగం చెరువు, సురారం (మైసమ్మ దేవాలయం పక్కన), కొత్త చెరువు, అల్వాల్ దేవాలయం, సికింద్రాబాద్ జోన్‌లో, సంజీవయ్య పార్క్ సఫిల్‌గూడ, బండ చెరువు

గణనాధునికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వినాయక చవితిని పురస్కరించుకుని మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని గౌతంనగర్ డివిజన్ సిద్ధి దయానంద్ నగర్‌లోని వినాయక నివాస్‌లో ఫ్లాట్ ఓనర్స్ గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోశాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి, బబిత, రాధిక, దీప, పద్మ, రమ్య, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాన్ని దర్శించుకున్న ఏసీపీ

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడా డివిజన్ వెంకటగిరి మహా గణేష్ మండపంలో సుమారు 40 సంవత్సరాల నుంచి వైభవంగా నిర్వహిస్తున్న గణేష్ చతుర్థి వేడుకలు అప్పల సురేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గణేష్ మండపంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఏసిపి వెంకట్‌రెడ్డి హాజరై వినాయకుని పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పల సురేంద్ర యాదవ్ ఏసీపి కి వినాయక ఫోటో జ్ఞాపికగా అందజేశారు. కార్యక్రమంలో ఏ బాలయ్య యాదవ్, ఏ శ్రీశైలం యాదవ్, కె.రాములు, ఏ. సుదర్శన్, ఈ. రవి యాదవ్, గాంధీ, ఏం. నర్సింగ్‌రావు, సంతోష్, నరేంద్ర, గోపాల్ సింగ్, సి బి వేణు, శ్రీనివాస్ మొదలైన వారు పాల్గొన్నారు.

పెద్ద చెరువు వాగుపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మొయినాబాద్: మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు పెద్ద చెరువును జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ స్థానిక అధికారులతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు సలహాలు చేశారు. పెద్ద చెరువు వాగు పారుతుండడంతో వానదారులకు రాకపోకలు చేసే సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయినొద్దీన్, మండల తహసీల్దార్ గౌతమ్ కుమార్, ఇరిగేషన్ డీఈ పరమేశ్వర్ చారి, మున్సిపల్ అధికారులు వెంకటేష్, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడలో మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించడం లక్ష్యమని పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్ అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసే కార్యక్రమంలో భాగంగా గురువారం ఉదయం పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మేయర్ అమర్ సింగ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈశ్వర్ రెడ్డి, కుర్ర శాలిని, శ్రీకాంత్ గౌడ్, బొడిగే కృష్ణ, స్వాతి గౌడ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, పలువురు నాయకులు, పీర్జాదిగూడ మహిళా అధ్యక్షురాలు దుర్గా, మెడిపల్లి హనుమాన్ దేవాలయ డైరెక్టర్లు ప్రషాంత్, పరమేశ్, కాంగ్రెస్ నాయకుడు రాజా రాజు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ అమర్ సింగ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హామీ మేరకు మొదటి దశలో మెడ్చల్-మల్కాజిగిరి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయబడ్డాయని, వాటిలో పలు ఇళ్లు పీర్జాదిగూడలో ఇప్పటికే నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభమై పూర్తి చేయబడతాయని పేర్కొన్నారు.

వినాయక నిమజ్జనానికి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలి

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : రానున్న గణేష ఉత్సవాల నిమజ్జనానికి అవసరమైన ఆయా ఏర్పాట్లను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గురువారం శేరిలింగంపల్లి జోన్‌లోని పలు ప్రాంతాల్లో క్షేత్ర పరిధిలో పర్యటించి శానిటేషన్ పరిస్థితిని, రోడ్ల స్థితిగతులను, చెరువులను తనిఖీ చేసి ఆయా అధికారులకు పలు సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉత్సవాలు జరిగేలా ఆయా అధికారులు సమన్వయంతో ముందస్తు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగాలని, ఎలాంటి ఫిర్యాదులు రావద్దన్నారు. క్షేత్ర పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని శానిటేషన్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ దుర్గం చెరువు, మల్కం చెరువు, గోపి చెరువు, నల్లగండ్ల చెరువులను పరిశీలించారు. సాకి చెరువు వద్ద గల బేబీ పాండ్ ను గణేష్ నిమజ్జనం కొరకు సిద్ధం చేయాలని తెలిపారు. గంగారం చెరువు చుట్టుపక్కల నివాసిత ప్రాంతాల్లో డెంగ్యూ కేసులను గుర్తించడం జరిగిందని, నియంత్రణకు తగిన చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ శాఖ అధికారులకు ఆదేశించారు. ఎప్పటికప్పుడు నివేదికను ప్రధాన కార్యాలయం జోనల్ కార్యాలయాలకు పంపాలని తెలిపారు. గంగారంచెరువు లో ఉన్న వాటర్ హై సిల్టింగ్‌ను యుద్ధప్రాతిపదికన తొలగించాలని, చెరువు నుండి తీసిన గుర్రపు డెక్క తదితర వ్యర్థాలను ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని, వారం లోగా పని పూర్తి కావాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. డార్క్ స్పాట్స్ వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, వినాయక నిమజ్జనం సందర్భంగా విగ్రహాల ర్యాలీ కొనసాగే రహదారులను బాగుండేలా చర్యలు చేపట్టాలని, రోడ్లపై పాట్ హెూల్స్ లేకుండా వెంటనే పూడ్చాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గణేష్ నిమజ్జన ప్రొసీషన్ రూట్లలో బిటి రోడ్లపై డిడిఎం లేయేర్ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో/ ప్రాంతాల్లో భక్తులకు మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు సూచించారు. జోనల్ కమిషనర్ హేమంత్ బోరడేతో పాటుగా శానిటేషన్, లేక్స్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా ప్రచురణ

విశాలాంధ్ర - మొయినాబాద్ : గ్రామ పంచాయతీ వారిగా రూపొందించిన ఓటర్ల తుది జాబితాలను పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేసి నోటీసు బోర్డులో ప్రచురించడం జరిగిందని మండల అభివృద్ధి అధికారి సంధ్య, ఎంపీవో వెంకటేశ్వర్ రెడ్డిలు అన్నారు. గురువారం ప్రభుత్వ ఆదేశాలతో ఆదేశించిన విధంగా మండల పరిషత్ కార్యాలయం నోటీసు బోర్డులో గ్రామ పంచాయతీ వారిగా ఓటర్ల తుది జాబితాను ప్రచురించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొయినాబాద్ మండలంలో ఓటర్ల జాబితాను మండల పరిషత్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఏవైనా తప్పొప్పులు ఉంటే శుక్రవారం తెలియజేయాలన్నారు. 2వ తేదీన పై అధికారులకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. మొయినాబాద్ మండలంలో 19 గ్రామ పంచాయతీలలో 166 పోలింగ్ కేంద్రాలు(వార్డు సభ్యుల) ఓటర్ల జాబితా గ్రామాల వారిగా ప్రచురించడం జరిగిందన్నారు. మండలం లోని మొత్తం ఓటర్ల సంఖ్య 30250 ఓటర్లుగా ఉన్నారని తెలిపారు. మండల సూపరిండెంటెంట్ రహమాన్, కులశేఖర్ పాల్గొన్నారు.

విద్యావాలంటర్‌కి లయన్స్ క్లబ్ చేయూత

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : గంగారాం ప్రభుత్వ పాఠశాలలో విద్యావాలంటరిగా విధులు నిర్వహిస్తున్న సీతా రాధిక లయన్స్ క్లబ్ ఆఫ్ హైద్రాబాద్ 2 నెలల జీతం రూ.24 వేలను అందచేయడం జరిగింది. విద్యావాలంటీర్‌కు ప్రతి నెల స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి జీతాలు అందజేయడం జరుగుతుందని ఈ మేరకు లయన్స్ క్లబ్ ముందుకు రావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుభాష్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యావాలంటరికీ చేయూత అందించడం కోసం మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని లయన్స్ క్లబ్ హెూప్ ప్రధాన కార్యదర్శి కొండ విజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మెన్ బసిరెడ్డి మధూసుధన్ రెడ్డి, క్లబ్ ట్రెజరర్ బర్కా మల్లేశ్ యాదవ్, మారం ప్రసాద్, బస్వరాజు, పాఠశాల అమ్మ అదర్శ పాఠశాల చైర్మెన్ భీమమ్మ, ఉపాధ్యాయ కమిటీ నరహరి తదితరులు పాల్గొన్నారు.

31 నుండి సెప్టెంబర్ 16 వరకు బంజారాల రిజర్వేషన్ స్వర్ణోత్సవ ప్రచార రథయాత్ర

విశాలాంధ్ర - బషీర్ బాగ్: బంజారాల రిజర్వేషన్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు ఈనెల 31వ తేదీ నుండి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రవ్యాప్తంగా రథయాత్రను నిర్వహించనున్నట్లు బంజారా భారత్ కన్వీనర్ డాక్టర్ జగన్ నాయక్ తెలిపారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రథయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీ రవీంద్రనాయక్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవీంద్రనాయక్ మాట్లాడుతూ తెలంగాణలో 1956 నుండి 1976 వరకు 20 ఏళ్లు రిజర్వేషన్లు కోల్పోయి అన్యాయానికి గురయ్యామని, దివంగత ఇందిరా గాంధీ 1976లో పార్లమెంట్లో అమెండ్మెంట్ యాక్ట్ ద్వారా బంజారా లంబాడీలను ఎస్టీలుగా గుర్తించారని గుర్తు ఆయన చేశారు. ఈ రిజర్వేషన్ ద్వారా బంజారాలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించారని పేర్కొన్నారు. ఈ గోల్డెన్ జూబ్లీ కార్యక్రమాన్ని సెప్టెంబర్ 13-14 ల్లో హైదరాబాదులోని నెక్లెస్ రోడ్ లో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. గోరు బంజారా భాషను జాతీయ భాషకు గుర్తించాలని రవీంద్ర నాయక్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బిఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

విశాలాంధ్ర - కారేపల్లి : బీఆర్ఎస్ అధినేత కెసిఆర్ పాలనలోనే గ్రామాలలో ఎంతో అభివృద్ధి జరిగిందని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌లు అన్నారు. గురువారం సింగరేణి మండల పరిధిలోని కారేపల్లి క్రాస్ రోడ్ (రామలింగాపురం)లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సైడు కాలువలు లేకపోవడం వల్ల వర్షాలు కురిసినప్పుడు వర్షపు నీరు అంతా గ్రామంలోని ఇండ్లలోకి చేరుతుందని దీంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎంపీ, ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర సైడ్ డ్రైనేజ్ నిర్మించేందుకు అంచనావేసి తనకు పంపితే ఎంపీ నిధుల నుండి మంజూరు చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ తాత మధుకు గ్రామస్తులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్సీలు మాట్లాడుతూ పదేళ్ల బిఆర్ఎస్ సుపరిపాలనలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో గ్రామాలలో అనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు గడుస్తున్న గ్రామాలలో ఎటువంటి అభివృద్ధి పనులను చేపట్టలేదని విమర్శించారు.

భారీ వర్షాల దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో - సంగారెడ్డి : జిల్లాలో కురిసిన వర్షాల పట్ల అన్ని శాఖలు అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. గురువారం సంగారెడ్డి పట్టణ పరిధిలోని రేణిగుంట ఎర్రగుంట, మాసాను కుంట చెరువులు వరద నీటితో పొంగిపొర్లుతున్న నేపథ్యంలో కలెక్టర్ స్వయంగా పర్యటిం చారు. రేణిగుంట చెరువులో ఏర్పడిన గండిని పరిశీలించిన కలెక్టర్ తక్షణ మరమ్మత్తులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. చెరువు కట్టలు తెగిపోకుండా చర్యలు తీసుకోవాలని, నీరు సవ్యంగా కిందికి పారేలా మార్గాలు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాగులు, చెరువులు, కుంటల వద్దకు ప్రజలు వెళ్లకుండా ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, రెవెన్యూ, పోలీస్, నీటి పారుదలశాఖ, మున్సిపాల్ శాఖలు సమన్వ యంతో కట్టుదిట్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ నంబర్ 08455 - 276155 ఏర్పాటు చేయబడిందని కలెక్టర్ తెలిపారు. కొనసాగుతున్న వర్షాల దృష్ట్యా, సంబంధిత అన్ని విభాగాలు, తక్షణ చర్యలు తీసుకోవాలని కార్యకలాపాలను ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలోని చెరువులు, వాగులు భారీ వర్షాల కారణంగా పొంగిపొర్లే

విధులకు ఆలస్యంగా హాజరైన ఉద్యోగులపై మంత్రి తుమ్మల ఆగ్రహం

విశాలాంధ్ర - హైదరాబాద్ :సచివాలయంలో తన మంత్రిత్వ శాఖ పరిధిలోని శాఖలు, కార్పోరేషన్ల ఉద్యోగుల హాజరుపై మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఉదయం 10.40 వరకు కూడా తమ విధులకు హాజరుకాకపోవడంపై మంత్రి తుమ్మల ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరుకాని ఉద్యోగుల నుండి వివరణ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రేపటి నుండి ఉద్యోగులంతా ఉదయం 10.30 గంటలకు వరకు విధులకు హాజరు కావాలని, హాజరుకాని ఉద్యోగులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఉద్యోగులంతా రైతులకు అందుబాటులో ఉండే విధంగా పనిచేయాలని, రైతులకు కావాల్సిన టార్పలిన్లు అందుబాటులో ఉంచాలని, పంటలు తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. యూరియా పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రానికి వస్తున్న యూరియాను డిమాండ్ ఎక్కువగా ఉన్న జిల్లాల వారిగా కేటాయించాలని, అలాగే నిన్న జిల్లాలలో కురిసిన భారీ వర్షాలకు జరిగిన పంట నష్టం వివరాలు త్వరగా సేకరించాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపిని ఆదేశించారు.

వర్షాలు, వరదల నష్టాలపై ప్రాథమిక నివేదికను సమర్పించండి

విశాలాంధ్ర - హైదరాబాద్ : రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. రాష్ట్రంలో గత కొద్దీ రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వలన జరిగిన నష్టాలపై వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో నేడు సాయంత్రం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అరవింద్ కుమార్, వికాస్ రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు రాహుల్ బొజ్జ, రఘునందన్ రావు, శ్రీధర్, పోలీస్ శాఖ డీజీపీ, అడిషనల్ డీజీ మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రధానంగా నిర్మల్, కామారెడ్డి, మెదక్, సిరిసిల్ల జిల్లాలు అధికంగా నష్టాన్ని చవి చూశాయని, వీటితో పాటు ఇతర జిల్లాల్లో కూడా గణనీయమైన నష్టం వాటిల్లిందని అన్నారు. ఈ నష్టాలకు సంబంధించి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలన్నారు. ఈ ప్రాథమిక నివేదికలతో పాటు జరిగిన నష్టాలను తెలియచేసే ఫోటోలు, వీడియో క్లిప్పింగులు, పత్రిక క్లిప్పింగులు కూడా జతపర్చాలని సి.ఎస్ పేర్కొన్నారు. వివిధ శాఖల కార్యదర్శులు, సంబంధిత జిల్లా కలెక్టర్లు నష్టాలపై పంపిన ఈ ప్రాథమిక నివేదికలను సంకలనం చేయాలని విపత్తుల నిర్వహణ శాఖకు తెలిపారు. ఇప్పటికే పలు జిల్లాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలని రామకృష్ణారావు ఆదేశించారు. వర్షాలు మరికొన్ని రోజులు వచ్చే అవకాశం ఉన్నందున మరింత అప్రమత్తతతో ఉండాలని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు మరణించిన వారి కుటుంబాలకు నిబంధనలను అనుసరించి ఎక్స్‌గ్రేషియాను అందచేయాలని అన్నారు. ముఖ్యమంత్రి పూర్తి స్థాయిలో సమీక్షించనున్నందున సంబంధిత శాఖలన్ని వివరాలతో, తీసుకున్న చర్యల నివేదికలతో సిద్ధంగా ఉండాలని కోరారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళులు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రైతాంగం చేసిన మహత్తర పోరాటం వల్ల నేడు కరెంటు చార్జీలు ఇంకా సామాన్యులకు అందుబాటులో ఉండడానికి కారణమైనదాంట్లో అమరులైనటువంటి రామకృష్ణ బాలస్వామి విష్ణువర్ధన్ రెడ్డిల త్యాగం వృధా కాలేదని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు దశరథ అన్నారు. గురువారం వినాయక్‌నగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో టి యాదయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అమరవీరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా దశరథ మాట్లాడుతూ వ్యవసాయం చేసుకోవడానికి కరెంటు లేకపోవడం కరెంట్ చార్జీలు కూడా పెంచడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రయత్నం చేస్తే నాడు కమ్యూనిస్టు పార్టీలు ఇచ్చిన పిలుపునందుకొని చలో అసెంబ్లీకి వేలాది మంది రైతులు రాగ దానిని తట్టుకోలేని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిరసనకారులపై గుర్రాలతో తొక్కించి పోలీసులతో కాల్పులు జరిపించాడని ఆ ఉద్యమంలో ప్రత్యక్షంగా నాపై కూడా లాఠీఛార్జ్ విపరీతమైన గాయాలయాయని అందుకు ప్రత్యేక సాక్షం తానేనని, ఆ పోరాటం చరిత్ర పుటాల్లో నిలిచిపోతుందని దశరథ అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు, సీనియర్ నాయకులు పి.సత్యనారాయణ, ఏఐటియుసి మండల కార్యదర్శి బి.యాదగిరి, ఎస్.కె అజీజ్, ఎం.లింగం, ఈ.వెంకటేష్, జి.సాయి కుమార్, ఆర్.రమేష్ పాల్గొన్నారు. ప్రజా కళాకారుడు సి.వెంకటాచారి అమరవీరులపై పాటలు పాడి ఉత్తేజాన్ని నింపారు.

'స్థానిక' ఓటర్ల జాబితా సవరణ వాయిదా వేయండి

శాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలు, వరదలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను తక్షణమే వాయిదా వేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీలు ఎల్. రమణ, డాక్టర్ శ్రావణ్ దాసోజు... రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు గురువారం ఒక లేఖ సమర్పించారు. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, ఆసిఫాబాద్, నిర్మల్, భూపాలపల్లి, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలు వరద గుప్పిట్లో చిక్కుకున్నాయని లేఖలో ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయని, వేలాది పశువులు మృత్యువాత పడ్డాయని, రోడ్లు, నీటిపారుదల వ్యవస్థలు పూర్తిగా ధ్వంసమయ్యాయని వివరించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు తమ ప్రాణాలను, ఆస్తులను, పశువులను, పంటలను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నారని, వాళ్లెవరూ కూడా ఓటర్ జాబితాలో తమ వివరాలను తెలుసుకునే అవకాశం లేదన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను చేపట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని నేతలు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగం మొత్తం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున, వారికి ఎన్నికల విధులు అప్పగించడం సరికాదన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఓటర్ల జాబితా సవరణకు ఈ నెల 28 నుంచి సెప్టెంబరు రెండో తేదీ వరకు కేవలం ఐదు రోజుల గడువు ఇవ్వడం సరికాదని పేర్కొన్నారు. భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, ఈ ప్రక్రియలో ప్రజలు గానీ, అధికారులు గానీ పాల్గొనడం అసాధ్యమని తెలిపారు. పంచాయతీ కార్యాలయాలు నీట మునిగాయని, జాబితాల పరిశీలన కష్టమని లేఖలో వివరించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు స్థానిక సంస్థల ఓటర్ల జాబితా రూపకల్పన, ప్రచురణ ప్రక్రియను వాయిదా వేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరారు. జిల్లా కలెక్టర్లతో సంప్రదించి కొత్త షెడ్యూల్‌ను ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. పరిస్థితులు చక్కబడ్డాక తిరిగి ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు.

విశ్వగురు నారాయణగురు జయంతి వేడుకలు

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ ప్రజా సంక్షేమ సంఘం, గురు ధర్మ ప్రచారణ సభ, తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం మేడిపల్లి కమాన్, ప్రజా సంక్షేమ సంఘం ప్రాంగణంలో విశ్వ గురు, సామాజిక తత్వవేత్త నారాయణ గురు 171వ జయంతి ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి, మేడిపల్లి మాజీ సర్పంచ్ కూతాడి నరసింహ, నాదం గౌడ్, పన్నాల శ్రీనివాస రెడ్డి, జైపాల్ రెడ్డి, శారద జ్యోతి ప్రజ్వలన చేసారు. అధ్యక్షులు తూళ్ళ బిక్షపతి గౌడ్, ప్రధాన కార్యదర్శి ఈద చెన్నయ్య, ఉపాధ్యక్షుడు దొడ్ల భాస్కర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి మేడబోయిన బాల నరసింహ ముదిరాజ్, కోశాధికారి ఉడుతల బాలకృష్ణ గౌడ్, కార్యవర్గ సభ్యులు దేవి సింగ్ నాయక్, పుట్టపాక కుమార్ గౌడ్, కె.అశోక్ కుమార్ గౌడ్, సంతోష్ గౌడ్, చేరుకు శివానంద్, పల్లె శరత్, వక్తలు మొహమ్మద్ వహీద్, అఅధ్యక్షులు కుల నిర్మూలన సంఘం, రాజేశ్ నాయక్, బహుజన నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు లూటీ...

అధికారుల ప్రోద్బలంతో ప్రభుత్వ భూములను కొల్లగొట్టి కోట్ల రూపాయలు గడిస్తున్న అక్రమార్కులు...

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : కుత్బుల్లాపూర్ మండల పరిధి గాజులరామారంలో అక్రమార్కులు, అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. ఇక్కడి రెవెన్యూ అధికారులు కొందరు అక్రమార్కులు కబ్జాదారులతో కుమ్మకై ప్రభుత్వ స్థలాలను ఫలహారంల దోచిపెడుతున్నారు. గాజులరామారం పరిధి దేవేందర్ నగర్ బతుకమ్మ బండను ఆనుకొని శివయ్య బస్తీలో సర్వే నెంబర్ 329 ప్రభుత్వ స్థలంలో స్థానికంగా ఉన్న ఓ భూ కబ్జాదారుడు అధికారుల చేతులు తడిపి వారి అండదండతో గుట్టుచప్పుడు కాకుండా ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని నింపుతూ ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్లుగా చేసి పేద ప్రజలకు అమ్ముతూ దర్జాగా సొమ్ము చేసుకుంటున్నాడు. అట్టి కబ్జాలపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదులు అందించినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇదే విషయమై సంబంధిత అధికారికి ఫోన్ చేయగా ఫోన్ ఎత్తకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన సంబంధిత అధికారి ప్రజల ఫిర్యాదులను పక్కన పెడుతూ కబ్జాదారులతో చేతులు కలపడం సిగ్గుచేటని ప్రజలు ఏద్దేవా చేస్తున్నారు. బతుకమ్మ బండ శివయ్య బస్తీలో అధికారుల ప్రోద్బలంతోనే కబ్జాలు జరుగుతున్నాయని స్థానికులు గుసగుసలాడుతున్నారు. ఇలా గాజులరామారం పరిధి పలు ప్రభుత్వ స్థలాలలో వెలుస్తున్న కబ్జాలలో అధికారి హస్తం తప్పనిసరిగా ఉంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ అధికారులుగా కొనసాగుతున్న వారు సర్కారు స్థలాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-దుండిగల్: గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలను హన్మంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20,21,22,23 డివిజన్‌లో శ్రీ సాయి నగర్, దేవేందర్ నగర్, ఆదిత్య కాలనీ, బాచుపల్లి డబల్ బెడ్ రూమ్స్, రామకృష్ణ ఎంక్లేవ్, వాసవి లేఔట్, ప్రశాంతి గోల్డెన్ హిల్స్ స్మశానవాటిక కొరకు, పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించి అతిత్వరలో వారి సమస్యని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ నాయకులు, సీనియర్ నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

భూకబ్జాదారుల నుంచి బాధిత రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - బషీర్ బాగ్ : నిషేధిత జాబితా లో ఉన్న భూములకు ఓఆర్సీలు, కన్వర్షన్లు వెంటనే రద్దు చేయాలని రద్దు చేయాలని, వాటిని ఇచ్చిన ఆర్డీవోపై కఠిన చర్యలు తీసుకోవాలని కొంగర ఖుర్దు బాధిత రైతులు ఎన్ వెంకటేష్ గౌడ్, శేషగిరిరావు, ఎస్ కృష్ణారెడ్డి, గోపాల్, నారాయణలు డిమాండ్ చేశారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూకబ్జాదారుల నుంచి బాధిత రైతులకు న్యాయం చేయాలని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని గ్రామ రైతులు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శేషగిర రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం, కొంగర ఖుర్దు గ్రామ పరిధిలోని సర్వే 2 నుండి 400 వరకు, 200 ఎకరాల భూమిని భూ కబ్జాదారులు ట్యాంపరింగ్ చేసి లేఅవుట్లు ద్వారా క్రయవిక్రయాలు చేస్తున్నారని ఆరోపించారు. 2007లో వక్ఫ్ బోర్డు వారు కొంగర ఖుర్దు గ్రామానికి విచ్చేసి సేద్యం చేస్తున్న రైతులను ఆ భూములు మావేనని బెదిరించారని ఆరోపించారు. దీంతో రైతులంతా ఏకమై హైకోర్టును ఆశ్రయించగా రైతులకు అనుకూలంగా స్టే ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. సాగు చేస్తున్న సందర్భంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్ హయాంలో కొంతమంది భూకబ్జాదారులు అధికారులతో కుమ్మక్కై ఆ భూములకు ఓఆర్సీ ఇచ్చారని పేర్కొన్నారు. దీంతో ఆ భూకబ్జాదారులు ఆ 200 ఎకరాల భూములను లేఅవుట్లు చేసి క్రయవిక్రయాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ భూములను ఎవరు కొనుగోలు చేయవద్దని బాధిత రైతులు కోరారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి తక్షణమే ఓఆర్సీని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

వరద నీటి కాలువ నిర్మాణం పనుల పరిశీలన

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : మియాపూర్ డివిజన్ పరిధిలోని కృషి నగర్ నారాయణ కాలేజీ నుండి దీప్తి శ్రీనగర్ కాలనీ వరకు రూ 43 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మాణం చేపట్టినటువంటి వరద నీటి కాలువ నిర్మాణం పనులను చందానగర్ డివిజన్ సీనియర్ నాయకులు రఘునాథ రెడ్డితో కలిసి మియాపూర్ డివిజన్ గౌరవ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీకాంత్ మాట్లాడుతూ... కృషినగర్ నారాయణ కాలేజ్ నుండి దీప్తి శ్రీ నగర్ కాలనీ వరకు, వరద ముంపు సమస్య శాశ్వత పరిష్కారం కొరకై చేపట్టినటువంటి వరద నీటి కాల్వ నిర్మాణం పనులను సీనియర్ నాయకులు రఘునాథ రెడ్డితో కలసి పరిశీలించడం జరిగినదని, వరద నీరు కాల్వ నిర్మాణం పనులు త్వరలో పూర్తిచేసి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నో ఏండ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయడం జరుగుతుందన్నారు. మియాపూర్ డివిజన్ అభివృద్ధి కోసం పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ సహకారంతో నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజలకు అన్ని రకాల మౌళికవసతుల కల్పనకు కృషి చేస్తాం అని, మౌళికవసతులు కల్పించడంలో ఎక్కడ ఎలాంటి సమస్య తలెత్తకుండా చూస్తామని కార్పొరేటర్ శ్రీకాంత్ తెలిపారు.

విద్యుత్ స్తంభాల మార్పుపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్డు వెడల్పు పనుల నేపథ్యంలో విద్యుత్ స్తంభాల మార్పు అంశంపై చర్యలు తీసుకో వాలని టి.జి.ఎస్, పి.డి.సి.ఎల్. సీఎండీ ముషార్రఫ్ అలీని గురువారం ఉదయం బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మింట్ కాంపౌండ్‌లోని కార్యాలయంలో కలసి విజ్ఞప్తి చేశారు. సీఎండీ ముషార్రఫ్ అలీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చోట స్తంభాల పునర్వ్యవస్థీకర ణకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ చర్యల ద్వారా రాబోయే రోజుల్లో బోడుప్పల్ నివాసులకు ప్రయాణ సౌకర్యం పెరగడం, ట్రాఫిక్ సమస్యలు తగ్గడం జరుగుతుందని మాజీ మేయర్ అజయ్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సీఎండీని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కిరణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

వరదనీటి ప్రవాహ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: వరదానీటి ప్రవాహ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ ఆదర్శ్ నగర్ కాలనీలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇళ్లలోకి నీరు చేరినట్లు స్థానిక కాలనీ వాసుల ద్వారా తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ కాలనీని సందర్శించి వరద నీటి ప్రవాహ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి వరద నీటి ప్రవాహంతో పాటు మురుగునీటి సమస్యను పరిష్కరించామని, ఎత్తయిన కాలనీల నుంచి వస్తున్న వర్షపు నీటితో లోతట్టు ప్రాంతాలలోని ఇళ్లలోకి నీరు చేరడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ఎస్ఎన్డిపి క్రింద ఇప్పటికే అనేక నాలాలను అభివృద్ధి చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో కూడా వర్షపు నీటి సమస్యను పరిష్కరించేందుకు పనిచేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీటి ప్రవాహ సమస్యను పరిష్కరించాలని, ఈ సమస్య శాశ్వత పరిష్కారానికై ప్రత్యేక ప్రణాళికలను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సులముల గోపాల్, ప్రధాన కార్యదర్శి కె.సాగర్‌రావు, కోశాధికారి శ్రీకాంత్ రెడ్డి, సలహాదారు దయాకర్, కాలనీ వాసులు కృష్ణగోపాల్ రెడ్డి, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నవాబ్ భాయ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, చిన్నా చౌదరి, చందు సుంకరి, నవీన్, శివా నాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

1. కె.రామకృష్ణ - కార్యవర్గ సభ్యులు
2. ముప్పాళ్ళ నాగేశ్వరరావు - కార్యవర్గ సభ్యులు
3. జె.వి.సత్యనారాయణమూర్తి - కార్యవర్గ సభ్యులు
4. జి.ఈశ్వరయ్య - కార్యవర్గ సభ్యులు
5. అక్కినేని వనజ - కార్యవర్గ సభ్యులు
6. టి.మధు - కార్యవర్గ సభ్యులు
7. కె.వి.వి.ప్రసాద్ - కార్యవర్గ సభ్యులు
8. డి.జగదీష్ - కార్యవర్గ సభ్యులు
9. జంగాల అజయ్ కుమార్ - కార్యవర్గ సభ్యులు
10. కె.రామాంజనేయులు - కార్యవర్గ సభ్యులు
11. డేగా ప్రభాకర్ - కార్యవర్గ సభ్యులు
12. పి.హరినాథరెడ్డి - కార్యవర్గ సభ్యులు
13. పి.రామచంద్రయ్య - కార్యవర్గ సభ్యులు
14. పి.దుర్గాభవాని - కార్యవర్గ సభ్యులు
15. ఎ.రామానాయుడు - కార్యవర్గ సభ్యులు
16. దోనేపూడి శంకర్ - కార్యవర్గ సభ్యులు
17. యం.యల్.నారాయణ - కార్యవర్గ సభ్యులు
18. బి.గిడ్డయ్య - కార్యవర్గ సభ్యులు
19. సి.జాఫర్ - కార్యవర్గ సభ్యులు
20. ఎస్.రంగనాయుడు - కార్యవర్గ సభ్యులు
21. యం.వేమయ్య యాదవ్ - కార్యవర్గ సభ్యులు
22. టి.మనోహర్ నాయుడు - కార్యవర్గ సభ్యులు
23. ఆర్.రవీంద్రనాథ్ - కార్యవర్గ సభ్యులు
24. ఆవుల శేఖర్ - కార్యవర్గ సభ్యులు
25. సిహెచ్ కోటేశ్వరరావు - కార్యవర్గ సభ్యులు
26. పి.కామేశ్వరరావు - కార్యవర్గ సభ్యులు
27. పి.నారాయణస్వామి - కార్యవర్గ సభ్యులు
28. ఎం. కృష్ణచైతన్య - కార్యవర్గ సభ్యులు
29. జి.కోటేశ్వరరావు - కార్యవర్గ సభ్యులు
30. గాలి చంద్ర - కార్యవర్గ సభ్యులు
31. ఎ.విమల - కార్యవర్గ సభ్యులు
32. పరుచూరి రాజేంద్రబాబు - కార్యవర్గ సభ్యులు ఆహ్వానితులు
33. బందె నాసర్ జీ - కార్యవర్గ సభ్యులు ఆహ్వానితులు

ట్రంప్‌ను ఎదిరించరేం?

మోదీకి డి.రాజా సూటిప్రశ్న

న్యూదిల్లీ: భారత్‌పై అమెరికా సుంకాలతో విరుచుకుపడుతుంటే ప్రధాని మోదీ చోద్యం చూడటం మానేసి తక్షణమే చర్యలకు ఉపకరించాలని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా నొక్కిచెప్పారు. అమెరికా 50 శాతం సుంకం విధించడం ద్వారా భారత్‌పై సుంకాల యద్ధాన్ని ప్రకటించిందని, ఒక సార్వభౌమ దేశాన్ని శాసించేందుకు ప్రయత్నిస్తోందని, దీనిని మోదీ ప్రతిఘటించాలని, అమెరికాకు వ్యతిరేకంగా బలంగా నిలబడాలని, ట్రంప్ యంత్రాంగాన్ని ఎదిరించాలన్నారు. రాజా గురువారం న్యూదిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ స్వతంత్ర ఆర్థిక-విదేశాంగ విధానాలను భారత్ అవలంభించాలని పిలుపునిచ్చారు. 'సుంకాలకు సంబంధించి అమెరికా వైఖరిని సీపీఐ తీవ్రంగా ఖండిస్తోంది. ఈ చర్యలతో అమెరికా ప్రపంచంలోని సార్వభౌమ-స్వతంత్ర దేశాలపై టారిఫ్ యుద్ధాన్ని ప్రకటించింది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయాలో వద్దో అమెరికా ఎలా నిర్ణయిస్తుంది? ఏ దేశానికి ఎగుమతి చేయాలి... ఏ దేశం నుంచి దిగుమతి చేసుకోవాలి... ఏ విధానాన్ని అనుసరించాలన్నది భారత్ స్వయంగా నిర్ణయించుకోలేదు. అమెరికా ఎలా శాసిస్తుంది?' అని రాజా ఆగ్రహం వ్యక్తంచేశారు. మనది సార్వభౌమ దేశం... అమెరికా సామ్రాజ్యవాదానికి బానిస దేశం కాదని, స్వతంత్ర ఆర్థిక-విదేశాంగ విధానాలను కలిగివుండాలని నొక్కిచెప్పారు. ప్రధాని మోదీ అమెరికా యంత్రాంగానికి దీటుగా బదులివ్వాలని డిమాండ్ చేశారు.

సార్వభౌమత్వంపై రాజీ వద్దు

అమెరికా ఏకపక్షంగా భారత్‌పై అదనంగా 25 శాతం (మొత్తం 50శాతం) సుంకాలు అమల్లోకి తేవడాన్ని సీపీఐ కార్యదర్శి వర్గం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌ను శాసించేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తప్పుపట్టింది. దేశ సార్వభౌమ అధికారాలపై రాజీ వద్దని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. దేశ ప్రయోజనాలు, ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్వతంత్ర వాణిజ్య-విదేశీ విధానాలను అనుసరించాలని హితవు పలికింది. అమెరికాకు తలొగ్గవద్దని, ట్రంప్ విధానాలను ఎదిరించాలని పిలుపునిచ్చింది. మన పరిశ్రమలు, ప్రాజెక్టు వర్కర్లకు భద్రతా హామీ ఇచ్చేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరింది. దేశ వాణిజ్య సంబంధాలను శాసించేందుకు అమెరికా ప్రయత్నిస్తుండటం ప్రమాదకర ధోరణికి దారితీస్తుందని, స్వేచ్ఛ-స్వతంత్ర ఆర్థిక కార్యకలాపాల హక్కును హరిస్తుందని సీపీఐ పేర్కొంది. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని ఆపినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పుకోవడాన్ని ప్రస్తావిస్తూ దీనిపై మోదీ సర్కారు స్పష్టతివ్వాలని డిమాండ్ చేసింది. ఇలాంటివి భారత విదేశాంగ విధానంపై ప్రశ్నలకు దారితీస్తాయని... స్వతంత్ర నిర్ణయాధికారాన్ని ప్రశ్నిస్తాయని హెచ్చరించింది. భారతదేశ వ్యూహాత్మక పరిపాలన విషయంలో రాజీ ప్రసక్తే లేదని ప్రజలకు భరోసానివ్వాలని సూచించింది. సామ్రాజ్యవాదుల ఆదేశాలను ఎదిరించాలని, ఆర్థిక-రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి దేశ ప్రజలకు విఘాతం కలగకుండా చూడాలని కోరింది. బాహ్య ఒత్తిళ్ల వేళ అభివృద్ధి చెందుతున్న దేశాలతో సంబంధాలు బలపర్చుకోవాలని, స్వతంత్ర ఆర్థిక విధానాన్ని కలిగివుండాలని సర్కారుకు సూచించింది. అప్పుడే దేశ ప్రయోజనాలకు హామీ లభిస్తుందని సీపీఐ నొక్కిచెప్పింది.

హోంగార్డుల సమస్యలు పరిష్కరించండి

రైతులకు యూరియా, ఎరువులందించండి

సీఎం చంద్రబాబుకు రామకృష్ణ, ముప్పాళ్ల వినతి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముపాళ్ల నాగేశ్వరరావు గురువారం సచివాలయంలో కలిశారు. వివిధ సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ఉమ్మడి రాష్ట్రంలో హోంగార్డులుగా నియామకం పొందిన ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థానికత కలిగిన హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. తెలంగాణలో ఏపీ స్థానికత, ఏపీలో తెలంగాణ స్థానికత కలిగిన హోం గార్డులు పనిచేస్తున్నారని సీఎంకు వివరించారు. వీరు ఇంకా వారి వారి స్వరాష్ట్రాలకు బదిలీ కాకపోవడంతో చాలా అవకాశాలు కోల్పోతున్నారని రామకృష్ణ చెప్పారు. కానిస్టేబుళ్ల ఎంపిక విషయంలో వీరికి రెండు రాష్ట్రాల్లోనూ సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయని వివరించారు. వీరిని వారి స్వరాష్ట్రాలకు బదిలీ చేయించేలా చొరవ తీసుకోవాలని సీఎంను కోరారు. ఇక రాష్ట్ర రైతాంగానికి యూరియాతో పాటు పంటలసాగుకు అవసరమైన ఎరువులనూ అందుబాటులోకి తీసుకురావాలని వారు సీఎం చంద్రబాబును కోరారు.

రాజ్యాంగ రక్షణ కోసమే...

ఉపరాష్ట్రపతి ఎన్నికల పోరుపై నారాయణ

జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రజాస్వామ్య పరిరక్షకుడంటూ సమర్థన

న్యూదిల్లీ: భారత ఉపరాష్ట్రపతి ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షకులకు, రాజ్యాంగ వ్యతిరేకులకు మధ్య జరుగుతున్న పోరుగా సీపీఐ జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ అభివర్ణించారు. దిల్లీలోని ఏపీ భవన్ వద్ద నారాయణ గురువారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీల కూటమి నుంచి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేసిన జస్టిస్ సుదర్శన్‌రెడ్డి కిందిస్థాయి నుండి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, అభ్యుదయ వాదిగా, రాజ్యాంగ ప్రజాస్వామ్య పరిరక్షకుడిగా పేరు గడించిన గొప్ప వ్యక్తి అని నారాయణ పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పేరు ప్రతిపాదించిన వెంటనే ఎన్డీఏ కూటమిలో తీవ్ర భయం, వణుకు నెలకొన్నదన్నారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని మావోయిస్టు అంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యానించడాన్ని నారాయణ తప్పుపట్టారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పట్ల బీజేపీలోని భయాన్ని అమిత్‌షా వ్యాఖ్యలు వ్యక్తం చేస్తున్నాయని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో సుదర్శన్‌రెడ్డిని అంతమొందిస్తారా అని అమిత్ షా వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. ఇప్పటిదాకా ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్కర్ ఏమయ్యారో... అసలు ఉన్నారో లేరో కూడా అర్థం కావడం లేదని పేర్కొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నందునే ధన్కర్‌ను అర్ధాంతరంగా ఆ పదవి నుండి వైదొలిగేలా చేసినట్లు ఆరోపించారు.

ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో విపక్ష పార్టీలన్నీ కలిసి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని అభ్యర్థిగా ప్రకటించాయని, ఆయన అభ్యర్థిత్వానికి భారత కమ్యూనిస్టు పార్టీ కూడా సంపూర్ణ మద్దతు ప్రకటించిందని స్పష్టం చేశారు. సుదర్శన్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఇండియా ఐక్యసంఘటనకు దూరంగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వాగతించిందని తెలిపారు. రాజ్యాంగ రక్షణ కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పనిచేసే జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించుకోవడం చాలా అవసరమని నారాయణ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న చంద్రబాబు నాయుడు, ప్రతిపక్షనేత జగన్ ఈ విషయంలో ఆలోచించాలని, తెలుగువాడైన సుదర్శన్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిలిపిన అభ్యర్థి అంటూ తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ చెప్పడం సరికాదన్నారు. తెలుగువాడైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి తెలుగు రాష్ట్రాల్లోని అన్ని పార్టీలు తమ రాజకీయాలను పక్కన పెట్టి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించడం ద్వారా దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని నారాయణ పిలుపునిచ్చారు.

సీపీఐ సీనియర్ నేతలకు రామకృష్ణ, ముప్పాళ్ల పరామర్శ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: సీపీఐ సీనియర్ నాయకులు ఈడ్పుగంటి నాగేశ్వరరావు, స్టాలిన్‌బాబు, చేకూరి రామకోటేశ్వరరావు, గూడవల్లి నాగేశ్వరరావును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పరామర్శించారు. విజయవాడలో ఈడ్పుగంటి నాగేశ్వరరావు ఇంటికెళ్లిన రామకృష్ణ...ఆయనను పరామర్శించి... యోగక్షేమాలు తెలుసుకున్నారు. గుంటూరులో స్టాలిన్‌బాబు, చేకూరి రామకోటేశ్వరరావు, గూడవల్లి నాగేశ్వరరావును వారి నివాసాల్లో రామకృష్ణ, ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం జీవితాంతం పోరాటం చేసిన సీనియర్ నాయకులు కార్యకర్తలకు స్ఫూర్తిదాయకులని అన్నారు.

అమరావతిపై దుష్ప్రచారం తగదు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): అమరావతిపై జరుగుతున్న తప్పుడు ప్రచారం రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఆటంకం కలిగిస్తోందని నిపుణులు అభిప్రాయపడ్డారు. స్థానిక శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో సీఆర్. మీడియా అకాడమీ అధ్వర్యంలో "అమరావతిపై అబద్ధపు ప్రచారం-భావప్రకటన స్వేచ్ఛ" అనే అంశంపై గురువారం సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ టి.సునీల్ చౌదరి మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛతో పాటు దానికి సంబంధించిన బాధ్యతలను కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అబద్ధపు వార్తల ద్వారా సమాజంలో విద్వేషాలు రాకూడదని, పత్రికా రంగంలో విలువలను నిలబెట్టుకోవడం అత్యంత ముఖ్యమని సూచించారు. ముట్నూరి కృష్ణారావు, నార్ల వెంకటేశ్వరరావు, సి. రాఘవాచారి, ఏబీకే ప్రసాద్ వంటి ప్రముఖులు పాటించిన విలువలు నేటి జర్నలిజంలో మరిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు అధ్యక్షత వహించిన సీఆర్. మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కి రాజధాని అవసరం ఏర్పడిందని, అప్పుడు అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడు ఎవరూ అభ్యంతరం చెప్పలేదన్నారు. అయితే 2019 తర్వాత అమరావతిపై దుష్ప్రచారం మొదలైందని, వర్షాలతో మునిగిపోయిందనే తప్పుడు ప్రచారం ఇప్పుడు కొనసాగుతోందని అన్నారు. "భావప్రకటన స్వేచ్ఛ" పేరుతో అబద్ధపు ప్రచారం చేయడం రాజ్యాంగ పరిమితులకు విరుద్ధమని స్పష్టం చేశారు. నీటిపారుదల నిపుణుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వర్షాలు, వరదలు సహజసిద్ధమని, కేరళ, చెన్నై, హైదరాబాదు, బెంగళూరు వంటి నగరాల్లో కూడా ఇలాంటి సమస్యలు వస్తాయని అన్నారు. అమరావతి ప్రాంతంలో వర్షపు నీటిని నిల్వ చేసుకోవడానికి ఆనకట్టలు, ప్రాజెక్టులు నిర్మించడం అవసరమని సూచించారు. ప్రముఖ చరిత్రకారుడు పావినేని సాయి మాట్లాడుతూ అమరావతికి వేల ఏళ్ల చారిత్రక ప్రాధాన్యత ఉందని, బౌద్ధ, జైన సాంస్కృతిక వారసత్వాన్ని కలిగిన ఈ ప్రాంతం రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రాజధానిగా అభివృద్ధి చెందాలని అన్నారు. అమరావతి రైతు నాయకుడు జొన్నలగడ్డ కిరణ్ మాట్లాడుతూ అమరావతి కేవలం రైతుల రాజధాని కాదని, యావత్తు ఆంధ్రప్రదేశ్ ప్రజల రాజధాని అని స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలన్నిటినీ తట్టుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. చరిత్రకారులు, రైతు నాయకులు, జర్నలిస్టులు, జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అర్హులకు ఫించన్ అందకపోతే కలెక్టర్లదే బాధ్యత: సీఎస్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో అర్హతగల ప్రతి ఒక్కరికీ ఫించన్ అందాలని, ఫించన్ రాలేదని ఫిర్యాదు వస్తే అందుకు కలెక్టరే బాధ్యత వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, భుగర్భ జలాలు, పీఎం కుసుమ్ పథకానికి భూ సంబంధిత అంశాలు, పింఛన్లు, జిల్లా జువెనైల్ జస్టిస్ కమిటీల ఏర్పాటు, వాటి అమలు, భారత వాయు సేన సంబంధిత అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రతినెలా పింఛన్ల పంపిణీలో కలెక్టర్లు, జిల్లా, మండల ప్రత్యేక అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అర్హత గలవారందరికీ తప్పనిసరిగా ఫించన్ అందేలా చూడాలని అన్నారు. పింఛన్‌ల తనిఖీకి సంబంధించి అప్పీళ్లు నెల రోజుల్లో పరిష్కరించాలని సీఎస్ ఆదేశించారు. వ్యతిరేక ప్రచారం రాకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో సీసీఎల్ఏ జి.జయలక్ష్మి, ఆర్టీజీఎస్ సీఈవో ప్రఖర్ జైన్, ఐ&పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, నెడ్ క్యాప్ ఎండీ కమలాకర్ బాబు తదితర అధికారులు పాల్గొన్నారు.

న్యూదిల్లీ: నేవీ, ఆర్మీ, వైమానిక దళం కలిసి ఓ నిర్దిష్ట ప్రాంతం నుంచి ఓ మిలిటరీ కమాండర్ అధ్వర్యంలో ఆపరేషన్స్ నిర్వహించడమే సైనిక భాషలో థియేటర్ కమాండ్ అంటారు. దీని ద్వారా విమానాలు, చాప్టర్లు, గన్స్, ట్యాంకులు, ఆయుధ సామగ్రి, మ్యాన్‌పవర్‌ను కంట్రోల్ చేయడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో 'థియేటర్ కమాండ్' ప్రతిపాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. త్రివిధ దళాలు ఐక్యంగా పనిచేసేందుకు 'థియేటర్ కమాండ్'లు ఏర్పాటు చేయాలని చీఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ రెండు రోజుల క్రితం

'థియేటర్ కమాండ్'పై భిన్నాభిప్రాయాలు

పేర్కొన్నారు. రణ్ సంవాద్ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ థియేటర్ కమాండ్లు ఏర్పాటు చేస్తే, సరిహద్దుల్లో శత్రువులను ఎదుర్కొనడం సులువు అవుతుందన్నారు. సీడీఎస్ అనిల్ చౌహాన్ చేసిన ప్రతిపానను వైమానిక దళ అధినేత వ్యతిరేకించారు. దీంతో మూడు దళాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయినట్లు తెలిసింది. నేవీ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠి ... థియేటర్ కమాండ్ల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నట్లు చెప్పారు. చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకునే అవకాశం ఉందని త్రిపాఠి అన్నారు. ఓ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ఇప్పట్లో థియేటర్ కమాండ్లు అవసరం లేదని ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ తెలిపారు. ఆర్మీ వార్ కాలేజీలో ఆయన మాట్లాడుతూ ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మిలిటరీ మధ్య సహకారం కోసం మరో విధమైన ఫార్మాట్ అవసరం లేదన్నారు. సర్వీస్ చీఫ్‌ల స్థాయిలో సమావేశం ఉంటే సరిపోతుందన్నారు. అయితే థియేటర్ కమాండ్ల అంశంపై గురువారం నేవీ చీఫ్ అడ్మిరల్ త్రిపాఠి మాట్లాడుతూ ... థియేటర్ కమాండ్ విధానం ఏర్పాటే తమ లక్ష్యమన్నారు. తమ శక్తి సామర్థ్యాలకు చెందిన అంశాన్ని.. ఆర్మీ, ఐఏఎఫ్ తో చర్చించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఏకీకృత ప్లానింగ్‌తో ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని, సమైక్యంగా, సమగ్రమైన ఆపరేషన్స్ నిర్వహిస్తామన్నారు.

ఏయూ అధికారుల తీరుపై ఎన్‌బీఏ చైర్మన్ సీరియస్

- వివరణ ఇవ్వాలని పాలక మండలికి లేఖ
- వీసీ తీరుపై ఆచార్యుల ఆగ్రహం
- రాజీనామా బాటలో మరికొందరు

విశాలాంధ్ర-విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు వ్యవహరించిన తీరును సీరియస్ గా తీసుకున్న నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) కమిటీ చైర్మన్ వర్సిటీ పాలక మండలి సభ్యులకు రాసిన లేఖ... కలకలం రేపుతోంది. ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ గుర్తింపు కోసం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని టెక్నికల్ విద్యాసంస్థలు పోటీ పడుతుంటాయి. ఆయా విద్యాసంస్థల విద్యార్థులు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే లోని ఉన్నత విద్యాభ్యాసనకు, ఉద్యోగ అవకాశాలకు ఈ గుర్తింపు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తోంది. అటువంటి ప్రతిష్టాత్మక బృందం ఏయూలో పర్యటిస్తే... వర్సిటీ అధికారులు ఆ బృందానికి సరిగా సహకారం అందించలేదని, వారు అడిగిన సమాచారం కూడా ఇవ్వలేదని ఆఖరి రోజు మాత్రం రెండు కవర్ల రూపంలో గిఫ్ట్ అందజేసినట్టు తెలుస్తోంది. దాన్ని సీరియస్ గా తీసుకున్న ఆ బృందం ఏయూలో జరిగిన విషయాన్ని ఎన్‌బీఏ చైర్మన్‌కు నివేదిక రూపంలో వివరించారు. దీంతో ఈ అంశంపై ఎన్‌బీఏ పాలకవర్గ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యులందరికీ వర్సిటీలో జరిగిన అంశాలను ప్రస్తావిస్తూ ఎన్‌బీఏ చైర్మన్ లేఖ రాశారు. ఎన్‌బీఏ చరిత్రలో దేశంలోనే ఒక విద్యాసంస్థకు సంబంధించి ఇంతవరకు ఇలా జరగలేదని విద్యావేత్తలు అంటున్నారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థగా పేరుగాంచిన ఆంధ్ర యూనివర్సిటీకి ప్రస్తుత వైస్ ఛాన్సలర్ కారణంగానే ఈ దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. వీసీ తీరుతో ఆంధ్ర విశ్వవిద్యాలయం నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్బీఏ) గుర్తింపును ఈ ఏడాదికి కోల్పోవలసి వచ్చిందని ఆవేదన వ్యక్తపరిచారు.

సెనేట్ సమావేశంలో కూడా ఇదే తీరు

ఆంధ్ర విశ్వవిద్యాలయం లో ఇటీవల జరిగిన సెనేట్ సమావేశంలో కూడా ఇదే రీతిన వైస్ ఛాన్సలర్ ఆచార్య జీపీ రాజశేఖర్ వ్యవహరించారని వర్సిటీకి చెందిన కొందరు ఆచార్యులు వెల్లడించారు. సెనేట్ సమావేశం ఆద్యంతం అవగాహనలేమితో, తప్పులు తడక సమాచారంతో సభ్యులను తప్పుదోవ పట్టించారని తెలిపారు. చేపట్టబోయే ప్రాజెక్టులు, విద్యాసంబంధ విషయాలతో సహా విద్యార్థుల సంఖ్యపై కూడా అవగాహన లేకుండా తప్పుడు లెక్కలు చూపించారని మండిపడ్డారు. ఎన్‌బీఏ గుర్తింపు పై కూడా సీరియస్ గా తీసుకోకుండా అవసరమైతే ఎన్‌బీఏ కమిటీతో తాను మాట్లాడతానని, తాను తలచుకుంటే చైర్మన్ ను కూడా వర్సిటీ కే రప్పిస్తాననే ధోరణిలో మాట్లాడినట్టు ఆచార్యులు చెబుతున్నారు. అసలు యూనివర్సిటీలో టెక్నికల్ విద్యకు సంబంధించి 11 విభాగాలకు ఎన్‌బీఏ గుర్తింపు కోసం దరఖాస్తు చేయాలని, కానీ కేవలం నాలుగు విభాగాలకు మాత్రమే దరఖాస్తు చేశారని చెప్పారు. ఇదంతా వీసీ కావాలనే చేస్తున్నట్లు అనిపిస్తోందన్నారు. ఇటీవల వర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకాలపై వారు మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ కి తెలియకుండా గెస్ట్ ఫ్యాకల్టీ నియమించడం సరికాదన్నారు. వీసీ వ్యవహారంలో మార్పు రావడంలేదని, ఇదంతా చూడలేకే రిజిస్ట్రార్ రాజీనామా చేశారని, వర్సిటీలోని కళాశాల ప్రిన్సిపాల్ తో పాటు మరి కొంతమంది అధికారులు కూడా రాజీనామాకు సిద్ధంగా ఉన్నారని వారు వెల్లడించారు. రిజిస్ట్రార్ ను ఏడాది కాలంగా తీవ్రంగా అవమానించినట్టు చెప్పారు. సీనియర్ ఆచార్యునిగా, పరిపాలన దక్షుడిగా పేరు తెచ్చుకున్న ఆచార్య ధనుంజయ్ రావు సేవలను గుర్తించకపోయినా పరవాలేదని, కానీ పొమ్మనకుండా పొగ పెట్టడం అనేలా తానే రాజీనామా చేసేలా వీసీ వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఏయూలో జరుగుతున్న వ్యవహారంపై రాష్ట్ర గవర్నర్ కి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. ఇకనైనా ఏయూ వ్యవహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ గా తీసుకోవాలని, వెంటనే జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దాలని వారంతా కోరారు.

డిప్యూటీ సీఎంకు 'జన'శ్రేణుల ఘనస్వాగతం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం : స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈనెల 30 నిర్వహించే 'సేనాతో సేనాని' కార్యక్రమానికి హాజరయ్యేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గురువారం ఉదయం విశాఖకు ప్రత్యేక విమానంలో చేరుకున్నారు. ఎయిర్ పోర్టులో మంత్రి కందుల దుర్గేశ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, జనసేన నేతలు పవన్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఓ ప్రైవేటు హోటల్లో ముఖ్య నేతల సమావేశానికి హాజరయ్యారు. శనివారం జరగనున్న కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశ ఏర్పాట్లపై సమీక్షించారు. కూటమి ప్రభుత్వంలో జనసేన పాత్రపై కార్యకర్తలకు, అభిమానులకు తెలియజేసేలా దిశానిర్దేశం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన సేనాతో సేనాని సమావేశాలకు శ్రీకారం చుట్టారు. మూడు రోజులు విశాఖలోనే ఉండి కార్యకర్తలు, నేతలతో సమావేశం అవుతారు. సమావేశాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. తాజా రాజకీయ పరిణామాలు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై పవన్ కల్యాణ్ సమావేశాల్లో చర్చిస్తారు. శుక్రవారం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్న 10 మందిని ఎంపిక చేసి... వారితో వివిధ అంశాలపై మాట్లాడతారు. ఉత్తరాంధ్ర ప్రాముఖ్యత తెలియజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. మున్సిపల్ స్టేడియంలో, బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ హాల్లో సమావేశాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. శనివారం ఇందిరా గాంధీ ప్రియదర్శిని స్టేడియంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు పార్టీ శ్రేణులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు ఉపముఖ్యమంత్రి సభా ప్రాంగణానికి చేరుకుని ప్రసంగిస్తారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.